
మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 5 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 300 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

మేరీల్యాండ్‌లో మరోసారి మన అరుణే




2

అక్కడ..వర్క్ ఫ్రమ్ పార్క్!



2



దేశీ జీపీఎస్‌లో కీలక అడుగు..

నిర్దేశిత కక్ష్యలోకి ఎన్వీఎస్-03

శ్రీహరికోట, నవంబర్ 4: స్వదేశీ నేవిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా కీలక అడుగుపడింది. ఇటీవల జీఎస్ఎల్వీ ఎఫ్-18 నింగిలోకి తీసుకెళ్లిన ఎన్వీఎస్-03 నేవిగేషన్ ఉపగ్రహానికి కక్ష్య పెంపు విన్యాసాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ విజయవంతంగా చేపట్టింది. నిర్దేశిత జియోసింక్రోనస్ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అమెరికా జీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఇస్రో సొంతంగా నావిక్ వ్యవస్థ కోసం చేస్తున్న ప్రయత్నాలకు అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. గతంలో ప్రయోగించిన కొన్ని ఉపగ్రహాల్లో పలు అణుగడియారాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యలు, ఎన్వీఎస్-02 ప్రయోగం విఫలం కావడంతో నావిక్ వ్యవస్థకు

...మిగతా 2లో





రాష్ట్ర ప్రగతిలో యాదవులు భాగస్వాములు కావాలె

సదర్ యాదవులకే కాదు..
రాష్ట్ర ప్రజలందరికీ ఆత్మగౌరవ సమ్మేళనం
హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల సహకారం కీలకం
శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4, (మనం బ్యూరో): రాష్ట్ర ప్రగతిలో యాదవులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యాదవులు కోరగానే తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిందనీ, ఇది యాదవులకే కాదు... రాష్ట్ర ప్రజలందరికీ ఆత్మగౌరవ సమ్మేళనమని పేర్కొన్నారు. బుధవారం ఇక్కడి ఎన్టీయార్ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టాలనేదే తమ ప్రయత్నమని ఉద్ఘాటించారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని.. ఇందుకు యాదవ సోదరుల సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లంకొండ అని ప్రస్తావించారు. యాదవ సోదరుల సహకారంతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి చదువు, వ్యాపారాల కోసం వచ్చిన వారిని యాదవ సోదరులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పారు. గోల్కొండ కోట, కాకతీయ రాజవంశం కాలం నాటి నుంచి హైదరాబాద్ అభివృద్ధిలో యాదవ రాజులు, యాదవ సోదరుల కృషి మరువరానిదని పేర్కొన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని పేర్కొన్నారు. సదర్ సమ్మేళనం నిర్వహణకు తమ ప్రభుత్వంలో రూ.5 కోట్లు మంజూరు చేశామని వెల్లడించిన సీఎం రాష్ట్రంలో తాము కులగణన చేసి చూపించామని గుర్తు చేశారు. రాష్ట్రం మోడల్‌ను

...మిగతా 2లో



క్రమశిక్షణ రాహిత్యంపై

పీసీసీ ఫోకస్

దామోదర, లక్ష్మీకాంతరావులకు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు

హైదరాబాద్, నవంబర్ 4, (మనంబ్యూరో): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో వివిధ నియోజక 'వర్గాల'లో నాయకుల మధ్య జరుగుతున్న క్రమశిక్షణ రాహిత్యంపై

...మిగతా 2లో

రాహుల్‌ను ప్రధానిని చేస్తాం

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలిచి తీరుతం

అమిత్ షాకు జగ్గారెడ్డి కౌంటర్



హైదరాబాద్, నవంబర్ 4 (మనంబ్యూరో): రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఛాలెంజ్‌గా తీసుకుంటామని పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. వచ్చే

...మిగతా 2లో

దేవుడి పేరుతో ఇంకెన్ని పాపాలు?

బీజేపీపై కాంగ్రెస్ ఆరోపణలు



ఢిల్లీ, నవంబర్ 4: వీబీ జీరాంజీ ఉపాధి హామీ పథకంలో నకిలీ హాజరు నమోదు చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఇంకెన్ని రోజులు రాముడి పేరు చెప్పుకొని పాపాలు చేస్తారని బీజేపీని ప్రశ్నించారు. క్లోన్ యాప్ల ద్వారా నకిలీ హాజరు నమోదు చేస్తున్న ఉదంతాలు పదే పదే బయటపడుతున్నాయని, ఇది తీవ్రమైన అంశమని ఆయన పేర్కొన్నారు. ''గతంలో అయోధ్యలో రాముడి పేరుతో విరాళాలు సేకరించారు. ఇప్పుడు కూడా

...మిగతా 2లో

గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తెలంగాణ



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి

హైదరాబాద్, నవంబరు 4 (మనం బ్యూరో): తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో డీప్‌టెక్, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. బుధవారం బేగంపేట ఐటీసీ కాకతీయ హోటల్లో ఎఫ్ఐసీసీఐ 100 వేడుకలు, తెలంగాణ

...మిగతా 2లో

ఉమ్మడి ఏపీ శాసనమండలి

మాజీ ఛైర్మన్ చక్రపాణి కన్నుమూత

సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్, నవంబర్ 4 మనంబ్యూరో: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ ఎ.చక్రపాణి బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ధ్లోని స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. శాసనమండలి చైర్మన్‌గా.. సభా వ్యవహారాల నిర్వహణలో, పార్లమెంటరీ సంప్రదాయాల పరిరక్షణలో ఆయన కీలక

...మిగతా 2లో

ఎల్‌నినో నేపథ్యంలో స్వచ్ఛమైన

నీటి వినియోగం

వనరుల అన్వేషణపై కాలుష్య నియంత్రణ మండలి దృష్టి



2



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

- ఎడిటర్

యుద్ధం వద్దు.. అమెరికన్లూ ఇదే చెప్పారు

ఇరాన్ సుప్రీం మొజ్తాబా ఖమేనీ



టెహ్రాన్, నవంబర్ 4: అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి ప్రతికూలంగా వస్తున్న వేళ ఇరాన్ స్పందించింది. ఈ ఫలితాలతో ఇరాన్ పట్ల అమెరికా తీరు మారుతుందని ఊహించవద్దని సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇరాన్‌పై అమెరికా మరోసారి భీకర దాడులు చేయవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో సుప్రీం

...మిగతా 2లో

నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదు?: మాజీ ఎంపీ కవిత

పోలవరం బనకచర్లపై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

3

మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 4 (మనంబ్యూరో): రాష్ట్రంలో మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తరహాలో అల్పాదాయ కుటుంబాలకు జీ ప్లస్ 5 అంతస్తుల ఇందిరమ్మ టవర్లు

...మిగతా 2లో

కాన్సస్ కంచుకోట కూలింది..

94 ఏళ్ల తర్వాత.. డెమోక్రాట్ల సంచలన విజయం



కాన్సస్, నవంబర్4: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫలితాల్లో డెమోక్రాట్లు భారీ ఆధిక్యంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే సెనెట్లో ఆధిపత్యం సాధించగా.. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు మెజార్టీ మార్క్ (218) దాటేశారు. ఇక కాన్సస్లో రిపబ్లికన్ల కంచుకోట కూలింది. 94 ఏళ్ల తర్వాత కాన్సస్ రాష్ట్రంలో సెనెట్ స్థానం డెమోక్రాట్ల వశమైంది. కాన్సస్‌లో దశాబ్దాలుగా కొనసాగుతోన్న రిపబ్లికన్ల ఆధిపత్యానికి డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హమిల్టన్ తెరదించి చరిత్ర సృష్టించారు. సిట్టింగ్ రిపబ్లికన్ అభ్యర్థి రోజర్

...మిగతా 2లో

హర్మూజ్‌లో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు



టెహ్రాన్,నవంబర్ 4: భారత్ సహా తమ మిత్ర దేశాల నౌకలకు హర్మూజ్‌లో ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ విధాన కమిటీ డిప్యూటీ ఛైర్మన్ అమీర్ హయత్ పేర్కొన్నారు. ఇతర దేశాల వాణిజ్య నౌకలపై విధించిన ఆంక్షలు లేకుండానే.. ఇకపై భారత్, చైనా, ఇరాక్, ఖతార్ నౌకలు హర్మూజ్ జలసంధిని దాటవచ్చని స్పష్టం చేశారు. భారత్ నుంచి పశ్చిమాసియా దేశాలకు ఔషధాల సరఫరాను సులభతరం చేసే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆయా దేశాల నౌకల నుంచి రవాణా రుసుమును మాత్రం వసూలు చేస్తామని పేర్కొన్నారు. 'ప్రస్తుతం హర్మూజ్‌లో

...మిగతా 2లో

కోట్లల్లో ఓట్లు.. బ్యాలెట్ ఓటింగ్

అయినా గంటల్లోనే ఫలితాలు



వాషింగ్టన్,నవంబర్ 4: 15 కోట్లకు పైగా ఓట్లు.. అన్నీ పేపర్ బ్యాలెట్లు.. 10వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు.. ఓటింగ్ పూర్తయిన గంటల్లోనే వచ్చేసిన రిజల్ట్స్ .. అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాల సరళిని చూస్తే ఇంత తక్కువ సమయంలో అన్ని ఓట్లను ఎలా లెక్కించారనే సందేహం రాకమానదు. మరి అమెరికాలో కౌంటింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుంది? కోట్ల ఓట్లను అంత వేగంగా ఎలా లెక్కేస్తున్నారు? అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల విజేతలెవరో దాదాపు తేలిపోయింది. అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన డెమోక్రాట్లు అటు ప్రతినిధుల సభ, ఇటు

...మిగతా 2లో



గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

డీప్‌టెక్ లీడర్షిప్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భట్టి విక్రమార్క హాజరై, మాట్లాడారు. పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మారాలని మార్గనిర్దేశం చేశారు.

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలు..

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాల సమన్వయంతో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.యువ స్టార్టప్లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, సులభతర ధ్రువీకరణ విధానాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం, పరిశ్రమలు అండగా నిలవాలని అన్నారు. విజయవంతమైన ప్రయోగాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ, స్మార్ట్ గ్రిడ్ వ్యవస్థల్లో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించాలని చెప్పుకొచ్చారు.

డీప్‌టెక్ రంగం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు..

వైద్య రంగంలో వ్యాధులను ముందుగానే గుర్తించే ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావాలని భట్టి విక్రమార్క అభిలాషించారు. రైతులకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సాంకేతిక ఉత్పత్తుల రూపకల్పన దశ నుంచే సామాన్యులకు అందుబాటులోని ధరలను దృష్టిలో పెట్టుకోవాలని పేర్కొన్నారు. డీప్టెక్ రంగం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పాదకత పెంపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలని సూచించారు. ఆవిష్కరణల ఫలితాలు ప్రజల ఆదాయాల పెరుగుదల, మెరుగైన ప్రభుత్వ సేవలు, ఉపాధి అవకాశాల రూపంలో కనిపించాలని పేర్కొన్నారు. భారతీయ ఆలోచనలు, ఆవిష్కరణలు ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలుగా ఎదగాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

మేరీల్యాండ్‌లో మరోసారి మన అరుణే

మేరీల్యాండ్, నవంబర్ 4: అమెరికా రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న భారత సంతతి వ్యక్తులు.. తాజా మధ్యంతర ఎన్నికల్లోనూ సత్తా చాటుతున్నారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమొక్రాట్ నేత, తెలుగు మూలాలున్న అరుణా మిల్లర్ విజయం సాధించారు. హైదరాబాద్‌లో జన్మించిన అరుణ.. వరుసగా రెండోసారి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికవడం విశేషం.అరుణా మిల్లర్ 1964 నవంబర్ 6న హైదరాబాద్‌లో తెలుగు కుటుంబంలో జన్మించారు. ఆమెకు ఏడేళ్ల వయసున్నప్పుడే తల్లిదండ్రులు అమెరికాకు వలస వెళ్లారు.

న్యూయార్క్‌లోని పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసిన అరుణ.. మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పట్టా పొందారు. డేవ్ మిల్లర్ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం.

ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజినీర్‌గా పనిచేసిన అరుణ.. కాలిఫోర్నియా, వర్జీనియా, హవాయి రాష్ట్రాల్లో దాదాపు 25ఏళ్ల పాటు సేవలందించారు. రోడ్డు భద్రత, ప్రజా రవాణాలో మెరుగైన వసతుల కోసం కృషి చేశారు. 1990లో మేరీల్యాండ్‌కు మకాం మార్చిన ఆమె.. మోంట్గోమరీ కౌంటీలో స్థిరపడ్డారు.

అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె.. డెమొక్రటిక్ పార్టీ కోసం పనిచేశారు. 2010లో తొలిసారి మేరీల్యాండ్ హౌస్ ఆఫ్ డెలిగేట్స్‌కు ఎన్నికై.. 2010 నుంచి 2018 వరకు సభ్యురాలిగా కొనసాగారు.కీలక కమిటీల్లో సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. పలు అవార్డులూ సొంతం చేసుకున్నారు.2022లో మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా పోటీ చేసి విజయం సాధించిన ఆమె.. రాష్ట్రస్థాయి పదవి చేపట్టిన దక్షిణాసియా మహిళగానూ ఘనత సాధించారు. తాజా మధ్యంతర ఎన్నికల్లోనూ సత్తా చాటి మరోసారి ఆ పదవిని సొంతం చేసుకున్నారు.

అరుణ విజయంపై అమెరికాలోని తెలుగు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత మూలాలున్న వ్యక్తులు అమెరికాలో ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్నారనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నాయి.

మాజీ చైర్మన్ చక్రపాణి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

పాత్ర పోషించారు. శాసన వ్యవస్థలో విశేష అనుభవం కలిగిన నేతగా గుర్తింపు పొందారు. చక్రపాణి మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలిని పునరుద్ధరించిన తర్వాత తొలి చైర్మన్‌గా డాక్టర్ చక్రపాణి ఎంతో నిబద్ధతతో పనిచేశారని గుర్తుచేసుకున్నారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అంకితభావంతో ఆయన ఎన్నో సేవలందించారని కొనియాడారు.

మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించనున్నట్లు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా గృహ ప్రవేశాలు జరిగిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు జరపాలని మంత్రి తెలిపారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో నిర్వహించే సంబరాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేక పోయినప్పటికీ.. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న మంత్రి పొంగులేటి.. ఇప్పటివరకు రూ.22,500 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా.. అందులో 2,21,500 గృహ ప్రవేశాలు జరిగాయని.. మరో 1.90 లక్షల గృహాలు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్లో లక్ష ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అక్కడ.. 'వర్క్ ఫ్రమ్ పార్క్'!

రియాద్, నవంబర్ 4: వర్క్ ఫ్రమ్ హోమ్, హైబ్రిడ్ వర్క్.. కరోనా తర్వాత ఈ పదాలు జాబ్ మార్కెట్లో తరచూ వినిపిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా 'వర్క్ ఫ్రమ్ పార్క్' పదం ట్రెండ్ అవుతోంది. ఈ తరహా సౌకర్యాన్ని దుబాయ్ అందుబాటులోకి తీసుకువచ్చింది. అల్ బర్షా పాండ్ పార్క్లో ఈ హబ్ ఏర్పాటైంది

ఫ్రీలాన్సర్లు, ఇంటి నుంచి, హైబ్రిడ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తోన్న ఉద్యోగులు ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా పనిచేసేలా చూసేందుకు ఈ 'వర్క్ ఫ్రమ్ పార్క్' కాన్సెప్ట్‌ను దుబాయ్ మున్సిపాలిటీ ఆవిష్కరించింది. పార్క్‌లో కూర్చొని పనిచేయడానికి వైఫై, పవర్ సాకెట్లు అందుబాటులో ఉన్నాయి. బయటి గాలి, వేడి తగలకుండా అనుకూల వాతావరణం కావాలని కోరుకునేవారి కోసం పార్క్‌ల్లోనే కొన్ని ఇండోర్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అవి వాడుకోవాలంటే ఒకరోజుకు 50 దిర్హమ్లు (దాదాపు రూ.1300) పెట్టి ఒక పాస్ తీసుకోవాల్సి ఉంటుంది. అలాకాకుండా మామూలుగా పార్కు వచ్చి పనిచేసుకునేవారు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన పనిలేదు.

దుబాయ్ మున్సిపాలిటీ, ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ ప్లాట్‌ఫామ్ లెట్స్ వర్క్, నిర్మాణ సంస్థ అమనా కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఉద్యోగులకు తగ్గట్టుగా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్న 'వర్క్ ఫ్రమ్ పార్క్' దుబాయ్‌లోనే తొలిసారి.

తేజస్వి యాదవ్‌లో రాహుల్ కనిపిస్తున్నరు

- **పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు**

హైదరాబాద్, నవంబర్ 04, (మనం బ్యూరో): బీహార్ నుంచి వచ్చిన తేజస్వీ యాదవ్‌లో రాహుల్ గాంధీ కనిపిస్తున్నరని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. బుధవారం ఇక్కడి ఎన్టీయార్ స్టేడియంలో జరిగిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనానికి బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ హాజరయ్యారు. ఈ సమ్మేళనానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ చీఫ్ మాట్లాడుతూ తేజస్వీ భాయ్...మీ ముఖంలో రాహుల్ గాంధీ కనిపిస్తున్నరని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తేజస్వీ, రాహుల్ గాంధీ కవల సోదరుడిగా కనిపిస్తున్నారనీ, మీ స్నేహం కూడా అలాగే కొనసాగుతోందని పేర్కొన్నారు. మీరు రాహుల్ గాంధీతో కలిసి నడిపిస్తున్న స్నేహాన్ని దేవుడు అలాగే కాపాడాలి, ఇది దేశానికి చాలా అవసరం అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి మీ స్నేహం ఎంతో అవసరమనీ, దేవుడు దానిని ఎప్పటికీ అలాగే ఉంచాలన్నారు. మా తెలంగాణలో యువ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లే బీహార్‌లో మీ రూపంలో మరో యువ ముఖ్యమంత్రిని చూడాలని మేము ఆశిస్తున్నామని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

క్రమశిక్షణ రాహిత్యంపై పీసీసీ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టి సారించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు మధ్య చెలరేగిన వివాదం విషయంలో వారిని పిలిచి మాట్లాడనున్నారు. గురువారం గాంధీ భవన్‌కు రావాల్సిందిగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీ కాంత రావుకు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సూచించారు. ఆతర్వాత మిగతా నియోజక వర్గాల్లో ఇటీవల జరిగిన క్రమశిక్షణ రాహిత్యంపై పీసీసీ చీఫ్ విచారణ చేయనున్నారు. ఇటీవల రామ్‌లీలా మైదానంలో ఏఐసీసీ నేతృత్వంలో నిర్వహించిన చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తనను మంత్రి దామోదర అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా నీ అంతు చూస్తాననీ కుటుంబం మొత్తాన్ని లేపేస్తానని బెదిరించాడని పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావును గురువారం గాంధీభవన్‌కు రావాల్సిందిగా ఆదేశించినట్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

నిర్దేశిత కక్ష్యలోకి ఎన్వీఎస్-03

(మొదటి పేజీ తరువాయి)

అంతరాయం ఏర్పడింది. ఇప్పుడు ఎన్వీఎస్-03 నిర్దేశిత కక్ష్యకు చేరడం విజయంగా భావిస్తున్నారు. దీంతో నేవిగేషన్ సేవల సామర్థ్యం మరింత పెరగనుంది. నావిక్ వ్యవస్థ ద్వారా భారత భూభాగంతోపాటు సరిహద్దుల వెలుపల సుమారు 1500 కిలోమీటర్ల పరిధిలో అత్యంత కచ్చితమైన సమాచార సేవలు అందనున్నాయి. రవాణా, విమానయానం, సముద్ర ప్రయాణాలు, వాహనాల పర్యవేక్షణ, అత్యవసర సేవలు తదితర రంగాల్లో ఈ వ్యవస్థ కీలకంగా ఉపయోగపడనుంది.

రాహుల్‌ను ప్రధానిని చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 14 సీట్లు గెలిచి తీరుతామని స్పష్టం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీ ఇంట్లోనే ప్రధాని పదవి పుట్టిందనీ, ఆయన ప్రధాని కావాలనుకుంటే 2004లోనే అయ్యే వారని పేర్కొన్నారు. రాముడి పేరు చెప్పుకుని మూడు సార్లు మీ మోడీ ప్రధాని అయ్యారు...రాముడి పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చారు... కానీ, ఆయన అడుగు జాడల్లో పని చేయడం లేదని ఆక్షేపించారు. స్వతంత్ర ఉద్యమంలోనే మహాత్మా గాంధీ రఘుపతి రాఘవ రాజారాం అని రాముడి భజన చేశారనీ, అప్పుడు బీజేపీ, మోడీ, అమిత్ షాలు కూడా పుట్టి ఉండరని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే అవకాశం లేదంటున్న అమిత్ షా అధికారంలోకి రాకముందు ఏం జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పడ్డప్పుడు సోనియా, రాహుల్ ప్రధాని కావాలని ఎంపీలంతా తీర్మానం చేశారనీ, కానీ, వారు ఆ పదవిని తిరస్కరించారని గుర్తు చేశారు. రాహుల్ ప్రధాని కాలేరని చెప్పే హక్కు అమిత్ షాకు లేదని స్పష్టం చేశారు. అమిత్ షా అహంకారంతో మాట్లాడిన మాటలకు సమాధానం ఇస్తాము రానున్న ఎన్నికల్లో 17 స్థానాలకు గాను 14 ఎంపీ స్థానాలను గెలిచి ఇస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు బలం ఉంది...బీజేపీకి లేదనీ కేవలం అధికారం కోసమే బీజేపీ శ్రీరాముడి పేరును ఉపయోగిస్తున్నదని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని అనుకుంటే ఐపోతారు దేశ ప్రజలు రాహుల్‌ను ప్రధానిని చేస్తారని స్పష్టం చేశారు. ఈ దేశ ఓటర్లను శాసించే హక్కు బీజేపీకి లేదు, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమని ఈ సందర్భంగా జగ్గారెడ్డి స్పష్టం చేశారు.



దేవుడి పేరుతో ఇంకెన్ని పాపాలు?

(మొదటి పేజీ తరువాయి)

రాముడి పేరు చెప్పుకొని పాపాలు చేస్తున్నారు. దేవుడి పేరుపై చేయడానికి ఇంకెంత పాపం మిగిలి ఉందని'' బీజేపీని ప్రశ్నించారు. ఇది కేవలం అవినీతి మాత్రమే కాదని, దేవుడి పేరుతో పేద ప్రజల నమ్మకాన్ని, హక్కులను, ఉపాధిని మోసపరచడమని అన్నారు.

94 ఏళ్ల తర్వాత.. డెమొక్రాట్ల సంచలన విజయం

(మొదటి పేజీ తరువాయి)

మార్క్‌పై ఆయన సంచలన విజయం సాధించారు. 1932 తర్వాత డెమొక్రటిక్ పార్టీ తరఫున సెనెటర్‌గా గెలిచిన మొదటి వ్యక్తిగా నిలిచారు.

డీసీ మమ్దానీ విజయం..

ఇక అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి. కొత్త మేయర్‌గా డెమొక్రటిక్ పార్టీకి చెందిన జనీస్ లూయిస్ జార్జ్ ఎన్నికయ్యారు. జనవరి 2న మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

''వాషింగ్టన్‌ను కమ్యూనిస్టుల చేతిలోకి వెళ్లనివ్వబోం'' అంటూ ట్రంప్ ఎన్నికల ప్రచారం సమయంలో చెప్పినా ప్రయోజనం లేకపోయింది. రాజధాని నగరం డెమొక్రాట్ల చేతిలోకి వెళ్లకుండా నిలువరించలేకపోయారు. ఇప్పటికే కీలక నగరం న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ విజయం ట్రంప్‌నకు ఎదురుదెబ్బ. మమ్దానీ ప్రవేశపెట్టిన ఉచిత ప్రజారవాణా, అందరికీ అందుబాటులో ఉండేలా గృహవసతి వంటి విధానాలను వాషింగ్టన్‌లో కూడా తీసుకువస్తామని జనీస్‌ప్రచారం చేసి, విజయం సాధించారు. అందుకే ఈమెను రాజకీయ విశ్లేషకులు డీసీ మమ్దానీగా పిలుస్తున్నారు.

తొలి ముస్లిం సెనెటర్‌గా..

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో మరో రికార్డు నమోదైంది. మిషిగన్ రాష్ట్రంలో సెనెట్ స్థానం కోసం జరిగిన హోరాహోరీ పోరులో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయెద్ విజయం సాధించారు. అమెరికా చరిత్రలోనే మొట్టమొదటి ముస్లిం యూఎస్ సెనెటర్‌గా నిలిచి ఆయన చరిత్ర సృష్టించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మైక్ రోజర్స్‌ను ఓడించారు.

యుద్ధం వద్దు.. అమెరికన్లూ ఇదే చెప్పారు

(మొదటి పేజీ తరువాయి)

లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది. రానీయులు కూడా అమెరికా పట్ల తమ వైఖరిని మునుపెన్నడూ లేనంత స్పష్టంగా అర్థం చేసుకున్నారని మొజ్తాబా పేర్కొన్నారు. అయినప్పటికీ, అమెరికా దాడులకు పాల్పడితే ఇరాన్ ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలను ధ్వంసం చేయడం, హర్మూజ్ జలసంధిలో పట్టుసాధించడం వంటివి అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే చర్యలేనన్నారు.

ఫలితాలను స్వాగతిస్తున్నాం..

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఫలితాలను ఇరాన్ నేతలు స్వాగతించారు. యుద్ధం వద్దు అనే విషయాన్ని అమెరికన్లు చెబుతున్నట్లు అర్థమవుతోందని, ఇదే సందేశాన్ని తాము కూడా సమర్థిస్తున్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు.

హర్మూజ్‌లో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు

(మొదటి పేజీ తరువాయి)

రవాణా ఆంక్షల నుంచి భారత్, చైనా, ఇరాక్, ఖతార్లకు మినహాయింపు ఇచ్చాము. ఇకపై ఆయా దేశాల నౌకలు జలసంధిలో స్వేచ్ఛగా ప్రయాణిస్తాయి, అమెరికన్లు కూడా వాటిని అడ్డుకోరు. ఇరాన్ దౌత్య, ఆర్థిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయనే కారణంతోనే ఈ మినహాయింపులు ఇచ్చాము. భారత్ నుంచి ఔషధాల దిగుమతిని సులభతరం చేయడానికి, చైనా నుంచి రాజకీయ మద్దతు పొందడానికి ఈ చర్యలు చేపట్టాం' అని అమీర్ హయత్ పేర్కొన్నారు. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గంగా ఉన్న హర్మూజ్‌లో నౌకాయానంపై ఆంక్షలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఎల్‌నినో నేపథ్యంలో స్వచ్ఛమైన నీటి వినియోగం

- **వనరుల అన్వేషణపై కాలుష్య నియంత్రణ మండలి దృష్టి**

హైదరాబాద్, నవంబర్ 04, (మనం బ్యూరో): రాష్ట్రంలో ఎల్నినో ప్రభావం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు, స్వచ్ఛమైన నీటి వినియోగానికి ప్రత్యామ్నాయ వనరులను అన్వేషించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో శుద్ధి చేసిన పారిశ్రామిక వ్యర్థజలాలను పారిశ్రామిక అవసరాలకు పునర్వినియోగించుకునే అంశంపై బేగంపేటలోని టిజిపిసిబి హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ పరిశ్రమల ప్రతినిధులతో అధికారులు సమావేశాన్ని నిర్వహించారు.



స్థానిక సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలకు చెందిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపిలు) ద్వారా శుద్ధి చేసిన గృహ వ్యర్థజలాలను డ్రైనేజీల్లోకి విడుదల చేయకుండా, పారిశ్రామిక అవసరాలకు పునర్వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులు పారిశ్రామికవేత్తలకు సూచించారు. తాగునీటియేతర అవసరాలు, పారిశ్రామిక అవసరాల కోసం భూగర్భ జలాలు, స్వచ్ఛమైన నీటిపై ఆధారపడటాన్ని తగ్గించి, అందుబాటులో ఉన్న శుద్ధి చేసిన వ్యర్థజలాలను ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించుకోవాలని వారు దిశా నిర్దేశం చేశారు. పరిశ్రమల ప్రతినిధులు జీడిమెట్ల ఎఫ్లూయెంట్ ట్రీట్మెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సందర్శించి పనితీరును పరిశీలించారు. ఈ ప్రక్రియ ద్వారా లభిస్తున్న శుద్ధి చేసిన నీరు నాణ్యతాపరంగా మెరుగ్గా ఉండటంతో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ పరిశ్రమల అవసరాలకు వినియోగించుకోవచ్చని అధికారులు వారికి వివరించారు. తద్వారా తాగునీటియేతర అవసరాలకు స్వచ్ఛమైన నీటి వినియోగాన్ని తగ్గించి, ఆదా చేసిన నీటిని ప్రజల ఇతర అవసరాలకు అందుబాటులో తెచ్చేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు.

అయినా గంటల్లోనే ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

సెనెట్లో ఆధిపత్యాన్ని సాధించారు. నవంబరు 3న జరిగిన ఈ ఎన్నికల్లో దాదాపు 10 కోట్ల మందికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంతకుముందే ప్రీ ఓటింగ్, ఈ-మెయిల్ సదుపాయంతో 5.7 కోట్ల మందికి పైగా ఓటేశారు. అయితే, ప్రజలు ఓట్లు వేసింది పేపర్ బ్యాలెట్లపైనే అయినా.. వాటిని రీడ్ చేసేందుకు అగ్రరాజ్య అధికారులు ఎలక్ట్రానిక్ స్కానర్లను వినియోగిస్తారు. అందువల్ల కౌంటింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతుంది.

ఈ పేపర్ బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు పక్కన ఉన్న బాక్సులో ఓటర్లు తమ నిర్ణయాన్ని తెలియజేస్తారు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన వెంటనే ఆ బ్యాలెట్ స్కానింగ్ మెషిన్ నుంచి వెళ్తుంది. అక్కడ స్కానర్ దాన్ని రీడ్ చేసి.. సదరు అభ్యర్థి ఖాతాకు ఓటును జమ చేస్తుంది. పెద్ద పెద్ద పోలింగ్ కేంద్రాల్లో హైస్పీడ్ మెషిన్లు ఉంటాయి. ఇవి ప్రతి గంటకు వేలాది బ్యాలెట్ పేపర్లను స్కాన్ చేసి ఓట్లను లెక్కిస్తాయి. అయితే, మెషిన్ స్కాన్ చేసినప్పటికీ అసలైన బ్యాలెట్ పత్రాలను అధికారులు భద్రపరుస్తారు. ఎక్కడైనా ఓట్లలో తేడా అనిపించిన సందర్భాల్లో మ్యానువల్గా ఈ పేపర్లను లెక్కించి ఫలితం నిర్ణయిస్తారు.

ఇక, అమెరికన్లకు పోలింగ్ రోజుకంటే ముందే ఓటు వేసే సదుపాయం ఉన్న సంగతి తెలిసిందే. ఆసక్తి ఉన్నవారు తమకు నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు ముందుగానే వెళ్లి ఓటు వేయొచ్చు. లేదంటే పోస్టు/ఈమెయిల్ ద్వారా పంపించొచ్చు. ఈ అవకాశం 47 రాష్ట్రాలతోపాటు వాషింగ్టన్ డీసీలోనూ ఉంది. తాజా మిడ్‌టర్మ్‌లో ఈ సదుపాయాన్ని 5.7కోట్ల మందికి పైగా వినియోగించుకున్నారు. 43 రాష్ట్రాల్లో ఈ పోస్టల్ ఓట్లను పోలింగ్ రోజుకు ముందే పరిశీలించే అనుమతి ఉంది. అంటే.. ఓటరు పేరు, సంతకం ఇతరత్రా వివరాలను పరిశీలించి బ్యాలెట్ పేపర్లను స్కానింగ్ కోసం సిద్ధంగా ఉంచుతారు. పోలింగ్ రోజు వాటిని స్కాన్ చేసి లెక్కిస్తారు. కొన్ని రాష్ట్రాల్లో పోలింగ్కు ముందే పోస్టల్ బ్యాలెట్లను స్కాన్ చేసేందుకు కూడా అనుమతి ఉంది. అయితే ఓటింగ్ పూర్తయిన తర్వాతే ఆ ఫలితాలను బయటకు వెల్లడిస్తారు.వాస్తవానికి ఈ కౌంటింగ్ ప్రక్రియ అంతా పూర్తయ్యేందుకు కొన్ని రోజులు పడుతుంది. కానీ, గంటల్లోనే ఫలితం బయటకు రావడానికి కారణం మీడియా సంస్థల అధ్యయనాలే..! 1848 నుంచి అసోసియేటెడ్ ప్రెస్ ఈ ఎన్నికల ఫలితాలను ప్రచురిస్తోంది. దీంతో పాటు ఇతర మీడియా సంస్థలు కూడా పోలింగ్ కేంద్రాల నుంచి సమాచారాన్ని సేకరించి.. దాన్ని అధ్యయనం చేసి విజేతను ప్రకటిస్తాయి. అందువల్ల కౌంటింగ్ ఇంకా కొనసాగుతుండగానే ఫలితం తేలుతుంది. అంటే ఉదాహరణకు.. ఒక అభ్యర్థి లక్ష ఓట్ల మెజార్టీతో ఉన్నాడనుకుందాం. ఇంకా లెక్కించాల్సిన బ్యాలెట్లు 20వేలే ఉన్నప్పుడు వాటిని పూర్తిగా లెక్కించినా వెనుకంజలో ఉన్న అభ్యర్థి విజయం సాధించే అవకాశం ఉండదు. అలాంటి వాటిని క్రోడీకరించి ఈ మీడియా సంస్థలు విజేతలను ప్రకటిస్తాయి.

అయితే, ఇవి అధికారిక ఫలితాలు కావు. వీటిని ప్రాథమిక ఫలితాలుగానే అభివర్ణిస్తారు. కౌంటింగ్ మొత్తం పూర్తయ్యాక ఎన్నికల సంఘం విజేతలను నిర్ణయిస్తుంది.



విద్యార్థుల అభిప్రాయాలు సేకరించండి

- **యూనిఫాంల రంగు, డిజైన్లపై ప్రత్యేక దృష్టి**
- **యూనిఫాం.. కిట్ల పంపిణీకి ఎస్వోపీ రూపొందించండి**
- **ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 4(మనం బ్యూరో): విద్యార్థులకు అందించిన యూనిఫాంలపై వారినుంచి అభిప్రాయాలు (ఫీడ్ బ్యాక్) సేకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, కిట్ల పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు.

గతంతో పోలిస్తే ఎంతో నాణ్యమైన యూనిఫాంలు, ఆకర్షణీయమైన రంగులు, డిజైన్లతో అందజేశామన్నారు. అయితే, ఆయా రంగులు, డిజైన్లకు సంబంధించి విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. అలా చేస్తే



ఎక్కువ మంది విద్యార్థులు కోరుకునే రంగులు, డిజైన్లకు భవిష్యత్లో ప్రాధాన్యమివ్వచ్చని అన్నారు. యూనిఫాంలతో పాటు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూలు, సాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, కార్పెట్లు, స్కూల్ బ్యాగుల పంపిణీ దాదాపు పూర్తయిందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని చెప్పారు. ఆ వస్తువుల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందజేసే యూనిఫాంలు, ఇతర సామగ్రికి సంబంధించి విధి విధానాలను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యార్థులకు అందజేసే వస్తువుల జాబితా రూపకల్పన, టెండర్లు , సరఫరా, అందజేత వరకు ప్రతిదీ నిర్దేశిత సమయంలో పూర్తవ్వాలని తెలిపారు. పాఠశాలలు తెరిచిన రోజునే మొత్తం వస్తువులు అందేలా ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

రాష్ట్ర ప్రగతిలో యాదవులు భాగస్వాములు కావాలె

(మొదటి పేజీ తరువాయి)

దేశం అనుసరించేలా కులగణన నిర్వహించామనీ, తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని వెల్లడించారు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని ప్రస్తావించారు. యాదగిరి గుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామనీ, రాబోయే యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యాదవ సోదరులకు ఎక్కడా ఏలాంటి లోటు లేకుండా చూసే బాధ్యత తమదేననీ, ఇందులో భాగంగా సదర్ సమ్మేళనం నిర్వహణకు ప్రభుత్వం పక్షాన రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. తాను కాలేజీ రోజుల నుంచే దీపావళి సమయంలో సదర్ వేడుకల వైభవాన్ని చూస్తున్నాననీ, ఇది నగరానికి ఎంతో శోభనిస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

బేతుపల్లి చెరువు ఘటనపై మంత్రి పొంగులేటి నిరంతర పర్యవేక్షణ



- కలెక్టర్తో ఫోన్లో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా..
- ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితం.. గంటలోగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు

ఖమ్మం: సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో సహాయక చర్యలకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పరిస్థితిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం నిరంతరం పర్యవేక్షించారు. మురసు తుపాను ప్రభావంతో చెరువు వద్ద చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్ బృందం బోటు తిరగబడిన విషయం తెలుసుకున్న మంత్రి.. వెంటనే కలెక్టర్తో పాటు ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మంత్రి ఆదేశాలతో కలెక్టర్ దివాకర.టిఎస్, సి పి సునీల్ దత్ ఘటనా స్థలానికి చేరుకుని బుధవారం రాత్రి వరకు సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. రంగంలోకి దిగిన సహాయక బృందాలు.. గల్లంతైన సిబ్బంది సమీప ప్రాంతంలో సురక్షితంగా ఉన్నట్లు గుర్తించాయి. వారిని మరో గంటలోగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు మంత్రికి వివరించారు. సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేరుకునే వరకు అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవళిక మృతి





కండక్టర్ ప్రవళిక కుటుంబాన్ని అదుకుంటాం

ఉస్మానియా మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి నివాళి అర్పించిన : మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరపున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఈ మేరకు హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి బుధవారం మంత్రి పొన్నం నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయితే, గత నెలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద అక్టోబర్ 25న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయమై ప్రయాణికురాలు మౌనికతో జరిగిన గొడవలో... ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత అర్ధరాత్రి ఆమె కన్నుమూశారు. ఈ ఘటనపై ఇప్పటికే నిందితురాలైన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బోర్వెల్ తవ్వకాల నిబంధనలు సవరించాలి

రిగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మస్కు అంజిరెడ్డి, టి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు జి. నర్సిరెడ్డి, ఒరుగంటి లక్ష్మీనారాయణ

అనుమతించిన లోతును 120 మీటర్ల నుంచి 250-300 మీటర్లకు పెంచాలి.. జీఓ 259కు సవరణలు చేయాలి



హైదరాబాద్, నవంబర్ 4(మనంన్యూస్): బోర్వెల్ తవ్వకాల నిబంధనలను క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని రిగ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో బోర్వెల్ తవ్వకాల గరిష్ఠ లోతును 120 మీటర్ల నుంచి 250-300 మీటర్లకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుత పరిమితితో అనేక ప్రాంతాల్లో నీరు లభించడం లేదని, తాగునీరు, వ్యవసాయం, నిర్మాణ అవసరాల కోసం ఎక్కువ లోతులో బోర్లు తవ్వాల్సి వస్తోందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. జీఓ 259కు సవరణలు చేసి రిగ్ యజమానులపై అదనపు ఫీజులు, జరిమానాలు విధించవద్దని కోరారు. ప్రభుత్వ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి నిబంధనలు రూపొందించాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణకు రికార్డుల నిర్వహణ, వర్షపు నీటి సేకరణ, రీఛార్జ్ పిట్ల ఏర్పాటు వంటి కార్యక్రమాల్లో ప్రభుత్వానికి సహకరిస్తామని స్పష్టం చేశారు. రిగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మస్కు అంజిరెడ్డి, టి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు జి. నర్సిరెడ్డి, ఒరుగంటి లక్ష్మీనారాయణ జీఓ 259కు అవసరమైన సవరణలను త్వరితగతిన చేపట్టి తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏపీ గ్రూప్-1 స్కామ్‌లో ఈడీ మెరుపుదాడులు

- ఏపీపీఎస్సీ కేసులో ఏపీ, తెలంగాణలో ఈడీ దూకుడు
- రిటైర్డ్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంలోనూ సోదాలు
- మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు

హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ ఉదయం నుంచి ఏపీ , తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లో పలు ప్రాంతాలు, మంగళగిరి సమీపంలో ఐలాండ్ రిసార్ట్ సహా మొత్తం ఏడు చోట్ల ఈ తనిఖీలు జరపారు. ఆంజనేయులు, క్యామ్ షైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. గత ప్రభుత్వ హయాంలో 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 2020లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. అయితే, జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపిన సిట్... మంగళగిరి వద్ద ఐలాండ్ రిసార్ట్‌లో 84 రోజుల పాటు మూల్యాంకనం చేశారని, అర్హత లేని 66 మందితో జవాబు పత్రాలను దిద్దించారని తన నివేదికలో తేల్చింది. ఈ మూల్యాంకనం కోసం క్యామ్ షైన్ మీడియాకు రూ.1.14 కోట్లు, ఇతర సంస్థలకు రూ.1.38 కోట్లు చెల్లించినట్టు సిట్ గుర్తించింది. ఈ నివేదిక ఆధారంగా 2025 ఏప్రిల్‌లో పోలీసులు కేసు నమోదు చేయగా, గతంలో పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌షైన్ మీడియా డైరెక్టర్‌ను అరెస్ట్ చేశారు. సిట్ దర్యాప్తు నివేదిక ఆధారంగానే, ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి, తాజాగా సోదాలు చేపట్టినట్లు ఈడీ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

మియాపూర్ భూములను అమ్మొద్దు



- ఉద్యమకారులకు కేటాయించండి
- ఢిల్లీ నేతల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నరు?
- బీజేపీ తెలంగాణకు ఏం ఇచ్చింది?
- అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, వాటిని పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... 'మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం' అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా? అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే?.. బండి సంజయ్ బాడీగార్డ్‌గా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు.

అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో హైటెక్ చోరీ

- 6 గంటల్లోనే రూ.7.80 కోట్ల మాయం

హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : హైదరాబాద్‌లో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో సైబర్ నేరగాళ్లు భారీ చోరీకి పాల్పడ్డారు. అయితే, కేవలం ఆరు గంటల్లోనే రూ.7.80 కోట్లు స్వాహా చేశారు. ఓ ఫైనాన్స్ సంస్థ కార్పొరేట్ బ్యాంకు ఖాతా నుంచి నగదును దోచేశారు. ఏకంగా 83 బ్యాంకు ఖాతాల్లోకి ఈ నగదును బదిలీ చేశారు. నవంబరు 1వ తేదీన ఉదయం 10:18 గంటలకు నగదు బదిలీలు ప్రారంభమయ్యాయి. ఆరోజు సాయంత్రం 4:58 గంటల వరకు కొనసాగిన సైబర్ దోపిడీ.. చివరి లావాదేవీతో మొత్తం రూ.7.80 కోట్లను సైబర్ కేటుగాళ్లు కొట్టేశారు. భారీ నగదు మాయం కావడంతో ఫైనాన్స్ సంస్థ యాజమాన్యం ఆందోళనలో ఉంది. ఈ మోసంపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఆ సంస్థ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. 83 బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లిన నగదుపై అధికారులు విచారిస్తున్నారు. ఆరు గంటల్లోనే రూ.7.80 కోట్ల దోపిడీ చేసిన సైబర్ నేరగాళ్ల కోసం పోలీసులు చర్యలు చేపట్టరు.

తెలంగాణలో రోడ్డెక్కిన ఒకేషనల్ ట్రైనర్లు

12 నెలల జీతాల్లేవ్.. సెక్రటేరియట్ ముందు ఆందోళన

ఉద్యోగ భద్రత కల్పించాలని రేవంత్ ప్రభుత్వానికి డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : తెలంగాణలో దుష్ట కాంగ్రెస్ సర్కార్ పాలనలో నోటిఫికేషన్లు విడుదల చేయక ఓ వైపు నిరుద్యోగులు రోడ్డెక్కుతుంటే.. మరోవైపు పలు ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదని... నిత్యం ఏదో ఒక డిపార్ట్‌మెంట్‌కి చెందిన ఉద్యోగులు జీతాల కోసం రోడ్డెక్కుతున్న ఘటనలు తెరపైకి వస్తూనే ఉన్నాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ తమతో పని చేయించుకొని జీతాలు ఇవ్వడం లేదని తాజాగా ఒకేషనల్ ట్రైనర్లు బుధవారంనాడు నిరసనకు దిగారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ సెక్రటేరియట్ ముందు ఒకేషనల్ ట్రైనర్లు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ధర్నా చేపట్టారు. జీతాల్లేవ్ జీతాల్లేవ్.. 12 నెలల జీతాల్లేవ్.. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శేరిలింగంపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా



నాడు మాతో చేతులు కలుపమని బలరాం నాయక్ అడిగిండ్రు?

సాక్ష్యాధారాలతో బయటపెట్టిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : శేరిలింగంపల్లిలో 4 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూమిపై కొందరు కాంగ్రెస్ గ(పె)ద్దల కన్ను పడిందని, నేడు రేవంత్ ఎలువడిలో అది పూర్తిగా కబ్జాకు గురవుతోందని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించిరు. ఇదే భూమిపై గతంలో తానూ గురుకులాల సెక్రటరీగా ఉన్నప్పుడు కూడా.. కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బలరాం నాయక్ తన దగ్గరికి వచ్చి కబ్జా చేసేందుకు తమకు సహకరించమని కోరాడని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కానీ, నాడు వారి డిమాండ్‌కు తానూ ఒప్పుకోలేదన్నారు. ఇక, అక్కడ గుడిసెలు వేసుకున్న వాళ్లకు బలరాం నాయక్ డబ్బులు ఇచ్చి ఊసి గొలిపారని, ఇప్పుడు కూడా డబ్బులు ఇస్తున్నాడని ఆయన ఆరోపించారు. అయితే,ఈ భూ కబ్జా వేనుక ప్రధానంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూడా ఉన్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. శేరిలింగంపల్లిలో 4 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూమిని బహిరంగంగా కబ్జా చేస్తున్నారు.. మాకున్న క్షేత్రస్థాయిలో మేం కనుకున్న సమాచారం మేరకు దీని వెనుక మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఉన్నారని అక్కడున్న స్థానికులు చెబుతున్నారని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారంనాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇది ఎందుకు క్లియర్‌గా ప్రభుత్వ భూమి అని చెప్తున్నామంటే.. తాను 2012 నుంచి 2021 వరకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరీగా పని చేశానని, ఆ సమయంలో మరి ఎస్సీ సబ్ ప్లాన్ యాక్ట్ 2013లో వచ్చిందని, మేమేదో దళిత ప్రేమికులం.. కాంగ్రెస్ పార్టీ అంటేనే దళితులు.. దళితుంటే కాంగ్రెస్ పార్టీనే అని ప్రతీ రోజూ కూడా బాజా భజంత్రీలతో చెప్తూ ఉన్నారని సైటెర్లు వేశారు. కానీ, మీరు ఎస్సీలు, ఎస్టీలను ఎంత ఘోరంగా మోసం చేస్తున్నారనేది ఉదాహరణలతో మీకు చెప్పాలనుకున్నామన్నారు.

2013లో ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా అప్పుడున్న నోడల్ ఏజెన్సీ అంటే దానికి హెడ్ గౌరవ ముఖ్యమంత్రి.. ఆ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇదే శేరిలింగంపల్లి 4 ఎకరాల 13 గుంటలను టీచర్స్ కెపాసిటీ బిల్డింగ్ సెంటర్ (టీసీబీసీ) అనే సంస్థను సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసి అదే విధంగా అందులో ఒక గురుకుల పాఠశాలను కూడా ఏర్పాటు చేయాలని.. ఆ 4 ఎకరాల 13 గుంటల్లో ఈ బిల్డింగ్ కట్టడానికి రూ.31 కోట్లు మంజూరు చేశారని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబందించిన ఈ ప్రొసీడింగ్స్ అన్ని తమ తగ్గర ఉన్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. దాని తర్వాత రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ భూమిని ఒకప్పుడు ఎస్సీ కార్పొరేషన్ దగ్గరుండే భూమిని ఎస్సీలెవరూ వినియోగించుకోవడం లేదు?.. దీని వల్ల ఈ భూమి నిరుపయోగంగా మారుతుందని.. దీన్ని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు ఇచ్చేశారు. అది తమ దగ్గర ఉన్నా డాటా. 2014లో ఈ భూమిలో టీచర్స్ కెపాసిటీ బిల్డింగ్ సెంటర్ కట్టాలని, ఎవరెస్ట్ ఎక్కిన గురుకుల విద్యార్థులను కేవలం డప్పులు కొట్టే కుటుంబాలకే పరిమితం చేయకూడదని, డప్పులు కొట్టే కుటుంబాలు డాలర్లు కూడా సంపాదించాలని కేసీఆర్ మాకిచ్చిన ఆదేశాల మేరకు 2016లో అక్కడొక 16 అంతస్తుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కట్టాలని తామే అప్పటి ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపించామని అన్నారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఆ రోజుల్లోనే మాకు జరిగిన రివ్యూ మీటింగుల్లో ఉండే ఫైల్స్ అన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని తెలిపారు. కాబట్టి వాటిని ఈ రోజు సాక్ష్యాలుగా చూపిస్తున్నానని ప్రవీణ్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదు?

పోలవరం బనకచర్లపై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

ఈ ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలి

మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : పొరుగు రాష్ట్రం ఏపీ అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. అయితే, ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి - కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరపున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. 'రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు' అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

'సర్'పై విపక్షాల విమర్శలు తిప్పికొట్టాలి

తమిళనాడు బీజేపీ కో ఇంచార్జి డీకే అరుణ



హైదరాబాద్, నవంబర్ 4(మనం బ్యూరో): 'ఎస్ఐఆర్'పై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని తమిళనాడు బీజేపీ కో ఇంచార్జి డీకే అరుణ ఆ పార్టీ కార్యకర్తలకు సూచించారు. అక్రమ చొరబాటుదారుల ఓట్లు కాపాడే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తుందని విమర్శించారు. తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరు జిల్లా కేంద్రంలో జరిగిన బీజేపీ పాదయాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాదయాత్ర అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఎస్ఐఆర్ లో 13 కోట్ల పైగా ఓట్లను అక్రమంగా తొలగించారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. చనిపోయిన వారి ఓట్లు, డబుల్ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు తొలగించాలా వద్దా అని ప్రశ్నించారు. రోహింగ్యాల,అక్రమ వలసదారుల ఓట్లు కాపాడాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం..కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఓటరు జాబితా సవరణ చేపట్టడం ఇది తొలిసారి కాదని, ఇప్పటివరకు 8 సార్లు ఓటరు జాబితా సవరణ జరిగిందని అందులో అత్యధిక సార్లు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని ప్రజలకు వివరించారు. గతంలో ఎన్నికల సంఘం కమిషనర్లకు కేంద్ర మంత్రులు, గవర్నర్ పదవులు కాంగ్రెస్ కట్టబెట్టిందని గుర్తు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో ముందుకు వెళ్తుంటే.. ప్రతిపక్షాలు జీర్ణించుకోవడం లేదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గారు వికాసిత్ భారత్ 2047 లక్ష్యంతో పని చేస్తున్నారని, ప్రపంచ దేశాలలో ప్రధాని నరేంద్ర మోదీ కి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక, దేశ విచ్ఛిన్నకర శక్తులతో కలసి కుట్రలు చేస్తున్నారని ప్రజలు గమనించాలని కోరారు.

పట్టభద్రులకు ఊరట

ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ఈసీ నిర్ణయం

నామినేషన్ల చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

నవంబర్ 25న ముసాయిదా, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా

హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువును ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అర్హులైన పట్టభద్రులు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకునే అవకాశం లభించిం ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్ నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు ఈ గడువు పొడిగింపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి దరఖాస్తులకు నవంబర్ 6 ఆఖరి తేదీ అయినప్పటికీ, తాజా పరిస్థితుల దృష్ట్యా ఆ గడువును పొడిగించారు. అయితే, ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని అధికారులు స్పష్టం చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. దీనిపై నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తారు. అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ గడువు పొడిగింపుతో అభ్యంతరాల స్వీకరణ సమయంలోనే కాకుండా, తుది జాబితా వెలువడిన తర్వాత కూడా నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కలిగింది.

తాత

నాయిన నలుగురి మేలు
కోరే ఊరి బొడ్రాయి
కల్మషం లేని ఊరంతాపారే
గలగలల మాటల సెలయేరు
ఊరికి అమ్మోరు పోస్తే
పోచమ్మ, ఈదమ్మ, మైసమ్మలకు
ఇంటింటికి తిరిగి
బియ్యం విత్తులు సేకరించి
కొత్త కుండలో బెల్లం బువ్వవండి
వైవిధ్యము పెట్టి వేప కొమ్మలతో
కల్లు సాకబెట్టి శాంతి పరిచేది
ఊరంతా తిరిగి అమ్మోరు పాదాల
దగ్గర ఉన్న బండారు తెచ్చి ఊరు
నుదుటకు పెట్టి ధైర్యం ఇచ్చేటోడు
ఆపదున్నదంటే చాతనైన
సహాయం చేసేటోడు
ఊర్ల కుమ్మరి ఎట్టయ్య తాత తిరుగుతుంటే
అమ్మోరు శాంత పడుతుందని
నమ్మకం ధైర్యం
ఊరంటే నాయినకు ఎనలేని ప్రేమ
నలుగురుతో మాట్లాడేటప్పుడు
వరుసతో పిలుచుకునేవారు
ఊరు అంతా నాయినను ఎప్పుడూ
పేరు పెట్టి పిలిచేది కాదు
నాయినా అందరికీ 'తాత'నే
ఇప్పుడు ఆ వరుసలు నామోషీ
అయి ఎక్కడికో ఎగిరిపోయినవి
ఏం కట్కపోతం బిడ్డ
నలుగురిని బాధపెట్టి
పోయే టైం వస్తే ఎవ్వరూ ఆపలేరు
మాట రాకుండా బతకాలి బిడ్డ అనేటోడు

- గుండెల్లి ఇస్తారి
9849983874

జి.వి.పూర్ణచంద్‌కు 'జ్ఞానజ్యోతి'పురస్కారం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా, తెలుగు సాహిత్యరంగంలో అత్యంత విశేష కృషి సల్పుతున్న పరిశోధక రచయితకు 'ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం'ఏటా ఇచ్చే 'జ్ఞాన జ్యోతి' పురస్కారం -2026కి గాను ప్రముఖ రచయిత డా. జి.వి.పూర్ణచంద్‌కు ప్రకటించింది. కథ, కవిత, నవల, వ్యాస తదితర ప్రక్రియలతో పాటు ముఖ్యంగా ఆయుర్వేద వైద్య గ్రంథ రచన, తెలుగు భాషకు సంబంధించి పూర్ణచంద్ చేసిన, పరిశోధకనాత్మక కృషికి గాను ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం ఈ పురస్కారానికి ఎన్నిక చేసింది. ఈ పురస్కారం కింద్ర 3,000/- నగదు, జ్ఞాపిక, సన్మాన పత్రం, శాలువాతో నవంబర్ 18వ తేదీ సాయంత్రం మహాత్మగాంధీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రచయితని సత్కరించడం జరుగుతుంది.

- చలపాక ప్రకాష్
ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

రాయలసీమ కథల పోటీ

రాయలసీమ సమకాలీన స్థితిగతుల నేపథ్యంగా కథారచన పోటీలను రాయలసీమ ఉద్యమనేత, ప్రముఖ సాహిత్యకారులు డా. ఎం.వి రమణారెడ్డి గారి స్మారకార్థం రాయలసీమ సాంస్క ృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. నవంబర్ 10 వ తేది లోపు తమ కథలను పంపాలి. న్యాయ నిర్ణేతల నిర్ణయం మేరకు ఇరవైవేల రుపాయల నగదు బహుమతిని ఎంపికైన కథకులకు అంద చేస్తాం. సలహాదారులుగా యం.మురళీధర్, మెట్టుపల్లె జయదేవరెడ్డి, తిమ్మాపురం ప్రకాశ్‌లు కొనసాగుతారు. మరిన్ని వివరాలకు 9963917187 నెంబరుకు సంప్రదించగలరు.

- డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి,
రాయలసీమ సాంస్క ృతిక వేదిక,
అనంతపురము

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత పెంచాలి



ప్రపంచంలో ఏ దేశమైనా అన్ని రంగాల్లో ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించింది అంటే ఆయా దేశాల్లో ప్రభుత్వాలు తమ తమ జిడిపి లో ఎక్కువ నిధులు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డి)కి కేటాయించి, ఖర్చు చేయడం అని గ్రహించాలి.మనకంటే చిన్న దేశాలు అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ అభివృద్ధి చెందిన దేశాలుగా మారుతూ ఉంటే, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న మన భారతదేశం నేటికీ అనేక రంగాల్లో వెనుకబడి, అనేక విషయాల్లో ఇతర దేశాలపై ఆధారపడి ఉండటానికి ప్రధాన కారణం ఆర్అండ్‌డి కి నేటికి తక్కువ నిధులు కేటాయించడమే అని గ్రహించాలి. ఎల్లప్పుడూ కేంద్ర రాష్ట్రాల్లో ఎలా అధికారం చేపట్టాలా ఎలా మన అధికారం నిలబెట్టుకోవాలి అనే ఆలోచనతోనే నిధులు ఖర్చు చేయడం జరుగుతుంది తప్పా, వాస్తవంగా దేశంలో అందరికీ నాణ్యమైన చదువు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం, నూతన పరిశోధనలు, అవకాశాలు కోసం, నూతన ఆవిష్కరణలు ప్రోత్సాహించడం కోసం నిధులు కేటాయించడంలో అలసత్వం వహించడం వల్లనే నేటికి ఇతర దేశాలపై ఆధారపడి ఉండుట జరుగుతుంది.. దేశంలో చదువుకున్న యువతకు నైపుణ్యాలు లేక ఉపాధి అవకాశాలు లభించక, నిరుద్యోగంతో సతమతం అవుతున్న పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జెన్‌జీ, ఆల్ఫాజనరేషన్ యువతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు పాలన చేయాలి. యూరప్ లో జరుగుతున్న పరిణామాలు ఇప్పటికే అందరికీ కనువిప్పు కావాలి.

మనకంటే చిన్న దేశం అయిన దక్షిణ కొరియా 1981లో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కొరకు తమ దేశ జిడిపిలో 0.8% నిధులు కేటాయించడం జరిగితే, అదే దేశం 1990 నాటికి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కొరకు 2% నిధులు కేటాయించడం జరిగింది. అందుచేతనే అనేక ఆవిష్కరణలు చేసి, అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసి, ప్రపంచంలోనే అనేక వస్తువులు ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వస్తువులు ఉత్పత్తి చేయడం ద్వారా విదేశీ పెట్టుబడులు, విదేశీ మారకద్రవ్యం ఆర్జిస్తూ అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందింది. ఒక్క మాటలో చెప్పాలంటే మనదేశంలో నూటికి ఎనభై శాతం జనాభా వాడే వాషింగ్ మెషీన్లు, ఏ.సిలు, టెలివిజన్ వంటి పలు వస్తువులు దక్షిణ కొరియా దేశానివే అంటే అతిశయోక్తి కాదు ఇక నేడు ప్రపంచంలో అన్నింటా అగ్రగామిగా నిలిచిన పెద్ద దేశం చైనా 2000 సంవత్సరంలో చైనా తన జిడిపి లో 0.9% నిధులు ఆర్అండ్‌డి కొరకు ఖర్చు చేయగా, దీని ప్రాముఖ్యతను గుర్తించి 2013లో తన జిడిపి లో 2% నిధులు కేటాయించడం ద్వారా అనేక ఆవిష్కరణలు చేసి అనేక పరిశ్రమలు నెలకొల్పడం, ప్రపంచ దేశాలకు చిన్న వస్తువు నుండి ఆకాశంలో ప్రయోగించే రాకెట్, ఉపగ్రహాలు వరకూ, అనేక అరుదైన ఖనిజాలు, సెమి కండక్టర్, చిప్స్, వైద్య పరికరాలు ఇలా అన్నింటా అగ్రగామిగా నిలిచింది. దీనికి అంతటికీ ప్రధాన కారణం ఈ దేశాలు విద్య,వైద్యం రంగాలకు ముఖ్యంగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు అధికంగా నిధులు కేటాయించి ఖర్చు చేయడం ద్వారా అనేక నూతన ఆవిష్కరణలు చేసి ప్రపంచానికే ఉత్పత్తి దారులుగా మారారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడం జరిగింది. ఇక మనదేశంలో నేటికీ మనదేశ జిడిపి లో 0.84% శాతం నిధు లు కేటాయించి ఖర్చు చేయడం జరుగుతుంది. ఇక మనదేశ జిడిపిలో2% నిధులు భవిష్యత్తులో అనగా 2036 నాటికి కేటాయించి ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇక ఇటువంటి పరిస్థితుల్లో నూతన ఆవిష్కరణలు, నూతన ఆలోచనలు ద్వారా ఏ రకంగా, ఏయే రంగాల్లో అభివృద్ధి సాధిస్తామో ఆలోచన చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. నేటికి మన దేశంలో అనేక పాఠశాలల్లో కళాశాలలో విశ్వవిద్యాలయాల్లో ఐఐటి ఇతర విశ్వవిద్యాలయాల్లో కనీసం లైబ్రరీలు, లేబరేటరీల మౌలిక సదుపాయాలు, అన్ని సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేరు అని అనేక నివేదికలు చెబుతున్నాయి. కొన్ని చోట్ల టాయిలెట్ సౌకర్యాలు, మంచినీటి సరఫరా లేదు.. ఇటువంటి పరిస్థితుల్లో ఏ రకమైన నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ప్రపంచ స్థాయిలో రాణిస్తారో అర్థం కాని పరిస్థితి. ఇకనైనా ప్రభుత్వాలు, పాలకులు ఆలోచన చేయాలి. అనేక మత క్రతువులు కార్యక్రమాలు, టెంపుల్ టూరిజం కోసం దాదాపు అన్ని ప్రభుత్వాలు పాలకులు నిధులు కేటాయించడంలో శ్రద్ధ వహించడం జరుగుతుంది తప్పా, టెక్నాలజీ డెవలప్‌మెంట్ కి అంత శ్రద్ధ చూపకపోవడం గమనించిదగిన విషయం..

గత మూడు దశాబ్దాలుగా క్రితమే అనేక దేశాలు ముందస్తు పరిస్థితులు అవగాహన చేసుకుని శాస్త్ర సాంకేతిక రంగాలకు, వైద్య రంగాలకు, ఆర్ అండ్ డి కొరకు అధిక నిధులు కేటాయించడం వల్లనే నేడు అనేక రంగాల్లో అభివృద్ధి సాధించడం జరిగింది. దక్షిణ కొరియా, చైనా, అమెరికా, జపాన్, జర్మనీ, స్వీడన్, ఇజ్రాయెల్ వంటి పలు దేశాలు తమ తమ జిడిపిలో అత్యధికంగా నిధులు కేటాయించడం జరిగింది. అందుచేతనే అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ అభివృద్ధి చెందిన దేశాలుగా రూపాంతరం చెందాయి. అంతరిక్షంలో మరియు ఈ అవని మీద అనేక ఆవిష్కరణలు చేసి అద్భుతాలు సృష్టిస్తూ ముందుకు సాగుతున్నారు. క్వాంటం, సెమీ కండక్టర్, చిప్స్ తయారీ, డ్రోన్ల తయారీ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ఆంత్రోపిక్స్, రక్షణ, వ్యవసాయ, వైద్య రంగాల్లో, పారిశ్రామిక రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నాయి. ఇక మనదేశంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ముందుచూపుతో అనేక ఆనకట్టలు, పరిశ్రమలు స్థాపించి ప్రగతికి బాటలు వేయడం జరిగింది.. శాస్త్ర సాంకేతిక రంగాలకు పునాదులు పడ్డాయి. ఇస్రో,డిఆర్‌డిఓ,ఐఐటిలు, అణుశక్తి రియాక్టర్లు, ఇనుము ఉక్కు కర్మాగారాలు తదితర పారిశ్రామిక సంస్థలు, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలు ఏర్పాటు చేశారు.. అయితే ఇటీవల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలకు, ఉచిత పథకాల పై ఎక్కువ దృష్టి సారించి, ముఖ్యంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రోత్సాహిస్తూ, శాస్త్ర సాంకేతిక రంగాలకు ముఖ్యంగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అధికారం నిలబెట్టుకోవడానికే ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవంగా ఆర్అండ్‌డి కి 2008-09 మధ్య కాలంలోనే దేశ జిడిపి లో 0.84% శాతం కేటాయించారు. అదే స్థాయి కేటాయింపులు నేడు కూడా ఏ మేరకు సరిపోతాయి.. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పోటీ ప్రపంచంలో, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు దృష్టిలో ఉంచుకుంటే ఈ నిధులు ఏమాత్రం సరిపోవు అని గ్రహించాలి. ఇక ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం 'ది అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్' ఏర్పాటు చేసి, సుమారు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుంది అని పాలకులు చెబుతున్నారు. వాస్తవ రూపం ధరించే నాటికి ఎంత సమయం పడుతుందో వేచి చూడాలి మరి.! కరోనా సమయంలో మనదేశంలో స్వతహాగా వాక్సిన్ తయారు చేయడం, ఇటీవల అంతంత మాత్రంగానే నిధులు, శాస్త్రవేత్తలు ఉన్న ఇస్రో అనేక ప్రయోగాలు జయప్రదంగా చేయడం, రక్షణ రంగానికి సంబంధించిన డిఆర్‌డివోఅనేక ఉత్పత్తులు తయారు చేయడం జరుగుతున్నా వికసిత భారత్ సాధించుటలో ఇప్పటి వరకూ సాధించిన ప్రగతి, ఇప్పటి వరకు కేటాయిస్తున్న నిధులు సరిపోవు అని గ్రహించాలి. అనేక మంది శాస్త్రవేత్తలు ఇంటి ముఖం పడుతున్నారు. ఇది ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యమైన రంగాలను కూడా ప్రైవేటీకరణ చేయడం జరుగుతుంది. ఇకనైనా ప్రస్తుతం మారుతున్న అంతర్జాతీయ పరిణామాలు దృష్టిలో ఉంచుకుని భారత్‌ను స్వయం సమృద్ధి సాధించిన దేశంగా, ఆత్మనిర్భర్ భారత్‌గా స్వదేశీ ఉత్పత్తులతో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే తక్షణమే రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కు జిడిపి లో కనీసం 1.5% నిధులు కేటాయించడం జరగాలి. బిజినెస్ ఎంటర్‌ప్రైజస్‌రిసెర్చ్అండ్‌డెవలప్‌మెంట్(బి.ఈ.ఆర్.డి) కూడా అధిక నిధులతో భాగస్వామ్యం కావాలి. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్, ట్రాన్స్‌పోర్ట్ రంగం ముందుకు రావాలి. ఈ విధంగా ప్రభుత్వం, బి.ఈ ఆర్.డి సంయుక్తంగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే దేశంలో నిరుద్యోగం తగ్గి, ఉత్పత్తి పెరిగి, నూతన ఆవిష్కరణలు సాధించడం ద్వారా దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని భావిద్దాం.


- ఐ. ప్రసాదరావు
9390509791

'సునామీ'లపై అవగాహన అవసరం

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణభూతాలు అవుతాయి. సునామీలపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5నప్రపంచ సునామీ అవగాహన దినోత్స వంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణాల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు.

ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్ లోనూ సునామీలు సంభవించాయి. జపాన్‌కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరి పొలం మొత్తాన్ని తగుల బెట్టాడు.

ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణ రక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో 'వరల్ సునామీ అవేర్నెస్ డే' వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండ డంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెల కొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొన సాగింది. 2007లో పూర్తి స్థాయి లో 'ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం' కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్‌లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5-6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూ భాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్‌వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి.



సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి 'ఓషియన్ స్టేట్ పోర్కాస్ట్ సేవలను' ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది ఆయా ఆధునిక పరికరాల ద్వారాసునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది.

అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయి లో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేర వేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అంది స్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

నవంబర్ 5... ప్రపంచ సునామీ అవగాహన దినం సందర్భంగా

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

వస్తు మార్పిడి విధానం..ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయమా!

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డబ్బు, బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, అంతర్జాతీయ వాణిజ్యం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో వస్తు మార్పిడి విధానం గురించి మళ్లీ చర్చ జరగడం ఒక ముఖ్యమైన సామాజిక, ఆర్థిక పరిణామం. ఒకప్పుడు మానవ సమాజానికి ప్రధాన వాణిజ్య పద్ధతిగా ఉన్న వస్తు మార్పిడి విధానం ఆధునిక కాలంలోనూ కొన్ని ప్రాంతాల్లో, కొన్ని సందర్భాల్లో కొత్త రూపాల్లో కనిపిస్తోంది. రైతు పండించిన ధాన్యాన్ని కూరగాయలతో మార్చుకోవడం, పాలు ఇచ్చి ఇతర నిత్యావసర వస్తువులు తీసుకోవడం, వ్యవసాయ పనులకు ప్రతిఫలంగా ధాన్యం పొందడం, ఒక కుటుంబం ఉత్పత్తి చేసిన వస్తువులను మరో కుటుంబం అందించే సేవలతో మార్పిడి చేసుకోవడం వంటి పద్ధతులు గ్రామీణ జీవితంలో పరస్పర సహకారానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. అయితే ఈ పరిణామాన్ని కేవలం పాతకాలపు ఆచారం తిరిగి రావడంగా చూడటం సరైనది కాదు. పెరుగుతున్న జీవన వ్యయం, వ్యవసాయ ఉత్పత్తుల ధరల్లో అనిశ్చితి, గ్రామీణ అప్పుల భారం, ఉపాధి సమస్యలు, మధ్యవర్తుల ఆధిపత్యం, డబ్బు కొనుగోలు శక్తిలో మార్పులు వంటి అంశాల నేపథ్యంలో వస్తు మార్పిడి విధానం ప్రాధాన్యాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ఆధునిక ఆర్థిక వ్యవస్థలో వస్తు మార్పిడికి ఉన్న పరిమితులు, రైతుల ప్రయోజనాలు, మహిళల ఆర్థిక పాత్ర, సామాజిక సమానత్వం, ప్రభుత్వ విధానాలు, డిజిటల్ సాంకేతికతతో దాని అనుసంధానం వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషించినప్పుడే ఈ విధానంపై సమతుల్యమైన అవగాహన ఏర్పడుతుంది.

మానవ సమాజంలో వస్తువుల విలువను అంచనా వేయడం, మార్పిడి చేయడం, సంపదను నిల్వ ఉంచడం వంటి అవసరాలు పెరిగేకొద్దీ డబ్బుకు సంబంధించిన విభిన్న రూపాలు అభివృద్ధి చెందాయి. తొలినాళ్లలో కొన్ని సమాజాలు ధాన్యం, పశువులు, ఉప్పు, గవ్వలు, లోహాలు వంటి వస్తువులను నిర్దిష్ట సందర్భాల్లో మారక సాధనాలుగా ఉపయోగించాయి. అయితే వీటన్నింటినీ ఆధునిక అర్థంలో కరెన్సీగా పరిగణించలేం. వాటి వినియోగం ప్రాంతం, కాలం, సామాజిక అంగీకారం ఆధారంగా మారేది. చరిత్రలో తొలి నాణేల ఆవిర్భావం ఒకే ప్రాంతానికి పరిమితం కాలేదు. ఆసియా మైనర్‌లోని లిడియా ప్రాంతం, ప్రాచీన భారతదేశం, చైనా వంటి ప్రాంతాల్లో వేర్వేరు రూపాల్లో నాణేలు అభివృద్ధి చెందాయి.భారతదేశంలో ఈ నాణేలు మొదట్లో ప్రధానంగా వెండితో తయారయ్యేవి. వాటిపై ప్రత్యేక గుర్తులను ముద్రించేవారు. చైనాలోనూ నాణేల రూపాలు స్వతంత్రంగా అభివృద్ధి చెందాయి. ఈ చారిత్రక పరిణామాలు వస్తువుల మార్పిడి నుంచి నిర్దిష్ట విలువ కలిగిన మారక సాధనాల వైపు మానవ సమాజాలు క్రమంగా ప్రయాణించిన తీరును తెలియజేస్తాయి.నాణేల వినియోగం విస్తరించిన తరువాత వాణిజ్యం మరింత పెరిగింది. దూర ప్రాంతాలకు ప్రయాణించే వ్యాపారులు భారీ మొత్తాల్లో లోహపు నాణేలను తీసుకెళ్లడం కష్టంగా ఉండేది. వాటి భద్రత, రవాణా, నిల్వ సమస్యలు కూడా ఎదురయ్యేవి. ఈ పరిస్థితుల్లో వ్యాపార రసీదులు, రుణ పత్రాలు, హుండీలు, మారక పత్రాలు వంటి ఆర్థిక సాధనాలు వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చెందాయి. వీటి ద్వారా నగదును ప్రతి సందర్భంలోనూ భౌతికంగా తరలించకుండా లావాదేవీలు నిర్వహించే అవకాశం ఏర్పడింది.

కాగితపు డబ్బు చరిత్రలో చైనా ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. మధ్యయుగ చైనాలో, ముఖ్యంగా సాంగ్ రాజవంశ కాలంలో, కాగితపు కరెన్సీ వినియోగం విస్తరించింది. తొలినాళ్లలో వ్యాపారులు ఉపయోగించిన కొన్ని పత్రాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో జారీ చేసిన కాగితపు నోట్లు క్రమంగా విస్తృత ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యాయి. తరువాత వివిధ దేశాల్లో ప్రభుత్వాలు, బ్యాంకులు కాగితపు కరెన్సీని జారీ చేయడం ప్రారంభించాయి. కాలక్రమేణా నోట్ల జారీ, వాటి విలువ, చెల్లుబాటు, ప్రజల విశ్వాసాన్ని నిర్వహించడం ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల బాధ్యతల్లో భాగమయ్యాయి.

భారతీయ రిజర్వు బ్యాంకు 1935లో కార్యకలాపాలు ప్రారంభించింది. స్వాతంత్ర్యం అనంతరం దేశ ద్రవ్య వ్యవస్థలో దాని పాత్ర మరింత కీలకమైంది. 1934 నాటి రిజర్వు బ్యాంకు చట్టం ప్రకారం బ్యాంకు నోట్ల జారీ, కరెన్సీ నిర్వహణకు సంబంధించిన బాధ్యతల్లో రిజర్వు బ్యాంకుకు ముఖ్యమైన స్థానం ఉంది. ఆధునిక భారతదేశంలో కాగితపు నోట్లు, నాణేలు, బ్యాంకు డిపాజిట్లు, ఎలక్ట్రానిక్ చెల్లింపులు పరస్పరం అనుసంధానమై ఆర్థిక లావాదేవీలను నిర్వహిస్తున్నాయి.

మహిళా స్వయం సహాయక సంఘాలు వస్తు మార్పిడి వ్యవస్థను సమర్థంగా నిర్వహించగలవు. ఒక సంఘం తయారు చేసే పచ్చళ్లు, పప్పు పొడులు, చిరుధాన్యాల ఉత్పత్తులను మరో సంఘం తయారు చేసే వస్త్రాలు, గృహోపకరణాలు లేదా ఇతర ఉత్పత్తులతో పరస్పర అంగీకారం ప్రకారం మార్చుకోవచ్చు. గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే వస్తువులకు స్థానిక వినియోగదారులను అనుసంధానించడం ద్వారా మహిళా వ్యాపారాలకు కొత్త అవకాశాలు లభించవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వస్తు మార్పిడికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఒక గ్రామంలో రైతులు, పాడి పరిశ్రమల నిర్వాహకులు, మహిళా సంఘాలు, చేతివృత్తుల వారు తమ వద్ద ఉన్న ఉత్పత్తుల వివరాలను డిజిటల్ వేదికలో నమోదు చేయవచ్చు. తమకు అవసరమైన వస్తువులను పేర్కొనవచ్చు. పరస్పర అవసరాలు సరిపోలినప్పుడు మార్పిడి చేసుకోవచ్చు. దీనివల్ల ఒకే గ్రామానికి పరిమితం కాకుండా సమీప గ్రామాల మధ్య కూడా మార్పిడికి అవకాశం ఉంటుంది.

గ్రామీణ వస్తు మార్పిడిని ప్రోత్సహించా లనుకుంటే ప్రభుత్వాలు ముందుగా గ్రామ స్థాయిలో అవసరాలు, ఉత్పత్తులపై అధ్యయనం చేయాలి. ప్రతి గ్రామంలో పండించే పంటలు, అందుబాటులో ఉండే పాడి ఉత్పత్తులు, చేతివృత్తుల ఉత్పత్తులు, స్థానిక సేవలు, ప్రజల అవసరాలను నమోదు చేయవచ్చు. గ్రామపంచాయతీలు, రైతు సంఘాలు, సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో స్వచ్ఛంద మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చేయవచ్చు.

వస్తు మార్పిడి విధానాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, దాని ప్రయోజనాలు, పరిమితులను గుర్తించి, ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునర్నిర్మిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొంత అదనపు బలం చేకూరవచ్చు. వృథాను తగ్గించడం, ప్రజల మధ్య సహకారాన్ని పెంపొందించడం, ఆర్థిక లావాదేవీల్లో న్యాయాన్ని నిలబెట్టడం. పాత సంప్రదాయంలోని ఉపయోగకరమైన అంశాలను ఆధునిక సాంకేతికత, ప్రజాస్వామిక విలువలు, సామాజిక సమానత్వంతో మేళవించగలిగితే గ్రామీణ స్వావలంబనకు ఒక కొత్త దిశ ఏర్పడుతుంది. గ్రామం తన అవసరాల్లో కొంత భాగాన్ని తానే తీర్చుకోగలగడం, మిగిలిన అవసరాల కోసం సమర్థ వంతమైన మార్కెట్లతో అనుసంధానమవడం, ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన జీవనావకాశాలు కల్పించడం- ఇదే ఆధునిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సాధించాల్సిన అసలైన లక్ష్యం.

- డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పి



జగిత్యాల నవంబర్ 4(మనం ప్రతినిధి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను నిరంతరం పర్యవేక్షించే క్రమంలో భాగంగా ఎస్పీ ఈ తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. ప్రతి కేసులో దర్యాప్తును నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.అలాగే పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తున్న స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, వివిధ రిజిస్టర్లు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని, స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.స్టేషన్ పరిధిలో బీట్ వ్యవస్థ అమలు, రాత్రి గస్తీ, నేరాల నియంత్రణ చర్యలు తదితర అంశాలపై ఎస్పీ గారు సమీక్ష నిర్వహించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు మరియు నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్మెంట్ యాప్లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు.ఎస్పీ గారి వెంట మెట్ పల్లి సి.ఐ సురేష్ బాబు, ఎస్.ఐ అనిల్ మరియు సిబ్బంది ఉన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

తెలంగాణలో నాలుగు మండలాల పరిధిలోని
సంబంధిత గ్రామాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలి
నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల
నుంచి నవంబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిషేధం
జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 04 (మనం బ్యూరో): ఆంధ్రప్రదేశ్లో రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు తెలంగాణ జిల్లాలోని 19 గ్రామాల్లో మద్యం దుకాణాలు, 2బి బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20(1) ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. నవంబర్ 3వ. తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 5వ. తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. అయిజ మండలంలోని పులికల్, వెనిసోంపురం, రాజాపురం, కేశవరం, కుతకనూరు గ్రామాలకు, అలంపూర్ మండలంలోని జిల్లెలపాడు, సుల్తాన్పురం, రాయలంపాడు, సింగవరం, కాశీపురం గ్రామాలకు వర్తిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఉండవెల్లి మండలంలోని బస్వాపురం, పుల్లూరు, కల్గొట్ల, మెన్నిపాడు గ్రామాలు, రాజోలి మండలంలోని తుమ్మిళ్ల, ధన్వాడ, రాజోలి, పెద్దధన్వాడ, చిన్నధన్వాడ గ్రామాల పరిధిలో కూడా ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత గ్రామాల్లోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాల నిర్వాహకులు నిర్ణీత సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారులు జిల్లా యంత్రాంగం జారీ చేసిన ఉత్తర్వులకు సహకరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

డిజిటల్ గవర్నెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ
- డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా నూతన ఆన్‌లైన్ విధానాల అమలుపై వగాహన

జగిత్యాల, నవంబర్ 4 (మనం న్యూస్): ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ గవర్నెన్స్‌లో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరూ అవగాహన కలిగి ఉండాలనీ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ పేర్కొన్నారు. ఐఎఫ్ఎంఐఎస్ లో నూతనంగా ప్రవేశపెట్టిన హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్షన్, మాడ్యూల్స్ వినియోగంపై జిల్లా అధికారులకు శిక్షణా కార్యక్రమం జిల్లా ట్రెజరీ శాఖ ద్వారా నిర్వహించారు. బుధవారం జగిత్యాల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని (ఐ డి ఓ సి) సమావేశ మందిరంలో జిల్లా ఖజానా శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డి డి ఓ లు) పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ప్రవేశపెట్టిన ఎచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్షన్, మాడ్యూల్స్ వినియోగ విధానం, వాటి ద్వారా నిర్వహించాల్సిన పరిపాలనా, ఆర్థిక సంబంధిత కార్యకలాపాలు, ఆన్లైన్ ప్రక్రియలపై అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా మాడ్యూల్స్ వినియోగ సమయంలో అధికారులకు ఎదురయ్యే సందేహాలు, సాంకేతిక సమస్యలను నివృత్తి చేస్తూ, ఆయా ప్రక్రియలను ఆచరణాత్మకంగా వివరించారు. నూతన విధానా లను అధికారులు సమర్థవంతంగా వినియో గించుకునేలా అవసరమైన సూచనలు అందిం చారు.ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ గవర్నెన్స్ విధానంలో భాగంగా నూతన ఆన్లైన్ మాడ్యూల్స్ను అధికారులు అవగాహనతో వినియోగిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి పద్మ, ఎస్.టి.ఓ విజయ్ , అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

- అర్హులైన లబ్ధిదారులను త్వరితగతిన గుర్తించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



జగిత్యాల నవంబర్ 04(మనం న్యూస్): జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి, వారికి త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గ హ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క షి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, ఈ ప్రక్రియలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లు చిరంజీవి రమాదేవి నీరజ భీమేష్ ఎంపీ ఓ వాసవి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

‘మీ డబ్బు - మీ క్లిక్ - మీ ఎంపిక’ నినాదంతో అవగాహన.
విద్యార్థులు, ఉపాధ్యాయులకు పోలీసుల అవగాహన.
ఆన్లైన్ పెట్టుబడులు, ప్రకటనల మోసాలపై హెచ్చరిక, అనుమానాస్పద లింకులతో జాగ్రత్త.
ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దు, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి



కామారెడ్డి, నవంబర్ 4 (మనం బ్యూరో): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటమే వాటి నుంచి రక్షణ పొందేందుకు తొలి మార్గమని పోలీసులు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆన్లైన్ లావాదేవీలు, సామాజిక మాధ్యమాల వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. సైబర్ జాగరూకత దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సదాశివనగర్ తెలంగాణ మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో సీఐ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్

సదాశివనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ‘మీ డబ్బు - మీ క్లిక్ - మీ ఎంపిక’ అనే నినాదంతో సైబర్ మోసాల తీరును వివరించారు. ఆన్లైన్ ప్రకటనల ద్వారా ఆకర్షించి డబ్బులు కాజేయడం, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలను దొంగిలించడం, షేర్ల మార్కెట్లో అధిక లాభాలు వస్తాయంటూ పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడటం వంటి విధానాలను వివరించారు.

అప్రమత్తతే రక్షణ

గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని పోలీసులు సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, ఓటీపీని ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్లైన్ పెట్టుబడి ప్రతిపాదనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యాశకు పోయి తెలియని వ్యక్తుల సూచనలతో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దని హెచ్చరించారు.

మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు

సైబర్ ఆర్థిక మోసానికి గురైన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్లైన్కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే జాతీయ సైబర్ క్రైమ్ ఫిర్యాదుల వెబ్సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సకాలంలో ఫిర్యాదు చేయడం వల్ల మోసపోయిన సొమ్మును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీఐ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పోలీసులు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి జాతీయ స్థాయిలో మరో కీలక బాధ్యత

- జాతీయ దంత వైద్య, విద్యా బోర్డు సభ్యుడిగా డాక్టర్ కుచుకుళ్ల రాజేష్ రెడ్డి నియామకం
- దంత వైద్య, విద్యా రంగంలో సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు
- తెలంగాణ డెంటల్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ కుచుకుళ్ల రాజేష్ రెడ్డికి అరుదైన గౌరవం



ఉమ్మడి మహబూబ్ నగర్, నవంబర్ 4 (మనం బ్యూరో): నాగర్కర్నూల్ శాసనసభ్యుడు, తెలంగాణ రాష్ట్ర డెంటల్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డికి జాతీయ స్థాయిలో మరో కీలక బాధ్యత లభించింది. భారత ప్రభుత్వ జాతీయ దంత వైద్య కమిషన్ పరిధిలోని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డెంటల్ ఎడ్యుకేషన్ బోర్డు స్వయం ప్రతిపత్తి సంస్థ పార్టామ్ సభ్యునిగా డాక్టర్ కుచూకుళ్ళ రాజేష్ రెడ్డి నియమితుల య్యారు.జాతీయ దంత వైద్య కమిషన్, దాని మూడు స్వయం ప్రతిపత్తి బోర్డులకు పార్టామ్ సభ్యుల ఎంపిక ప్రక్రియను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2026 నవంబర్ 3వ. తేదీన జాతీయ దంత వైద్య కమిషన్ చట్టం-2023, దాని కింద రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించింది.ఈ ఎంపిక ప్రక్రియలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాల తరపున 10 మంది, రాష్ట్ర డెంటల్ కౌన్సిళ్ల తరపున 9 మంది పార్టామ్ సభ్యులను రెండేళ్ల పదవీకాలానికి ఎంపిక చేశారు. అదేవిధంగా జాతీయ దంత వైద్య కమిషన్ పరిధిలోని మూడు స్వయం ప్రతిపత్తి బోర్డులకు కూడా పార్టామ్ సభ్యులను ఎంపిక చేశారు.ఇప్పటికే జాతీయ దంత వైద్య కమిషన్ సభ్యునిగా కొనసాగుతున్న డాక్టర్ రాజేష్ రెడ్డికి తాజాగా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డెంటల్ ఎడ్యుకేషన్ బోర్డు సభ్యునిగా అదనపు బాధ్యతలు అప్పగించడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి అదనపు బాధ్యతలు అప్పగించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తన నియామకానికి వారి ప్రోత్సాహం, సహకారం, మద్దతు ఎంతో తోడ్పడ్డాయని పేర్కొన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి అంకితభావంతో నిర్వర్తిస్తూ, దేశవ్యాప్తంగా దంత వైద్య విద్యా ప్రమాణాల పెంపుదలకు, వైద్య విద్యా రంగ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన దంత ఆరోగ్య సేవలు అందించే దిశగా కృషి చేస్తానని డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు.దేశవ్యాప్తంగా దంత వైద్య విద్యా ప్రమాణాల పెంపుదల, పాఠ్యప్రణాళిక రూపకల్పన, విద్యా విధానాల అభివృద్ధి, దంత వైద్య విద్యా సంస్థల నాణ్యత మెరుగుదల వంటి కీలక అంశాల్లో ఆయన తన సేవలు అందించే అవకాశం లభించిందన్నారు. దంత వైద్య విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ బాధ్యత కీలకంగా నిలువనున్నదని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.జాతీయ స్థాయిలో మరో కీలక బాధ్యతను చేపట్టిన డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డికి పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అభిమానులు అభినందనలు తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి నాగర్కర్నూల్ జిల్లా ప్రజలకు, నియోజకవర్గానికి, వైద్య రంగానికి మరింత విశేష సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోంది

జరీనా బేగం వైద్య చికిత్సకు రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు



జగిత్యాల, నవంబర్ 4(మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని 38వ వార్డుకు చెందిన జరీనా బేగం మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం స్థానిక కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా జరీనా బేగం వైద్య చికిత్స నిమిత్తం రూ.2 లక్షల 50 వేల విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే నివాసం లో జరీనా బేగం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కూసరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి



జగిత్యాల, నవంబర్ 04(మనం ప్రతినిధి): రబీ 2024-25 సీజన్కు సంబంధించి పెండింగ్లో ఉన్న కస్టమ్ మిల్ రైస్ (సీఎంఆర్) బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు.

బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారితో కలిసి సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. మిల్లుల వారీగా పెండింగ్లో ఉన్న అక్ష వివరాలు, బియ్యం సరఫరా పురోగతి, గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, రబీ 2024-25 సీజన్కు సంబంధించి జిల్లాలో ఇంకా 2,564 ఏసికే ల సీఎంఆర్ డెలివరీ పెండింగ్లో ఉందని తెలిపారు. పెండింగ్ బియ్యం సరఫరాకు ప్రభుత్వం నవంబర్ 29, 2026 వరకు గడువు పొడిగించిందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న 24 రోజుల వ్యవధిలో పెండింగ్ బియ్యం సరఫరా పూర్తి చేసేలా ప్రతి మిల్లు తమకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.

మిల్లుల వారీగా రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

30 ఏసికే ల కంటే తక్కువ పెండింగ్ ఉన్న 20 మిల్లుల్లో పెద్దగా సమస్యలు లేవని, ఆయా మిల్లులు రోజుకు కనీసం ఒక ఏసికే చొప్పున బియ్యం సరఫరా చేసినా పెండింగ్ లక్ష్యాలను పూర్తి చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఆయా మిల్లులు ఎలాంటి జాప్యం చేయకుండా రోజువారీ సరఫరా చేపట్టి పెండింగ్ను పూర్తిగా క్లియర్ చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా 30 ఏసికే లకు పైగా పెండింగ్ ఉన్న మిల్లులు రోజుకు కనీసం 2 నుంచి 3 ఏసికే చొప్పున బియ్యం సరఫరా చేసేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆ స్థాయిలో సరఫరా చేయడం కొంత కష్టంగా ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సరఫరా వేగాన్ని పెంచాలని స్పష్టం చేశారు.

పెండింగ్ బకాయిల పరిష్కారానికి సహకారం

దిచ్పల్లి పరిధిలోని 12 మిల్లులతో పాటు ఇతర మిల్లులకు పెండింగ్ బియ్యం సరఫరా, సంబంధిత బకాయిల క్లియరెన్స్లో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

మిల్లుల సమస్యలను పరిశీలించి, పెండింగ్ బకాయిల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

ప్రతి రైస్ మిల్లర్ సీఎంఆర్ బియ్యం సరఫరాను అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని, గడువులోగా పెండింగ్ మొత్తాన్ని పూర్తిగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గడువు తర్వాత డిఫాల్ట్ మిల్లులుగా పరిగణన

నిర్దేశించిన గడువును ప్రతి మిల్లర్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నవంబర్ 29, 2026లోగా పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరా పూర్తి చేయాలని, నవంబర్ 30 నాటికి కూడా బియ్యం సరఫరా చేయని మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. గడువు పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని మిల్లర్లు తమ పెండింగ్ బియ్యం సరఫరా లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఎస్పో జితేందర్ రెడ్డి, డిఏం సివిల్ సప్లై జితేంద్ర ప్రసాద్, రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.


రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, నవంబర్ 04 (మనం ప్రతినిధి): జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి మరియు తొంబారావుపేట్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, భూ రికార్డుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను చేపట్టాలని, భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, మేడిపల్లి మండల తహసీల్దార్ , సంబంధిత అధికారులు మరియు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి కానుకగా 'కాట'కు కార్పొరేషన్ చైర్మన్ పదవి..?



పండుగ తర్వాత నామినేటెడ్ పదవుల ప్రకటనపై ఆశలు
కాట శ్రీనివాస్ గౌడ్‌కు పదవిపై పెరుగుతున్న అంచనాలు
రాష్ట్రస్థాయి పదవితో కాంగ్రెస్‌కు రాజకీయంగా ప్రయోజనం
కాటకు పదవి ఇస్తే.. పటాన్‌చెరు కాంగ్రెస్‌కు కొత్త కళ!

పటాన్‌చెరు, నవంబర్ 4 (మనం న్యూస్) : పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్‌కు దీపావళి కానుకగా కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కనుందా? నామినేటెడ్ పదవిని కేటాయించడం ద్వారా పార్టీ అధిష్టానం ఆయనకు సముచిత ప్రాధాన్యత కల్పించనుందా? ప్రస్తుతం పటాన్చెరు రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ సాగుతోంది. దీపావళి పండుగ తర్వాత తెలంగాణ ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవులను ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో కాట శ్రీనివాస్ గౌడ్ పేరు కూడా తెరపైకి వస్తోంది. దీంతో ఆయనకు పదవి దక్కుతుందన్న ఆశలు స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తూ, పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న కాట శ్రీనివాస్ గౌడ్కు రాష్ట్రస్థాయిలో సముచిత గుర్తింపు కల్పించాలన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించనున్న నామినేటెడ్ పదవుల జాబితాలో ఆయనకు అవకాశం లభిస్తే పార్టీకి, స్థానిక నాయకత్వానికి ప్రయోజనం చేకూరుతుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్య సమస్య..

పటాన్‌చెరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే.. ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకపోవడం స్థానిక నాయకత్వానికి ఒక సవాలుగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎంపీ, ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీకి, ఎమ్మెల్యే స్థానంలో బీఆర్ఎస్కు ప్రాతినిధ్యం ఉండటంతో అధికారిక కార్యక్రమాలు, ప్రభుత్వ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న చర్చ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కాట శ్రీనివాస్ గౌడ్కు కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయిస్తే నియోజకవర్గ కాంగ్రెస్కు ఒక గుర్తింపు లభించడంతో పాటు, పార్టీ తరఫున ప్రభుత్వంతో సమన్వయం చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని నాయకులు, కార్యకర్తలు ఆశిస్తున్నారు.

కాటకు పదవితో పార్టీకి బలం..క్యాడర్‌కు ప్రోత్సాహం

కాట శ్రీనివాస్ గౌడ్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కితే పటాన్చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా మరింత బలోపేతమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రస్థాయి పదవిలో ఉంటే ప్రభుత్వానికి, నియోజకవర్గ ప్రజలకు మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తూ స్థానిక సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ కీలక పాత్ర పోషించవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు లేని నేపథ్యంలో రాష్ట్రస్థాయి పదవి ద్వారా పార్టీ కార్యక్రమాలకు మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ నాయకులకు ప్రాధాన్యత పెరగడంతో పాటు, స్థానికంగా అభివృద్ధి పనుల సాధనకు కృషి చేసే అవకాశం కూడా మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు. ఈ విధంగా కాటకు పదవి దక్కితే అది ఆయన వ్యక్తిగత రాజకీయ ప్రాధాన్యతను పెంచడమే కాకుండా, నియోజకవర్గ కాంగ్రెస్కు కూడా ప్రయోజనం చేకూర్చవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం..

కాటకు సముచిత గుర్తింపు

పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం కల్పించడం పార్టీ బలోపేతానికి కీలకం. ఈ నేపథ్యంలో కాట శ్రీనివాస్ గౌడ్కు కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కితే పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నిండుతుందని భావిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు, భవిష్యత్తులో పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరించేందుకు సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశిస్తున్నారు. కాట శ్రీనివాస్ గౌడ్కు రాష్ట్రస్థాయి పదవి కేటాయించడం ద్వారా ఆయనకు సముచిత గుర్తింపు కల్పించినట్లవుతుందని, అదే సమయంలో నియోజకవర్గంలో పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న శ్రేణులకు కూడా భరోసా లభిస్తుందని పార్టీ వర్గాల అభిప్రాయం. అందువల్ల ఈ పదవి కేవలం ఒక నాయకుడికి దక్కే అవకాశం మాత్రమే కాకుండా, పటాన్చెరు కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తుకు ప్రోత్సాహాన్నిచ్చే నిర్ణయంగా నిలుస్తుందని ఆశిస్తున్నారు.



కాటకు దీపావళి తీపి కబురు అందేనా?

దీపావళి తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించనున్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల జాబితాపై పటాన్చెరు కాంగ్రెస్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఆ జాబితాలో కాట శ్రీనివాస్ గౌడ్కు అవకాశం లభిస్తే ఆయనకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు దక్కడంతో పాటు, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయ ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంటుంది. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు కూడా ఈ నిర్ణయం దోహదపడుతుందని భావిస్తున్నారు. అయితే, కాట శ్రీనివాస్ గౌడ్కు చైర్మన్ పదవి దక్కుతుందన్నది ప్రస్తుతానికి రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న అంచనా. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరి దీపావళి పండుగ కాట శ్రీనివాస్ గౌడ్కు తీపి కబురు అందిస్తుందా? నామినేటెడ్ పదవుల జాబితాలో ఆయన పేరు ఉంటుందా? అన్నది వేచి చూడాల్సిందే!

ధర్మారెడ్డిపల్లి రోడ్డు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి



- **బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా**

గజ్వేల్ అక్టోబర్ 4 మనం న్యూస్: గజ్వేల్-చేగుంట ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి ఎలకంటి సురేష్, మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ గజ్వేల్ నుంచి చేగుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి దాదాపు సంవత్సరం గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతు పనులు పూర్తి చేయకపోవడం విచారకరమని అన్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది మంది ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం వల్ల ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతు పనులను పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తుల సహకారంతో బీజేపీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నవారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వంజరి రాజు, ధాతర్పల్లి సర్పంచ్ దివ్య రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, బీనమైన ప్రభాకర్, శాతం స్వామి, మండల కార్యదర్శి కూర స్వామి, మండల కోశాధికారి పంజ బాలయ్య, మండల సీనియర్ నాయకులు బోయిని సత్యం, రామస్వామి, వాచిని శివప్రసాద్, నగేష్, శ్రీరామ్ రాజు, బీజేవైఎం నాయకులు మహేష్ చారి, సాయికిరణ్, అనిల్, సంతోష్, చందు, మండల నాయకులు కర్నాల గణేష్, నరేష్ గౌడ్, కర్ణకర్, మణికంఠ, రాజు, మల్లేశం, మహేందర్, చింటూ, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

- **జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి**

కామారెడ్డి, నవంబర్ 4 (మనం బ్యూరో): జిల్లాలో ఎల్నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి లభ్యతలో ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో ఆయిల్పామ్ సాగు రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటగా నిలుస్తుందని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి పేర్కొన్నారు. సంప్రదాయ పంటలతో పాటు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అంబర్పేట్ గ్రామానికి చెందిన రైతు ప్రవీణ్రావు సాగు చేస్తున్న ఆయిల్పామ్ తోటను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సాగు విధానం, దిగుబడి, ఆదాయం, ప్రభుత్వ రాయితీలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు ప్రవీణ్రావు మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా ఆయిల్పామ్ సాగు చేస్తున్నానని, ప్రస్తుతం దిగుబడి ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటివరకు 10 విడతల్లో గెలల కోత చేపట్టి సుమారు 10 టన్నుల దిగుబడి పొందినట్లు వివరించారు. వీటి విక్రయం ద్వారా ఇప్పటివరకు రూ.2.50 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. దీర్ఘకాలికంగా మంచి ఆదాయం పొందే అవకాశం ఉండటంతో సంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు.



ఆయిల్ఫాం సాగును ప్రభుత్వ రాయితీలు

జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి మాట్లాడుతూ... ఆయిల్పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోందన్నారు. సాగు చేసే రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.4,200 చొప్పున నిర్వహణ ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు.

అర్హత మేరకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై కూడా రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి మొక్కల లభ్యత, సాగు విధానం, రాయితీల వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుమన్, విస్తరణ అధికారి బాపురెడ్డి, హిందుస్థాన్ యూనిలీవర్ మేనేజర్ చంద్రబాబు, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, ఆయిల్పామ్ సిబ్బంది హిమకుమార్, అరుణ్, శివ, సత్యనారాయణ, కిరణ్, అంబర్పేట్ సర్పంచ్, అంబర్పేట్, దోమకొండ ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



టీడబ్ల్యూజేఎఫ్ జగిత్యాల జిల్లా నేత రవీందర్ రావుకు పరామర్శ

జగిత్యాల, నవంబర్ 4(మనం న్యూస్): అనారోగ్యంతో చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి, మనం దినపత్రిక జిల్లా స్టాపర్ మేన్నేని రవీందర్ రావు ను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు పరామర్శించారు. బుధవారం వారు జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రవీందర్ రావు ఆరోగ్య సమస్యలతో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఆయనను పరామర్శించిన వారిలో ఫెడరేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్, ఉపాధ్యక్షులు కాసం శ్రీనివాస్ రెడ్డి, రాగం రమేష్, సహాయ కార్యదర్శి అనంతుల కాంతారావు, కోశాధికారి మేన్నేని శ్రీనివాస రావు, కార్యవర్గ సభ్యుడు గోపాటి నరేందర్ రావు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు జైపాల్, నాయకులు తిరునగరి శ్రీనివాస్, ఎం. నర్సయ్య తదితరులున్నారు.

యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీకగా సదర్ సమ్మేళనం



- **మెట్టు కుమార్ యాదవ్**
- **ఎన్టీఆర్ గార్డెన్స్లో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు**
- **పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, రాగం నాగేందర్ యాదవ్**

పటాన్ చెరు, నవంబర్ 4 (మనం న్యూస్): నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్స్ ప్రాంగణంలో యాదవుల సంప్రదాయ పండుగైన సదర్ సమ్మేళనాన్ని అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు యాదవ సామాజికవర్గ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ సదర్ ఉత్సవాల్లో బీసీ జేఏసీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. వీరితో పాటు గోదా నరేందర్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర యాదవ కో-ఆపరేటివ్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ తదితర ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. యాదవుల తరతరాల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ప్రత్యేక కార్యక్రమాలు సదర్ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాదవుల వీరత్వం, ఐక్యత, ఆత్మగౌరవం, సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ సమ్మేళనం అందరిలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సదర్ పండుగ యాదవుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, తరతరాలుగా కొనసాగుతున్న గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేయడంతో పాటు సమాజంలో ఐకమత్య భావనను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, రవీంద్ర చారి, రాజు, యాదవ సంఘం ప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



గజ్వేల్ నవంబర్ 4 మనం న్యూస్: గజ్వేల్ మండలంలో ని సింగాటం గ్రామ రైతు దాసరి నర్సింలు పొలంలో వరి పంటను శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించడం జరిగింది. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట మరియు వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల నుంచి శాస్త్రవేత్తల బృందం డా. పల్లవి, డా. రమాదేవి, డా. నీలిమ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ నుంచి మండల వ్యవసాయ అధికారి జి. నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి గణేష్ మరియు హరి కంపెనీ ప్రతినిధులు సింగాటం గ్రామం, గజ్వేల్ మండలంలో రైతు దాసరి నర్సింలు పొలంలో వరి పంటను పరిశీలించడం జరిగింది. రైతు పొలంలో వరిలో మొగి పురుగు గమనించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందం మాట్లాడుతూ వరి నారులో మొగిపురుగు గమనించినట్లైతే రెక్కల పురుగు మరియు గుడ్ల సముదాయాన్ని నివారించడానికి వేప నూనే లేదా వేప కాషాయం 5మి.లీ/లీటర్ మరియు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఒక ఎకరా నారు మడికి ఒక లింగాకర్ష బుట్ట పెట్టి కూడా పురుగు ఉధృతిని తగ్గించవచ్చును. తర్వాత 800 గ్రా. కార్పోప్యురాన్ 3జి గుళికలను నాటువేసే వారం రోజుల ముందు వేసుకున్నట్లైతే మొగిపురుగును నివారించవచ్చును.

వరిలో 30 రోజుల తర్వాత మొగిపురుగు గమనించినట్లైతే దాని నివారణకు ఎకరాకు 3 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ + ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా ఐసోసైక్లోసెరామ్ 120 మి.లీ/ఎకరా లేదా టెట్రానిలిప్రోల్ 100 మి.లీ/ఎకరాకు పిచికారి చేసుకోవాలి.

వరి పంట పొట్ట దశ నుండి వరి ఈనె దశలో మొగిపురుగు ఉధృతి వలన తెల్ల కంకులు మరియు ఆకు ముడత పురుగు గమనించినట్లైతే నివారణకు కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 50 ఎస్పీ 2 గ్రా. లేదా ఎసిపేట్ 75 ఎస్పీ 1.5 గ్రా. లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మీ.లి ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవలని రైతులకు తెలిపారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి

- **బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించాలి**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్.**
- **హాజరైన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె**



సిరిసిల్ల, నవంబర్ 04 (మనం ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, ఎస్పీ మహేష్ బి. గితె, వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కేసుల విచారణ త్వరగా పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధితులకు పరిహారం అందించాలన్నారు. సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు అట్రాసిటీ కేసుల బాధితులకు రూ.1,81,57,500 పరిహారం అందించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపకార వేతనాలు, విదేశీ విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె మాట్లాడుతూ.... అట్రాసిటీ కేసుల విచారణను వేగంగా పూర్తి చేస్తూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్పీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణలపై
కఠిన చర్యలు తీసుకోవాలి

- **జిల్లాలో 157 వెట్ల్యాండ్స్ గుర్తింపు.. హద్దుల సర్వేకు కలెక్టర్ ఆదేశాలు**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

హాజరైన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె



సిరిసిల్ల, నవంబర్ 04 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలో అటవీ భూములు, వన్యప్రాణులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలో ఎస్పీ మహేష్ బి. గితె, డీఎఫ్ఓ సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి అటవీ భూముల ఆక్రమణలు, వన్యప్రాణుల సంరక్షణ, చెరువుల (వెట్ల్యాండ్స్) అభివృద్ధి, సిట్ నియామకంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా భూముల సరిహద్దులను పరిశీలించి జాయింట్ సర్వే చేపట్టాలని, అటవీ భూములను ఆక్రమించే వారిపై, వన్యప్రాణులను వేటాడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ భూముల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. జిల్లాలో 157 వెట్ల్యాండ్స్ గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. వాటి హద్దులు, విస్తీర్ణం, ఎఫ్టీఎల్ వివరాలను సంబంధిత శాఖల సమన్వయంతో సర్వే చేసి మ్యాపింగ్ పూర్తి చేయాలని, ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. చెరువుల అభివృద్ధి ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు పర్యావరణ పరిరక్షణ, పక్షులు, వన్యప్రాణుల సంరక్షణ, పర్యాటక అభివృద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అటవీ శాఖ చేపట్టే కార్యక్రమాలపై ముందస్తు సమాచారం అందించాలని ఎస్పీ మహేష్ బి. గితె సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖిల్లా రోప్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి


- త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి
- రోప్వేకు అనుబంధంగా మౌళిక వసతుల కల్పనకు పక్కా ప్రణాళిక
- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, నవంబర్ 4(మనం బ్యూరో): ఖమ్మం ఖిల్లా రోప్వే నిర్మాణ పనులను నిర్ణీత కాలపరిమితి లోగా పూర్తి చేసి, ప్రజలకు త్వరితగతిన రోప్వే సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఖమ్మం ఖిల్లా రోప్వే నిర్మాణ పనుల పురోగతిపై రోప్వే నిర్మాణ సంస్థ సీఈఓ రంజిత్ పరకాసి హైదరాబాద్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను, పర్యాటక ఆకర్షణను దృష్టిలో ఉంచుకుని రోప్వే ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్దేశించిన గడువుకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. రోప్వే ప్రారంభమైన అనంతరం పర్యాటకులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రోప్వేకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు, వాహనాల పార్కింగ్ సదుపాయాలు, ఇతర మౌళిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా సందర్శకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రోప్వే నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. ఖమ్మం ఖిల్లా రోప్వే అందుబాటులోకి వస్తే ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం ఖిల్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగేలా, సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసి రోప్వే సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.

ప్రశ్నార్థకంగా మారిన ఆహార భద్రత!

రెండుమూడేళ్లుగా ఫుడ్ సేఫ్టీ తనిఖీలు లేవంటూ ఆరోపణలు
లైసెన్సులు లేకుండానే కొన్ని దుకాణాల నిర్వహణ..
నాణ్యతలేని ఆహారంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు
వసూళ్ల ఆరోపణలపై విచారణ జరపాలని స్థానికుల డిమాండ్



కొత్తగూడెం టౌన్, నవంబర్ 4 (మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పెద్దబజార్, చిన్నబజార్ ప్రాంతాల్లో ఆహార భద్రత పర్యవేక్షణపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చూడాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కొరవడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత రెండుమూడేళ్లుగా ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వసూళ్ల వ్యవహారంపై ఆరోపణలు

కొత్తగూడెంలోని వందలాది దుకాణాల నుంచి ఒక్కో షాపుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. శ్రీనివాస్ అనే వ్యక్తి వ్యాపారుల నుంచి నగదు సేకరించి ఫుడ్ సేఫ్టీ అధికారులకు అందజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

లైసెన్సులు, నాణ్యతపై పర్యవేక్షణ ఏదీ?

పెద్దబజార్, చిన్నబజార్ ప్రాంతాల్లో కొన్ని దుకాణాలు అవసరమైన ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు లేకుండానే నిర్వహిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల నాణ్యతలేని ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. సరుకుల తయారీ తేదీలు, గడువు తేదీలు, నిల్వ విధానాలు, నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్యంపై ఆందోళన

ప్రతిరోజూ వందలాది మంది వినియోగదారులు ఈ మార్కెట్లలో నిత్యావసర సరుకులు, తినుబండారాలు కొనుగోలు చేస్తుంటారు. ఆహార పదార్థాల నాణ్యతపై పర్యవేక్షణ లేకపోతే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆహార భద్రత నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్ స్పందించాలి..
ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పెద్దబజార్, చిన్నబజార్ ప్రాంతాల్లో జిల్లా స్థాయి ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దుకాణాల లైసెన్సులు, ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలు, నిల్వ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతున్నారు. అదేవిధంగా నగదు వసూళ్ల ఆరోపణలపై విచారణ జరిపి నిజానిజాలు నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




బియ్యం అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్
- కొత్తగూడెం బియ్యం దుకాణాల తనిఖీ

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 (మనంప్రతినిధి): తెలంగాణ సివిల్ సప్లైస్ కమీషనర్ ఆదేశాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పట్టణంలో వివిధ బియ్యం విక్రయించే దుకాణాలను అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ జిల్లాలోని పలువురు సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్లతో కలిసి తనిఖీలు నిర్వహించారు .ప్రతి దుకాణంలో ధరల పట్టికను పెట్టి పట్టికలో నిర్ణయించిన ధరల ప్రకారం వినియోగదారులకు విక్రయించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. దీనిని అతిక్రమించి అధిక ధరలకు విక్రయిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం '6ఎ 'కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదే విధంగా వినియోగదారులు కూడా ఎవరైనా బియ్యం దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించి నట్లయితే సివిల్ సప్లైస్ అధికారుల కు పిర్యాదు చేయ వలసినదిగా తెలియచేసారు. జిల్లాలోని మిగతా రైస్ దుకాణదారులందరూ కూడా ధరల పట్టిక ను ఏర్పాటు చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ఆయా ధరల ప్రకారం విక్రయించవలసినదిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ డిశంకర్ రావు, డి టిలు జి ప్రభాకర్ కొత్తగూడెం, రాజులు మణుగూరు. అశ్వారావుపేట మరియు ఎం రాజేశ్వరరావు భద్రాచలంల పాల్గొన్నారు.

కండక్టర్ ప్రవళిక మృతిపై ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన





- బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి
- ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో డిమాండ్లు..
- ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

మణుగూరు, నవంబర్ 4(మనం న్యూస్): అశ్వాపురం మండలం మిట్టగూడెం సమీపంలో గత నెల 25వ తేదీన జరిగిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఆర్టీసీ కండక్టర్ గుండు ప్రవళికకు పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆమె మృతితో ఆర్టీసీ ఉద్యోగుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.గత నెల 25న మిట్టగూడెం సమీపంలో ఆర్టీసీ బస్సులో జరిగిన వివాదం నేపథ్యంలో ప్రవళిక బస్సు కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్కు తరలించగా, చికిత్స పొందుతూ నవంబర్ 4వ తేదీ ఉదయం మృతి చెందింది. ఆమె మరణం ఆర్టీసీ కార్మిక వర్గాలను కలచివేసింది. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మణుగూరులో అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రవళిక మృతికి కారణమైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నారని, విధి నిర్వహణలో వారి భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని జేఏసీ నాయకులు కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బస్సుల్లో పనిచేసే సిబ్బందికి రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, మణుగూరు డిపోకు చెందిన కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులు పాల్గొని ప్రవళికకు ఘనంగా నివాళులర్పించారు.

జేఏసీ ప్రధాన డిమాండ్లు :

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే స్పందించి, బస్సు నుంచి తోసివేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.కండక్టర్లు, డ్రైవర్లు విధి నిర్వహణ సమయంలో దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.ప్రవళిక కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.ప్రభుత్వ ప్రకటన మేరకు కోటి రూపాయల పరిహారంతో పాటు కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలి. ఆర్టీసీ డిపో యాజమాన్యం తరపున రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా అందించాలి.

దెబ్బతిన్న పంటల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- వరి పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపించాలి
- మిరప మొక్కలకు ఆధారం కల్పించాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు
- సుజాతనగర్లో నేలకొరిగిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలన



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 (మనంప్రతినిధి): మురసు తుఫాను ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను సంరక్షించుకునేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తగూడెం మండలం సుజాతనగర్ గ్రామంలో నేలకొరిగిన వరి పంట పొలాలను చైతన్య రెడ్డి, కొత్తగూడెం వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ), సుజాతనగర్ మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ)తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల పరిస్థితిని, వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ, వరి పంట నేలకొరిగిన ప్రాంతాల్లో పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించాలని సూచించారు. నీరు ఎక్కువ సమయం నిల్వ ఉండకుండా మురుగు కాలువల ద్వారా నీటిని తొలగించాలని తెలిపారు. వరి కంకులు తడిసి ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉన్నచోట ఒక ట్యాంకు నీటిలో 100 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయడం ద్వారా మొలకలు రాకుండా నివారించవచ్చని అన్నారు. మిరప పంట సాగు చేస్తున్న రైతులు భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నేలకొరిగిన మొక్కలను తిరిగి నిలబెట్టి కర్రలు లేదా ఇతర ఆధారాలతో కట్టుకోవాలని సూచించారు. మొక్కల మొదళ్ల వద్ద మట్టిని ఎగదోసి మొక్కలు పడిపోకుండా చూడాలని, చేలల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన పారుదల సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అధిక తేమ కారణంగా తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉన్నందున పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహా మేరకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో అధిక వర్షపాతం నమోదైన నేపథ్యంలో పంట నష్టంపై ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు బాబురావు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 1600 ఎకరాల్లో మినుము పంట, 1,500 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలిస్తూ వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులు పంటల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైన సాంకేతిక సలహాల కోసం సమీప వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఆ ప్రకటనలో కోరారు.

ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి

నెలవారీ ఇవిఎం గోడౌన్ తనిఖీ చేపట్టిన కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, నవంబర్ 04(మనం బ్యూరో);ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు.
అత్యవసర సైరన్ మోగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టు ల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. తనిఖీ రిజిస్టర్లలో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- ప్రతి బియ్యం విక్రయ కేంద్రంలో ధరలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి
- బీపీటీ, కేఎస్ఎం రకాలు కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రూ.79
- నిబంధనలు ఉల్లంఘిస్తే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తాం
- బియ్యం ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు, లీగల్ మెట్రోలజీ,
- మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్



ఖమ్మం, నవంబర్ 04(మనం బ్యూరో): జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రోలజీ, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఏ పరిస్థితుల్లోనూ బియ్యం విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎస్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్., తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలను ప్రతి రిటైల్ వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఉల్లంఘించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా నిల్వలు దాచిపెట్టినా వెంటనే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మిల్లర్ల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డి ఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రోలాజి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్లో 'మార్చ్ టు గోడౌన్స్'

- గోడౌన్లు బద్దలు కొట్టి పేదలకు బియ్యం పంచుతాం
- పీపుల్స్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్' పేరుతో విశాల ఐక్యవేదిక
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ వెల్లడి



ఖమ్మం, నవంబర్ 4(మనం బ్యూరో): దేశంలో గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని, కరువు సహాయక చర్యలు చేపట్టకపోతే డిసెంబర్ నెలలో 'మార్చ్ టు గోడౌన్స్' పేరుతో గోడౌన్లను ముట్టడించి, వాటిని బద్దలు కొట్టి ప్రజలకు బియ్యం పంపిణీ చేస్తామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్నినో వల్ల కొంత కరువు ఏర్పడితే, ప్రభుత్వాల నిర్లక్ష్యం, తప్పుడు విధానాల వల్లే మిగతా కరువు తీవ్రతరమైందని మండిపడ్డారు. దేశంలో కరువు నివారణ, సహాయక చర్యల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నిత్యావసర సరుకుల కోటాను రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్సీఐ గోడౌన్లలో 6 కోట్ల టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నప్పటికీ ప్రజలకు ఉచితంగా లేదా రాయితీకి ఇవ్వకుండా, ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తూ ధరల పెంపునకు సహకరిస్తున్నారని ఆరోపించారు.

కార్పొరేట్ వ్యతిరేక పోరు

దేశంలో ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియకు వ్యతిరేకంగా, జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ 'పీపుల్స్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్' పేరుతో విశాల ఐక్యవేదికగా సుదీర్ఘ పోరాటం కొనసాగిస్తామని వెంకట్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన తప్పులను దిద్దుకోవడానికి బదులుగా, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ వల్ల దేశవ్యాప్తంగా రద్దయిన 13 కోట్ల ఓట్లలో అత్యధికంగా వ్యవసాయ కార్మికులు, దళితులు, వలస కార్మికులు, ముస్లింలవే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని, రైతులకు ఇచ్చే సబ్సిడీలను క్రమంగా కోత విధిస్తోందని ధ్వజమెత్తారు. నాలుగేళ్ల క్రితం బడ్జెట్లో ఎరువుల సబ్సిడీకి రూ. 2.95 లక్షల కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం దాన్ని రూ. 1.90 లక్షల కోట్లకు తగ్గించి రైతాంగంపై తీవ్ర భారం మోపారని తెలిపారు. ఒకవైపు వ్యవసాయ దిగుబడి 34 నుండి 35 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగినప్పటికీ, బహిరంగ మార్కెట్లో బియ్యం ధర రూ. 60 నుండి రూ. 95కి చేరడం, మిగిలిన నిత్యావసరాల ధరలు 200 నుండి 300 శాతం పెరగడం ప్రభుత్వాల వ్యాపార సానుకూల విధానాల ఫలితమేనని ఆరోపించారు. బ్లాక్ మార్కెట్ చేస్తూ కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై పిడి యాక్ట్, ఊపా చట్టాలను ప్రయోగించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో దేశవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల అసైన్డ్, పేదల భూములను ధనవంతులకు, కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్లో 22ఏ జాబితా నుండి 10 లక్షల ఎకరాలను తొలగించి వేలం వేస్తుంటే, తెలంగాణలో 22ఏ పేరుతో సామాన్యుల భూములను చేర్చి వేధిస్తున్నారని పేర్కొన్నారు. సమగ్ర భూపంపిణీ జరగకుండా పేదరికం నిర్మూలన సాధ్యం కాదన్నారు. ఈ నెల 15న నల్గొండలో జరిగే అఖిల భారత రైతు సంఘం మహాసభలకు తెలంగాణ నుండి లక్ష మంది రైతులు, వ్యవసాయ కార్మికులు తరలివస్తారని వెల్లడించారు. అలాగే ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తూ ఏడాదికి 200 రోజులు పని, రూ. 600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే ఫిబ్రవరి 14 నుండి 17 వరకు బెంగళూరులో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత మహాసభలు జరగనున్నాయని తెలిపారు.ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల సంఘం తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని ప్రకటిస్తూ బాధితులకు న్యాయం చేయాలని, కార్మికుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఖమ్మం డివిజన్ కార్యదర్శి పడిగల నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సారంగి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎం గ్రీన్ ఐజిపిఎల్ వెజాగ్‌ను భారత గోల్ఫ్ మ్యాప్‌లో నిలిపింది

- ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ సహకారంతో క్రీడను ప్రోత్సహించనున్న వైజాగ్ డాల్ఫిన్స్
- వైజాగ్ డాల్ఫిన్స్ జేసీ క్లినిక్లు, జూనియర్ అకాడమీని ప్లాన్ చేస్తోంది
- ఐ జి పి ఎల్ యొక్క ఎక్స్ -గోల్ఫ్ ఫార్మాట్ యువతను మరియు తొలిసారి చూసే అభిమానులను లక్ష్యంగా చేసుకుంది

విశాఖపట్నం, నవంబర్ 4 మనం న్యూస్ : గోల్ఫ్ గమ్యస్థానంగా విశాఖపట్నానికి పెరుగుతున్న ఖ్యాతి ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది, ఎందుకంటే ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఏ ఎం గ్రీన్ ఐజీపీఎల్ లీగ్లో భాగమైన గ్రీన్ ఫ్యూయెల్స్ మారిటైమ్ ఇన్విటేషనల్ 2026ను నిర్వహిస్తోంది. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్లో జరుగుతున్న మొదటి ఐజీపీఎల్ ఈవెంట్ ఇదే. గతంలో ఈ క్లబ్ అనేక ఇండియన్ గోల్ఫ్ యూనియన్ మరియు ఉమెన్స్ గోల్ఫ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈవెంట్లను నిర్వహించింది. గ్రీన్ ఫ్యూయెల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు వైజాగ్ డాల్ఫిన్స్ జీసీ సహ-యజమాని సుధాకర్ కలిగిత్తి, తన ఫ్రాంచైజీ వైజాగ్ డాల్ఫిన్స్ ద్వారా వైజాగ్లో గోల్ఫ్ను ప్రోత్సహించడం గురించి మాట్లాడుతూ ఎంతో ఉత్సాహం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫ్యూయెల్ గ్లోబల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంలోని వైజాగ్ డాల్ఫిన్స్ జీసీ కి, నగరంలో ఈ క్రీడను అభివృద్ధి చేయడానికి రూపొందించిన సుదీర్ఘ ప్రణాళికలో ఈ టోర్నమెంట్ మొదటి అడుగు. 'ఆంధ్రప్రదేశ్ కోసం ఒక ఫ్రాంచైజీ జట్టును తీసుకోవాలని మేము ఆసక్తిగా ఉన్నాము, అందుకే వైజాగ్ డాల్ఫిన్స్ జీసీ పేరుతో గోల్ఫ్ జట్టును ఎంచుకున్నాము. ఈ క్రీడకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది, అలాగే ఇది ఒలింపిక్ క్రీడ కూడా. అందమైన వైజాగ్ నగరంలోని యువ ప్రతిభను పోషించి, వారిని



ఆంధ్రప్రదేశ్కు మరియు వెలుపలకు పరిచయం చేసి, సమీప భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే మా ముఖ్య ఉద్దేశ్యం,' అని కలిగిత్తి అన్నారు.

ఆతిథ్య క్లబ్ ఇ పి జి సి మరియు ఫ్రాంచైజీ యజమానులైన వైజాగ్ డాల్ఫిన్స్ జీసీ , క్లబ్లో క్లినిక్లు మరియు జూనియర్ కార్యక్రమాల ద్వారా ఆంధ్రప్రదేశ్లో ఈ క్రీడపై అవగాహన కల్పించడానికి పెద్ద ప్రణాళికలు కలిగి ఉన్నాయి. ఏ ఎం గ్రీన్ ఐజీపీఎల్ సీఈఓ మరియు మాజీ ఆసియన్ టూర్ ప్రొఫెషనల్ ఉత్తమ్ సింగ్ మండి, లీగ్ యొక్క కొత్త స్పీడ్-గోల్ఫ్ ఫార్మాట్ అయిన ఎక్స్ -గోల్ఫ్ గురించి మాట్లాడారు. వేగవంతమైన, ఉత్కంఠభరితమైన గోల్ఫ్ శైలితో యువతరాన్ని ఆకర్షించడం దీని లక్ష్యం.

లీగ్ను నగరానికి తీసుకురావడంలో ఫ్రాంచైజీ పాత్రను ఇ పి జి సి ప్రశంసించింది. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ గౌరవ కార్యదర్శి ఎస్ వి ఆర్ రాజు మాట్లాడుతూ, 'ఏ ఎం గ్రీన్ ఐ జి పి ఎల్ ను మొదటిసారి నిర్వహించడం ఇ పి జి సి కి చాలా సంతోషంగా ఉంది, దీనిని ఇకపై కూడా కొనసాగించాలని ఆశిస్తున్నాము. ఇక్కడ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ జరగడానికి చొరవ చూపి, సహకరించిన జట్టు యజమానులైన వైజాగ్ డాల్ఫిన్స్కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ప్రొఫెషనల్ గోల్ఫ్ అనుబంధం కలిగి ఉండటం, మా సౌకర్యాలను మరియు ఆతిథ్యాన్ని ప్రదర్శించడం మా క్లబ్కు గర్వకారణమైన క్షణం,' అన్నారు.

ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఉపాధ్యక్షుడు టీ ఎస్ వర్మ మాట్లాడుతూ, ఈ ప్రసిద్ధ క్లబ్లో ఇప్పుడు కొత్త క్లబ్హౌస్ మరియు పునరుద్ధరించిన ఛాంపియన్షిప్ కోర్సు ఉన్నందున, సందర్శక ప్రొఫెషనల్స్ను ఆకట్టుకోగలమని తమకు నమ్మకం ఉందని చెప్పారు.

వర్మ ఇలా అన్నారు, 'వైజాగ్లో గోల్ఫ్ కోర్సు ఉందని చాలా మందికి తెలియదు, కానీ మేము 1884 నుండి ఉనికిలో ఉన్నాము. 2020లో కోర్సును ఛాంపియన్షిప్ కోర్సుగా పునరుద్ధరించినప్పటి నుండి, వైజాగ్లో అందమైన గోల్ఫ్ కోర్సు ఉందన్న మాట వ్యాపించింది. నిన్న ఆడిన ప్రొఫెషనల్స్ అందరూ దీని విశిష్టత గురించి మాట్లాడుతున్నారు; తూర్పు కనుమల మధ్య ఉన్న ఈ గోల్ఫ్ కోర్సు మలేషియా లేదా థాయిలాండ్ను పోలి ఉంటుంది.'

ఇపీజీఎస్ ని తమ 'హోమ్'గా మార్చుకోవాలని యోచిస్తున్న వైజాగ్ డాల్ఫిన్స్ జీసీ , క్లినిక్లు మరియు జూనియర్ అకాడమీతో కూడిన దీర్ఘకాలిక ప్రణాళికను కలిగి ఉంది.

వైజాగ్ డాల్ఫిన్స్ జి సి డైరెక్టర్ సి హెచ్ రాజశేఖర్ ఇలా జోడించారు, 'ఈ టోర్నమెంట్ పూర్తయిన తర్వాత, మా ప్రోలతో మరిన్ని క్లినిక్లు నిర్వహించాలని, ఆపై ఐ జి పి ఎల్ సహకారంతో జూనియర్ గోల్ఫ్ కోసం అకాడమీని ప్రారంభించాలని మేము కోరుకుంటున్నాము. వీలైనంత ఎక్కువ మంది పిల్లలకు అట్టడుగు స్థాయి నుండి శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాము. చాలా మందికి గోల్ఫ్ గురించి తెలియదు, కాబట్టి ముందుగా ప్రజలు ఈ ఆటను అర్థం చేసుకునేలా చేయడం, ఈ ఫార్మాట్ ద్వారా ఆసక్తిని కలిగించడం, మరియు వీలైనంత ఎక్కువ మందిని అందమైన గోల్ఫ్ క్రీడ వైపు తీసుకురావడం మా దృష్టి.'

గోల్ఫ్కు కొత్త ప్రేక్షకులను తీసుకురావడం కూడా ఈ సీజన్లో లీగ్ జోడించిన స్పీడ్-గోల్ఫ్ ఫార్మాట్ అయిన ఎక్స్ -గోల్ఫ్ లక్ష్యం. 'లీగ్కు ఎక్స్ -గోల్ఫ్ అనే అత్యంత ఉత్తేజకరమైన ఫార్మాట్ను జోడించాము. ఇది స్పీడ్ గోల్ఫ్, కేవలం ఒకే హోల్, సమయంతో పోటీపడుతూ, స్టేడియం ఫార్మాట్లో ఆడతారు. యువతకు, అలాగే ఈ క్రీడ అర్థం కాని వారికి వచ్చి చూడటానికి, మొత్తం ప్రేక్షకులకు మరింత ఉత్తేజకరంగా మార్చడానికి, గోల్ఫ్ చూసే వారి సంఖ్యను పెంచడానికి దీనిని ప్రవేశపెట్టాము,' అని మండి అన్నారు.

పండుగల సీజన్లో సురక్షిత డిజిటల్ చెల్లింపుల కోసం ఎన్పీసీఐ 5 కీలక భద్రతా సూచనలు

అమరావతి,నవంబర్,4,(మనం న్యూస్): పండుగల సీజన్ అనేది సంబరాలు, బహుమతుల ఇచ్చిపుచ్చుకోవడం, అలాగే షాపింగ్ కార్యకలాపాలు గణనీయంగా పెరిగే సమయం ఈ సమయంలో డిజిటల్ చెల్లింపులు విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) సూచిస్తుంది.

ఈ సందర్భంగా ఆన్లైన్ చెల్లింపుల విషయంలో ఐదు ప్రధాన సురక్షిత డిజిటల్ చెల్లింపుల సూచనలు అందిస్తున్నట్టు ఎన్పీసీఐ ప్రాంతీయ ప్రతినిధి చెప్పారు.

ఆన్లైన్, ఆఫ్లైన్ విక్రయ వేదికలపై వినియోగదారులను ఆకర్షించేందుకు వివిధ రకాల భారీ డిస్కౌంట్లు, పరిమిత కాలపు ప్రత్యేక ఆఫర్లు, క్యాష్బ్యాక్ ప్రోత్సాహకాలను అందిస్తుంటారు. ఈ ఆకర్షణీయమైన ఆఫర్లు వినియోగదారులు త్వరితగతిన కొనుగోలు నిర్ణయాలు తీసుకునేలా ప్రేరేపిస్తాయి. పండుగల సందడి, షాపింగ్ హడావుడి మధ్యలో, నమ్మశక్యం కానంత తక్కువ ధరలకు లభించే ఆఫర్లను సొంతం చేసుకోవాలనే తొందరలో చాలామంది తగినంత ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. వినియోగదారుల ఈ ప్రవర్తనా ధోరణులను సైబర్ మోసగాళ్లు నిశితంగా గమనిస్తూ, సోషల్ ఇంజినీరింగ్ వంటి మానసిక మోసపూరిత పద్ధతుల ద్వారా వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని చెప్పారు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ మోసాలు కూడా కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, తగిన అవగాహనతో వ్యవహరించడం, కొన్ని ప్రాథమిక జాగ్రత్తలు పాటించడం ద్వారా వినియోగదారులు తమ డిజిటల్ లావాదేవీలను సురక్షితంగా నిర్వహించుకోవడంతోపాటు, ఎలాంటి అంతరాయాలు లేకుండా పండుగల ఆనందాన్ని ఆస్వాదించవచ్చు అని వివరించారు.

అధికారిక యాప్లు, వెబ్సైట్లలో మాత్రమే ప్రజలు షాపింగ్ చేయాలని సూచించారు. అధికారిక ప్లాట్ఫామ్లనే చెల్లింపులను పూర్తి చేయాలని చెప్పారు.

ఉచిత వోచర్లు, క్యాష్బ్యాక్ ఆఫర్ల వాగ్దానాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనుకోకుండా వచ్చే ఓటీపీ లు అభ్యర్థనలను ప్రమాద హెచ్చరికగా పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. మరి ముఖ్యంగా

ఒత్తిడికి గురై తొందరపాటుతో నిర్ణయాలు తీసుకోవద్దు అని చెప్పారు. ఈ జాగ్రత్తలను పాటించడం ద్వారా సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండటంతోపాటు, సురక్షితమైన డిజిటల్ చెల్లింపుల అనుభవాన్ని పొందవచ్చు అని తెలిపారు.

బేతుపల్లిలో చెరువు వరదలో చిక్కుకున్న జాలర్లు

వారిని కాపాడేందుకు వెళ్లిన ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది గల్లంతు

సంఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్, ఎంఎల్ఏ

సహాయక చర్యలు పర్యవేక్షణ

ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, నవంబర్ 4(మనం న్యూస్)ః సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వరదలో చిక్కుకున్న జాలర్లను కాపాడేందుకు వెళ్లిన 11 మంది ఎస్డిఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బేతుపల్లి చెరువు అలుగు పారుతోంది. చెరువులోని చేపలు బయటకు వెళ్లకుండా వలలు పెట్టేందుకు ఏడుగురు జాలర్లు వెళ్లి వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు ముగ్గురు ఫైర్ సిబ్బంది బోటులో వెళ్లారు. అది మొరాయించడంతో వారు చిక్కుకుపోయారు. దీంతో కొత్తగూడెం ఎస్టిఆర్ఫ్కు చెందిన ఆరు గురు, మరో నలుగురు ఫైర్ సిబ్బంది, ఇద్దరు గైడ్లు రెండు బోట్లలో వెళ్లారు. తొలుత బోటులో చిక్కుకుపోయిన ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని వెనక్కి తీసుకొచ్చారు. అనంతరం జాలర్లను తీసుకొచ్చేందుకు వెళ్లారు. దీంతో రెండు పడవలు పల్టీలు కొట్టాయి. ఆ రెండు పడవుల్లో 11 మంది గల్లంతయ్యారు. జాలర్లలో ముగ్గురు యువకులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. మరో నలుగురు వరద నీటిలోనే ఉన్నారు.



విషయం తెలుసుకున్న కలెక్టర్ దివాకర టిఎస్, ఎంఎల్ఏ మట్టా రాగమయి సంఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. భద్రాచలం నుండి ఎస్డిఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి చిక్కుకున్న వారిని సంరక్షించేందుకు ప్రయత్నాలు చేపట్టారు.

మంత్రి తుమ్మల నిరంతర పర్యవేక్షణ

బేతుపల్లి చెరువు ఘటన తెలియగానే రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్షణక్షణం అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అక్కడనే ఉండాలని కలెక్టర్ను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా ఏ సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను స్థానిక ఎంఎల్ఏతో తెలుసుకుంటూ సమన్వయం చేసుకుంటున్నారు.

ముఖ్యమంత్రి ఆరా

బేతుపల్లి చెరువు ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆరా తీశారు. ఎస్డిఆర్ఎఫ్ సిబ్బందిని రక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితులను ముఖ్యమంత్రికి మంత్రి తుమ్మల వివరించారు.

ఎవరు అధైర్య పడవద్దు నేను అండగా ఉంటాను

నెల్లూరు, నవంబర్ 04 (మనం న్యూస్): కార్పొరేషన్ ఎలక్షన్స్ లో ఓటమి చెందినంత మాత్రాన ఎవరు ఆ ధైర్య పడవద్దని..నేను మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఏ సమయంలో పిలిచిన మీకు తోడుగా నిలుస్తానని వైసీపీ సిటీ ఇన్చార్జి,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..

కూటమి అభ్యర్థి గెలవటానికి కష్టపడ్డ అధికారులను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు.డబ్బు అధికారం,మోసం బాగా పని చేశాయన్నారు.

వార్డులను విచ్చలవిడిగా విభజించారు.ఒక ముక్క అక్కడ...ఒక ముక్క ఇక్కడ అనే విధంగా విభజించారన్నారు. ఓటర్ లిస్ట్ కూడా ఇన్ టైమ్ లో ఇవ్వలేదన్నారు. రిజర్వేషన్ కూడా వైసీపీ బలంగా ఉన్నచోట అర్ధరాత్రులు మార్చారనీ ఆగ్రహం వ్యక్తం



చేశారు. అక్రమ కేసులతో భయపెట్టాలని చూసారు.

చిత్ర,విచిత్ర కారణాలతో వైసిపి నామినేషన్లను రిజెక్ట్ చేశారు. మంత్రి నారాయణ ఇలాంటివి ప్రోత్సహించటం దారుణం అన్నారు. విత్ డ్రా చేసుకోమని బెదిరింపులు,లేదా డబ్బులు ఆఫర్ ఇచ్చారన్నారు. బి ఫామ్ ఇచ్చేటప్పుడు..విత్ డ్రా టైమ్ లో మా వాళ్ళను కిడ్నాప్ చేయాలని చూసారన్నారు. ఎలక్షన్ రోజు వంద మీటర్ల దూరంగా ఉండి మా వాళ్ళకి ధైర్యం చెప్పాను..నన్ను పోలీసులు బాగా ఇబ్బందులు పెట్టారు..కానీ టీడీపీ వాళ్ళు మాత్రం యదేచ్ఛగా తిరిగారు. దొంగోట్లు వేయించటానికి నారాయణ గారు విద్యార్థులను ఉపయోగించారు.

ఒక్కో డివిజన్కి దాదాపు రెండు కోట్లు ఖర్చు పెట్టారు. ఓటర్ స్లిప్ బుక్ బయటకు ఎలా వచ్చాయనీ ప్రశ్నించారు. ఇష్టానుసారంగా దొంగ ఓట్లు గుద్దుకున్నారు. ప్రతి ఒక్కటి ప్రజలు గమనిస్తున్నారు..సరైన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.

పోలింగ్లో ఓటు హక్కు వినియోగించుకునే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

- నవంబర్ 5న పరిశ్రమలకు సెలవు.. కార్మికుల వేతనాల్లో కోత విధించరాదు
- ప్రైవేటు, ప్రభుత్వ పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు

పుట్టపర్తి, నవంబర్ 4 మనం న్యూస్: ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో ప్రతి కార్మికుడూ తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ను పురస్కరించుకుని నవంబర్ 5వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో పనిచేసే



కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించారు.

ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల యాజమాన్యాలు తమ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పించాలని స్పష్టం చేశారు. సెలవు కారణంగా కార్మికుల వేతనాల్లో ఎలాంటి కోత విధించరాదని సూచించారు. ఎన్నికల్లో కార్మికులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు ప్రతి పరిశ్రమ యాజమాన్యం ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

తెలంగాణలో కరువు.. ప్రభుత్వ సృష్టే

- మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన
- బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం
- వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : రేవంత్ ప్రభుత్వంపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరువు కాదని?.., ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరువు అని ఆయన తనదైన శైలీలో విమర్శనాస్త్రాలు గుప్పించారు. ఈ మేరకు పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్లో మేడిగడ్డ బ్యారేజీని బుధవారంనాడు సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారితో కలిసి ఆయన పూర్తిగా పరిశీలించారు. అనంతరం వేముల ప్రశాంత్రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఉద్యమ నేత కేసీఆర్కు ఎక్కడా మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడంలేదని ఆయన ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని, ఆయన మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందన్నారు. అయితే, ఆ నీటిని పంపింగ్ చేస్తే రైతులు, పంటలను సైతం కాపాడవచ్చని ఆయన అన్నారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్రెడ్డి పేర్కొన్నారు.

పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం

మంత్రి పి. నారాయణ హామీ..

పెనుకొండ నవంబర్ 4 మనం న్యూస్: పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ హామీ ఇచ్చారు. బుధవారం పెనుకొండలోని రాష్ట్ర బీసీ



సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ క్యాంపు కార్యాలయాన్ని మంత్రి పి. నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి సవితమ్మ ఘన స్వాగతం పలికారు.ఇటీవల జరిగిన పెనుకొండ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంపై నూతన మున్సిపల్ చైర్మన్ త్రివేంద్ర నాయుడుతో పాటు కౌన్సిలర్లను మంత్రి నారాయణ అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. పెనుకొండ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.అనంతరం మంత్రి సవితమ్మతో కలిసి రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల కార్యాచరణపై సమాలోచనలు జరిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, ఎన్నికల పరిశీలకులు సోమశెట్టి వెంకటేశ్వర్లు, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ త్రివేంద్ర నాయుడు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధన మేరకే విధులు నిర్వర్తించండి

- పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్

అనంతపురం, నవంబర్ 4(మనంన్యూస్): రేపటి రోజున గురువారం జిల్లా వ్యాప్తంగా 2వ సాధారణ ఎంపీటీసీ మరియు జెడ్పీటిసి -2026 ఎన్నికల సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులను సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండ, వజ్రకరూర్, కూడేరు మండలాలలో ఆయా ప్రాంతాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ (ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్) కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల సామాగ్రి కంపెనీ పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించి అధికారులకు తగు సూచనలను ఆదేశాలను జారీ చేశారు.

ముఖ్యంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే విధులు నిర్వర్తించాలని ఎట్టి పరిస్థితుల్లో లోటు పాట్లకు తావు ఇవ్వకూడదని సూచించారు. రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, జడ్పీటిసి మరియు ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో సమన్వయంతో ఆయా పనులను పూర్తి చేయాలన్నారు. నేడు ఎన్నికల సామాగ్రిని ఆయా



పోలింగ్ కేంద్రాలకు జాగ్రత్తగా తరలించు కోవాలని అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎటువంటి ఇబ్బందు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటింగ్ సమయానికల్లా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కోరారు. పోలింగ్ నిర్దిత సమయానికే ప్రారంభించాలని దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు నేటి సాయంత్రం కల్లా పూర్తి చేసుకోవాలని అలాగే కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను మరియు శాంతి భద్రత పరిరక్షణకు పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసే వరకు విధులను నిర్వర్తించే వారందరూ ఎలాంటి నిర్లక్ష్యం అలసత్వం ప్రదర్శించకుండా బాధ్యతా యుతంగా , పారదర్శకంగా విధులు నిర్వర్తించి సమర్థవంతంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత ఆర్వోలు, ఎంపీడీవోలు, తాసిల్దార్ లు అరుణ , జయశ్రీ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు కూడేరు ఆర్.ఓ. జుబేదాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ ఏ విధంగా జరుగుతున్నాయి

- వివరాలు అడిగి తెలుసుకున్న ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

అనంతపురం, కలెక్టరేట్ నవంబర్ 04: మనం న్యూస్ : అమరావతిలోని ఏపీ ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ లు, ఎస్పీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలెక్షన్ కమిషనర్ అనిల్



చంద్ర పునేఠ (రిటైర్డ్) సమీక్ష నిర్వహించి మాట్లాడారు.

అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, డిఆర్ఓ ఏ.మలోల, తదితరులు పాల్గొన్నారు.

ఓటెత్తిన అమెరికన్లు



వాషింగ్టన్, నవంబర్ 4: అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌కు రిఫరెండంగా భావిస్తున్న అమెరికా మధ్యంతర ఎన్నికల పోలింగ్ స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమైంది. ఓటర్లు పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. అమెరికాలో ముందస్తుగా ఓటేసే అవకాశమున్నందున సోమవారం నాటికే 5.7 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన దాదాపు 15.3 కోట్ల మంది మంగళవారం ఓటేస్తున్నారు. ఓట్ల లెక్కింపు వెంటనే ప్రారంభమైనా కొన్నిచోట్ల తుది ఫలితాల వెల్లడికి కొన్ని రోజులు పట్టవచ్చు.

అమెరికాలో ముందుగానే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేయవచ్చు. ఈ అవకాశం 47 రాష్ట్రాలతోపాటు వాషింగ్టన్ డీసీలోనూ ఉంది. దీంతోపాటు ఈమెయిల్ ద్వారానూ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ముందుగానే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేసినవారు 3 కోట్లకుపైగా ఉన్నారు. ఈమెయిల్ ద్వారా ఓటేసినవారు 2.5 కోట్లకుపైగా ఉన్నారు. 1.1 కోట్ల మంది డెమోక్రాట్లు ముందుగానే ఓటేశారు. 80 లక్షల మంది రిపబ్లికన్లు ముందుగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన వారంతా ఏ పార్టీకీ అనుబంధంగా లేనివారు. అంటే తటస్థులు. వ్యోమగాములు అనిల్ మేనన్, ల్యూక్ డెలానీ, జెస్సికా వాట్కిన్స్‌లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచే ఓటేశారు.

డెమోక్రాట్లదే పైచేయి!

మంగళవారం నాటికి డెమోక్రాట్లకు మద్దతిస్తున్న వారు 51.5 శాతంగా, రిపబ్లికన్లకు మద్దతిస్తున్నవారు 43.1 శాతంగా ఉన్నట్లు నేషనల్ పోల్లో వెల్లడైంది. చరిత్ర, ముందస్తు ఓటింగ్ సరళిని చూస్తే ట్రంప్నకు ఇబ్బందికరంగానే ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే ఎన్నికల జిల్లాల పునర్వ్యవస్థీకరణతో విజయం సాధిస్తామనే నమ్మకంతో రిపబ్లికన్లున్నారు.

అమెరికా 250 ఏళ్ల చరిత్రలో 2,000 మందికిపైగా గవర్నర్లుగా పని చేశారు. వారిలో 99శాతానికిపైగా శ్వేత జాతీయులే కావడం గమనార్హం. ప్రస్తుతం ఒక్క మేరీలాండ్‌కే ఆఫ్రో అమెరికన్ వెస్ మూర్ గవర్నర్గా ఉన్నారు. ఇప్పటిదాకా ఏ ఒక్క ఆఫ్రో అమెరికన్ మహిళగానీ, నేటివ్ అమెరికన్ మహిళగానీ అమెరికాలో గవర్నర్గా పని చేయలేదు. హిస్పానిక్ జనాభా అధికంగా ఉన్న టెక్సాస్‌కు ఇంతవరకూ ఏ ఒక్క లాటినో గవర్నర్ కాలేదు. ఈసారి ఎన్నికల్లో రెండు పార్టీల తరఫున ఏడుగురు ఆఫ్రో అమెరికన్లు గవర్నర్ల పదవులకు పోటీ పడుతున్నారు. వారిలో ఎవరు గెలిచినా ఆయా రాష్ట్రాలకు తొలి ఆఫ్రో అమెరికన్ గవర్నర్ అవుతారు.

ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక 50శాతం ఓట్లు సాధించిన వారు గెలుస్తారు. తొలి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ 50శాతం ఓట్లు రాకపోతే అతి తక్కువ తొలి ప్రాధాన్య ఓట్లు వచ్చిన అభ్యర్థిని తొలగించి.. రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. దీనివల్ల లెక్కింపు ఆలస్యమయ్యే అవకాశముంది. కాలిఫోర్నియాలో ఈమెయిల్ బ్యాలెట్ ద్వారా వచ్చిన వేల ఓట్లను పక్కనబెట్టాలని ట్రంప్ యంత్రాంగం చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తిరస్కరించింది. వారంతా అమెరికా పౌరులు కాదన్న వాదనలను తోసిపుచ్చింది.

తెలంగాణ రైతులకు నిరాశ

- రైతు భరోసా డబ్బులు ఫేక్
- డబ్బులు పడ్డాయంటూ రైతులకు మెసేజ్‌లు
- విడుదల చేయలేదన్న వ్యవసాయ శాఖ.. రైతుల్లో గందరగోళం

హైదరాబాద్, నవంబర్ 4, మనం ప్రతినిధి : తెలంగాణలో రైతు భరోసా నిధులు విడుదలైనట్లు వచ్చిన మొబైల్ సందేశాలు రైతులను అయోమయానికి గురిచేశాయి. ఎకరానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున డబ్బులు ఖాతాల్లో జమ అయినట్లు వచ్చిన ఎస్ఎంఎస్‌లు నమ్మి బ్యాంకు ఖాతాలు పరిశీలించిన రైతులకు నిరాశ ఎదురైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. సుమారు 2,73,128 మంది రైతులకు అనధికారిక సందేశాలు వెళ్లినట్లు గుర్తించిన వ్యవసాయ శాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తెలంగాణ ప్రభుత్వం.. రైతుల బ్యాంకు అకౌంట్లలో రైతు భరోసా డబ్బులు జమ అయినట్లు బుధవారం ఉదయం చాలా మంది రైతులకు ఎస్ఎంఎస్లు రావడంతో అయోమయానికి గురయ్యారు. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాలేదని వ్యవసాయ శాఖ స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఈ అనధికారిక మెసేజ్ వ్యవహారంపై అలర్ట్ అయిన వ్యవసాయ శాఖ.. సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైతు భరోసా పథకం కింద ఎకరానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నిధులు జమ అయినట్లు కొంతమంది రైతులకు మెసేజ్‌లు అందాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరుతో సందేశాలు రావడంతో చాలామంది రైతులు వాటిని నిజమని నమ్మారు. వెంటనే తమ బ్యాంకు అకౌంట్లను పరిశీలించగా ఎలాంటి నగదు జమ కాలేదని గుర్తించారు. దీంతో రైతులు ఒకరికొకరు ఫోన్ చేసి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొందరు ఈ మెసేజ్లను వాట్సాప్ గ్రూపుల్లోనూ షేర్ చేశారు. అయితే, ఈ వ్యవహారంపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు.. రైతు భరోసా నిధులు ఇంకా విడుదల కాలేదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్య కారణంగా ఇలాంటి మెసేజ్‌లు వచ్చాయంటూ మొదట వ్యవసాయ శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతులకు ఇలాంటి మెసేజ్లు వెళ్లినట్లు గుర్తించడంతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించారు.

ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపీ.. తెలంగాణ డీజీపీ, సైబర్ క్రైమ్ విభాగం ఉన్నతాధికారులకు లేఖ రాశారు. రైతు భరోసా పథకం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,73,128 మంది రైతులకు అనధికారికంగా ఎస్ఎంఎస్లు పంపినట్లు సీడీఏసీ పోర్టల్ రిపోర్ట్ ద్వారా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అయితే.. ఈ మెసేజ్లను వ్యవసాయ శాఖ పంపించలేదని.. రైతులకు ఇలాంటి మెసేజ్లు పంపేందుకు ఎలాంటి అనుమతి కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. రైతులకు అధికారిక సమాచారాన్ని చేరవేసేందుకు వ్యవసాయ శాఖ సీడీఏసీ ఎస్ఎంఎస్ సర్వీస్ పోర్టల్‌ను వినియోగిస్తోందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపీ వివరించారు. అయినప్పటికీ ప్రస్తుతం రైతులకు అందిన మెసేజ్‌లు వ్యవసాయ శాఖ అధికారిక పోర్టల్ ద్వారా పంపినవి కావని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ పేరును దుర్వినియోగం చేసి ఉండవచ్చని.. ఎస్ఎంఎస్ కమ్యూనికేషన్ వ్యవస్థల్లోకి అనధికారికంగా ప్రవేశించడం, ఇతర ఎస్ఎంఎస్ గేట్వేల ద్వారా మెసేజ్లు పంపించడం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని వ్యవసాయ శాఖ సైబర్ క్రైమ్ పోలీసులను కోరింది. ఈ మెసేజ్లు ఏ గేట్వే నుంచి వచ్చాయి.. వాటిని పంపిన వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీలు ఎవరు.. అనే వివరాలను గుర్తించాలని విజ్ఞప్తి చేసింది. సీడీఏసీ ఎస్ఎంఎస్ సర్వీస్ పోర్టల్తో పాటు ఇతర ఎస్ఎంఎస్ గేట్వేలలో ఏమైనా అనధికారిక ప్రవేశం, దుర్వినియోగం జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేయాలని కోరింది. అలాగే ఈ మెసేజ్ల ప్రసారానికి సంబంధించిన లాగ్లు, సెండర్ ఐడీలు, ఐపీ చిరునామాలు వంటి టెక్నికల్ ఆధారాలను పరిశీలించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి తప్పుడు మెసేజ్ల వల్ల రైతుల్లో గందరగోళం ఏర్పడటమే కాకుండా ప్రభుత్వ పథకాలపై, వ్యవసాయ శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతు భరోసా నిధులు విడుదలైనట్లు వస్తున్న మెసేజ్లను నమ్మవద్దని వ్యవసాయ శాఖ అధికారులు తెలంగాణ రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరిస్తున్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతు భరోసా నిధుల విడుదలపై అధికారిక ప్రకటన వచ్చినప్పుడు మాత్రమే దానిని నమ్మాలని సూచిస్తున్నారు.

సెనేట్లో డెమోక్రాట్లకు ఆధిపత్యం..

- 'మిడ్‌టర్మ్' ఫలితాలపై
- ట్రంప్ కీలక పోస్ట్

వాషింగ్టన్,నవంబర్ 4: అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు ఒక్కొక్కటిగా వెలువడుతున్నాయి. కీలక స్థానాల్లో అధికార రిపబ్లిక్ పార్టీకి గట్టి షాకిస్తూ డెమోక్రాట్లు చరిత్ర సృష్టిస్తున్నారు. ఇప్పటికే పలు సెనెట్ స్థానాలను ట్రంప్ పార్టీ నుంచి లాగేసుకున్నారు. దీంతో ఎగువసభలో డెమోక్రాట్లకు ఆధిపత్యం లభించినట్లయ్యింది. అటు ప్రతినిధుల సభలోనూ డెమోక్రాట్లు ఆధిక్యం సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో తాజా ఫలితాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లో తన పేరు ఉంటే.. ఓడిపోయేవాళ్లం కాదని అన్నారు. తాను పోటీలో ఉండి ఉంటే.. రిపబ్లికన్ పార్టీ అఖండ విజయం సాధించేదంటూ ఆయన ట్రూత్ పోస్ట్లో రాసుకొచ్చారు. అయితే, ఈ ఫలితాలను అంగీకరిస్తున్నానని, డెమోక్రాట్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

అక్కడ 28 ఏళ్ల తర్వాత..

సౌత్ కరోలినాలో రిపబ్లికన్లకు గట్టి దెబ్బ తగిలింది. ఇక్కడ దాదాపు 28 ఏళ్ల తర్వాత సెనెట్ సీటును ఈ పార్టీ కోల్పోయింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో ఈ సెనెట్ స్థానంలో రిపబ్లికన్ అభ్యర్థి, దివంగత నేత లిండ్సే గ్రాహం సోదరి డార్లిన్ గ్రాహం ఓటమిపాలయ్యారు. ఆమెపై డెమోక్రటిక్ అభ్యర్థి అన్నీ ఆండ్రూస్ ఘన విజయం సాధించారు. సౌత్ కరోలినాలో చివరిసారిగా 1998లో డెమోక్రటిక్ నేత సెనెటర్గా ఎన్నికయ్యారు.

టెక్సాస్ సీటు డెమోక్రాట్లదే..

ఇక, టెక్సాస్లో గత 30 ఏళ్లకు పైగా ఉన్న రిపబ్లికన్ల ఆధిపత్యానికి డెమోక్రాట్లు చెక్ పెట్టారు. తాజా ఎన్నికల్లో ఇక్కడి సెనెట్ స్థానం నుంచి డెమోక్రటిక్ అభ్యర్థి జేమ్స్ తలారికో విజయం సాధించారు. చివరిసారిగా 1993లో ఇక్కడ డెమోక్రటిక్ నేత సెనెటర్గా ఎన్నికయ్యారు.

ఒహాయోలోనూ రిపబ్లికన్లకు ఓటమి తప్పలేదు. ఈ పార్టీ సెనెటర్ అభ్యర్థి జాన్ హ్యాస్టెడ్ను డెమోక్రటిక్ నేత షెరాడ్ బ్రౌన్ ఓడించారు.

అటు అయోవాలోనూ రిపబ్లికన్ అభ్యర్థిపై డెమోక్రటిక్ నేత జోష్ టురెక్ గెలుపొందారు. గత మధ్యంతర ఎన్నికల్లో ఈ స్థానం రిపబ్లికన్లకు దక్కింది.

ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎగువసభలో మొత్తం 100 స్థానాలుంటాయి. ఇందులో 34 మంది డెమోక్రాట్లు, 31 మంది రిపబ్లికన్లు ఉన్నారు. మిగతా 35 స్థానాలకు మిడ్‌టర్మ్ పోలింగ్ జరిగింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో అత్యధిక స్థానాల్లో డెమోక్రాట్లు విజయం సాధించడంతో సెనెట్లో ఆధిపత్యం విపక్షాల వశమైంది.



10, 11 తేదీల్లో
రష్యా-ఉక్రెయిన్ శాంతిచర్చలు





కీవ్, నవంబర్ 4 : రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడం కోసం మరో దౌత్య ప్రయత్నానికి అమెరికా సిద్ధమవుతోంది. ఆ రెండు పక్షాల మధ్య తమ మధ్యవర్తిత్వంలో ఈ నెల 10, 11 తేదీల్లో అబుధాబీ వేదికగా శాంతి చర్చలు నిర్వహించనున్నట్లు అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ 'ఎక్స్'లో ప్రకటించారు.కాగా.. ఉక్రెయిన్పై రష్యా మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడింది. సోమవారం రాత్రి ఆ దేశ వ్యాప్తంగా తొమ్మిది ప్రాంతాల్లో 289 డ్రోన్లు, 17 బాలిస్టిక్ క్షిపణులు, 59 క్రూజ్ క్షిపణులతో దాడులు చేసింది. జపోరిజియా ప్రాంతంలోని కొమ్యుషువఖా గ్రామంలో మానవతా సాయం పంపిణీ కేంద్రంపై జరిగిన దాడిలో ఏకంగా 31 మంది మృతిచెందారు. అనేక మంది గాయపడ్డారు. 45 మందికి పైగా జాడ ఇంకా తెలియరాలేదు. మానవతా సాయం కోసం ప్రజలు వరుసలో నిల్చొని ఉండగా ఈ దాడి జరిగింది.

అంతరిక్షం నుంచి ఓటేసిన వ్యోమగామి అనిల్ మేనన్

న్యూయార్క్,నవంబర్ 4: అమెరికాలో మధ్యంతర ఎన్నికల పోలింగ్ జోరుగా సాగుతోంది. భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మేనన్ అంతరిక్షం నుంచే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. భూమికి దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తులో ఐఎస్ఎస్లో ఉన్న ఆయన ప్రత్యేక ఎలక్ట్రానిక్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. అనిల్ మేనన్‌తోపాటు మరో ఇద్దరు అమెరికన్ సిబ్బంది కూడా అంతరిక్షం నుంచే.. మధ్యంతర ఎన్నికల్లో విజయవంతంగా ఓటు వేశారు.



ఈ ఓటింగ్ ప్రక్రియ పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది. అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములకు సురక్షిత ఎలక్ట్రానిక్ బ్యాలెట్లు అందుబాటులో ఉంటాయి. వారు వాటిని స్టేషన్లోని ల్యాప్‌టాప్‌లో నింపి.. నాసాకు చెందిన కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా భూమిపై ఉన్న ఎన్నికల అధికారులకు పంపుతారు. అంతరిక్షం నుంచి కూడా మనం ఓటు హక్కును వినియోగించుకోవచ్చని మేనన్ ఎక్స్లో పోస్ట్ చేసిన వీడియోలో వివరించారు.

1997 నుంచే అందుబాటులో..

అంతరిక్షం నుంచి వ్యోమగాములు ఓటు వేయడం కొత్తేమీ కాదు. ఈ విధానాన్ని 1997 నుంచే నాసా అందుబాటులోకి తెచ్చింది. అదే ఏడాది అంతరిక్ష కేంద్రం నుంచి నాసా వ్యోమగామి డేవిడ్ వోల్ఫ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్పేస్ నుంచి ఓటు వేసిన మొదటి అమెరికన్గా రికార్డు సృష్టించారు.

ట్రంప్ మద్దతిచ్చిన సరితా కోమటిరెడ్డి పరాజయం

న్యూయార్క్,నవంబర్ 4: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ మద్దతుతో న్యూయార్క్ అటార్నీ జనరల్ పదవి కోసం పోటీపడిన తెలుగు సంతతి మహిళ సరితా కోమటిరెడ్డి ఓటమిపాలయ్యారు.



ఆమెపై డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి లెటిటియా జేమ్స్ గెలుపొందారు. ఫలితాలపై సరితా కోమటిరెడ్డి స్పందిస్తూ తన ఓటమిని అంగీకరించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే తాను ఎన్నికల్లో పోటీ చేశానని వ్యక్తిగత లాభం కోసం ఎప్పుడూ ఆలోచించలేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడినప్పటికీ ప్రజా సేవను వదలబోనని.. న్యూయార్క్‌ను మరింత సురక్షితంగా మార్చడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

41 ఏళ్ల సరితకు న్యాయవృత్తిలో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమె కుటుంబం దశాబ్దాల క్రితమే తెలంగాణ నుంచి అమెరికాకు వలస వెళ్లింది. సరిత బ్రూక్లిన్లో జన్మించారు. తర్వాత ఆమె కుటుంబం మిస్సోరికి వెళ్లిపోయింది. ఆమె కొలంబియా లా స్కూల్లో లెక్చరర్గా పనిచేసిన తర్వాత.. ఫెడరల్ ప్రాసిక్యూషన్ విధుల్లోకి వచ్చారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమరవాణా, సైబర్ క్రైమ్, మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసుల్ని వాదించిన అనుభవం ఉంది. డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా కూడా పనిచేశారు.

చరిత్ర సృష్టించిన పియా..
వివేక్ రామస్వామికి ఎదురుదెబ్బ

వర్జీనియా,నవంబర్ 4: అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్నాయి. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం డెమోక్రాట్ల హవానే కనిపిస్తోంది. మరోవైపు అగ్రరాజ్యంలో భారత సంతతి నేతలు సత్తా చాటుతున్నారు. పలు కీలక పదవుల కోసం పోటీపడిన ఈ నాయకులు.. ఇప్పటికే పలుచోట్ల ఖాతా తెరిచారు. డెమోక్రటిక్ పార్టీ తరఫున పోటీ పడిన సుహాస్ సుబ్రహ్మణ్యం, అరుణా మిల్లర్, పియా దాండియా విజయం సాధించగా.. రిపబ్లికన్ పార్టీ తరఫున వివేక్ రామస్వామి ఓటమి చవిచూశారు. వర్జీనియా 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి భారత సంతతికి చెందిన సుహాస్ సుబ్రహ్మణ్యం మరోసారి ఎన్నికయ్యారు. 63 శాతానికిపైగా ఓట్లను సాధించిన ఆయన రిపబ్లికన్ నేత డేవ్ బెక్వెత్‌ను ఓడించారు.



ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ బరిలో నిలిచిన డెమోక్రటిక్ అభ్యర్థి పియా దాండియా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిని ఓడించారు. ఫ్లోరిడా నుంచి అమెరికా దిగువసభకు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్‌గా చరిత్ర సృష్టించారు. డెమోక్రాట్ నేత అరుణా మిల్లర్ మేరీలాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా మరోసారి విజయం సొంతం చేసుకున్నారు. ఒహాయో గవర్నర్‌గా పోటీ చేసిన ట్రంప్ మద్దతుదారు, రిపబ్లికన్ నేత వివేక్ రామస్వామికి చుక్కెదురైంది. ఫిజీషియన్, డెమోక్రాట్ నేత అమీ యాక్టర్ చేతిలో రెండు లక్షల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. డెమోక్రాట్ అభ్యర్థి అమిబెరా కాలిఫోర్నియా 3వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి మరోసారి విజయం సాధించారు. రిపబ్లికన్ అభ్యర్థి రాబ్ టకర్‌ను ఓడించారు. ఇదే రాష్ట్రంలోని 17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ రోఖన్నా మరోమారు విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో రితేశ్ టాండన్, ప్రమీలా జయపాల్, నీరవ్ షేథ్, పూజా సేథి, సందీప్ శ్రీవాస్తవ, అమిష్ షా, నిత్యారామన్ సహా ఇతర నేతల గెలుపోటముల వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

యుద్ధం వద్దు.. అమెరికన్లూ ఇదే చెప్పారు
ఇరాన్ సుప్రీం మొజ్తాబా ఖమేనీ

టెహ్రాన్, నవంబర్ 4: అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి ప్రతికూలంగా వస్తున్న వేళ ఇరాన్ స్పందించింది. ఈ ఫలితాలతో ఇరాన్ పట్ల అమెరికా తీరు మారుతుందని ఊహించవద్దని సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇరాన్పై అమెరికా మరోసారి భీకర దాడులు చేయవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది.



ఇరానీయులు కూడా అమెరికా పట్ల తమ వైఖరిని మునుపెన్నడూ లేనంత స్పష్టంగా అర్థం చేసుకున్నారని మొజ్తాబా పేర్కొన్నారు. అయినప్పటికీ, అమెరికా దాడులకు పాల్పడితే ఇరాన్ ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలను ధ్వంసం చేయడం, హర్మూజ్ జలసంధిలో పట్టుసాధించడం వంటివి అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే చర్యలేనన్నారు.

ఫలితాలను స్వాగతిస్తున్నాం..

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఫలితాలను ఇరాన్ నేతలు స్వాగతించారు. యుద్ధం వద్దు అనే విషయాన్ని అమెరికన్లు చెబుతున్నట్లు అర్థమవుతోందని, ఇదే సందేశాన్ని తాము కూడా సమర్థిస్తున్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు.

మిడ్టర్మ్ ఎన్నికలు.. మస్క్ ఆసక్తికర పోస్ట్

వాషింగ్టన్ ,నవంబర్ 4 : అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. కీలక స్థానాల్లో అధికార రిపబ్లిక్ పార్టీని ఓడిస్తూ.. డెమోక్రాట్లు దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ రిపబ్లికన్లపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'ప్రస్తుతం అంతరిక్షంలోని డేటా సెంటర్లు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. కానీ.. నా అంతరిక్ష లేజర్లు ఈసారి పనిచేయలేదనుకుంటా' అంటూ ఎక్స్లో పోస్ట్ చేశారు. ఎన్నికల్లో రిపబ్లికన్ల కోసం మస్క్ దాదాపు రూ.4వేల కోట్లు అందజేసినట్లు ఇటీవలు పలు నివేదికలు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల్లో డెమోక్రాట్లు ప్రభంజనం సృష్టిస్తుండడాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రశంసించారు.



ప్రజలను విడదీసే రాజకీయాలకు బదులు ఏకం చేసే రాజకీయాలను అమెరికన్లు కోరుకుంటున్నారనడానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఒకప్పుడు డెమోక్రటిక్ పార్టీ గెలవడం కష్టమని భావించిన నియోజకవర్గాలతో సహా.. అనేక ప్రాంతాల్లో విజయం సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ట్రంప్ ప్రభుత్వానికి మరో రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ.. డెమోక్రాట్లు రంగంలోకి దిగాల్సిన సమయం వచ్చిందన్నారు. అధికారం ఉన్న ప్రతిచోటా మార్పులు తీసుకురావడానికి, దేశానికి మరింత నష్టం జరగకుండా నివారించడానికి పని చేయాలని డెమోక్రటిక్ నేతలకు పిలుపునిచ్చారు.

ఆదర్శ గ్రామంగా లింగంపల్లి కుర్దు

లింగంపల్లి కుర్దును జిల్లాలో మూడో ప్లాస్టిక్ రహిత గ్రామంగా అభివృద్ధి చేయాలి.

నీటి సంరక్షణ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం.

ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.



కామారెడ్డి, నవంబర్ 4 (మనం బ్యూరో): ప్రజల భాగస్వామ్యంతో లింగంపల్లి కుర్దు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణంతో పాటు నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశమున్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. బుధవారం లింగంపేట మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, నీటి సంరక్షణ నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు, వ్యవసాయ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామస్థులు, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు.

మూడో ప్లాస్టిక్ రహిత గ్రామంగా అభివృద్ధి...

జిల్లాలో ఇప్పటికే తడకల్ గ్రామంలోని ఎండ్లియాల్, దోమకొండ మండలంలోని గోటిముక్కల గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యక్రమాలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. తాజాగా లింగంపల్లి కుర్దును జిల్లాలో మూడో ప్లాస్టిక్ రహిత గ్రామంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వాటి ద్వారా పర్యావరణహిత ఇటుకల తయారీ, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను అభినందించారు.

ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించాలి.

గ్రామంలో పైకప్పులపై పడే వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తతో పాటు నాలుగు రకాల వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానం, మురుగునీటి కాలువలు, సామూహిక ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరుద్ధరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకించేలా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. లింగంపల్లి కుర్దులో 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతుతో ఇంకుడు గుంత నిర్మించేందుకు సుమారు రూ.6,500 ఖర్చవుతుందని వివరించారు. భూగర్భ జలాల పెంపునకు ఈ నిర్మాణాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ఆరుతడి పంటల సాగుతోనే మేలు.

రానున్న రబీ సీజన్లో వరి సాగుపైనే ఆధారపడకుండా జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. కూరగాయల సాగు, ఆయిల్పామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బిందు సేదతితో తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు, ఆదాయం పొందవచ్చన్నారు. జిల్లాలో జొన్నల సాగుకు అవసరమైన విత్తనాల పరిమితిని 8 క్వింటాళ్లకు పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ను ఆదేశించారు.

విద్యార్థుల ప్రదర్శనలకు ప్రశంసలు.

ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఆవశ్యకతపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యరూపకాలు, పాటలను కలెక్టర్ తిలకించారు. చిన్న వయస్సు నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు సైతం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్పించాలని సూచించారు.

చెరువు కట్టపై పచ్చదనం.. సౌర విద్యుత్కు ప్రణాళిక.

అనంతరం గ్రామ చెరువుకట్టను సందర్శించి అక్కడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను గ్రామస్థులు తీసుకోవాలన్నారు. చెరువుకట్ట ఆవరణలో సౌర విద్యుత్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి, సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొక్క నాటి, సౌర విద్యుత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉపాధి హామీ పనుల్లో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణను సమర్థంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, యువత, విద్యార్థులు, అధికారులు సమష్టిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, సర్పంచ్ ప్రత్యూష సాయిరాం, ఉపసర్పంచ్ కుమ్మరి సంతోష్ కుమార్, తహసీల్దార్, ఎంపీడీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్ట పోయిన రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి

మంత్రి ఉత్తమ్ క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపరిహారం అంచనా వేయాలి



హుజూర్ నగర్, నవంబర్ 4 (మనం న్యూస్): ఇటీవల కురిసిన వర్షాలు పెను తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని అంతేకాకుండా స్థానిక శాసనసభ్యుడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి మండవ వెంకటేశ్వర్లు గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హుజూర్నగర్ నియోజకవర్గం పరిధిలో హర్నబ్, మురుసు తుఫాన్ల ప్రభావం వల్ల నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతాంగం తీవ్ర నష్టం వాటిలిందని

పంట చేతికొచ్చే సమయంలో వరస తుఫానుల ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరి పంట నేలకొరిగి, నీటిలో బురదలో కూరుకుపోయిందని, ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే దెబ్బతినడంతో రైతన్నలు గోసపడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయించి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలోఎల్ హెచ్ పి ఎస్ జాతీయ నాయకులు బానోతు వెంకటరాం నాయక్ హుజూర్ నగర్ పట్టణ పార్టీ అధ్యక్షులు కొమ్మగాని వెంకటేశ్వర్లు గౌడ్ లు మాట్లాడుతూ హుజూర్నగర్ నియోజకవర్గాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి, రైతులకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు పంట బీమా, తదితర ప్రభుత్వ పథకాల ద్వారా న్యాయం చేయాలని కోరారు. రైతన్న కన్నీరు తుడవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రైతులు అప్పులపాలై ఆత్మస్థైర్యం కోల్పోకముందే ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి పంట నష్టపరిహారం అందించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మఠంపల్లి మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు నాయక్ హుజూర్ నగర్ పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కుల కిరణ్ యాదవ్, గరిడేపల్లి బీసీ సెల్ మండల పార్టీ అధ్యక్షులు బత్తిని జానకిరాముల గౌడ్ టిఎన్టియుసి నాయకులు ఎం వెంకటరాజు , రవి నాయక్, రైతులు ములకలపల్లి సీతారాములు, ములకలపల్లి వెంకటేశ్వర్లు, ములకలపల్లి చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా జనగామ చౌరస్తా



జనగామ, నవంబర్ 4(మనంన్యూస్): యాసారపు కరుణాకర్ జనగామ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్, సూర్యాపేట, మెదక్, సిద్దిపేట, వరంగల్ తదితర జిల్లాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న జనగామ జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తా రాజకీయ నాయకుల ఫ్లెక్సీల కారణంగా ప్రమాదాలకు నిలయంగా మారిందని, సంబంధిత అధికారులు చోద్యం చూస్తూ కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు వెంటనే ఫ్లెక్సీలను తొలగించాలని, అనుమతి లేకుండా పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఫైన్ విధించాలని తెలిపారు. చౌరస్తాలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా కానీ, దానికి అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందని పేర్కొన్నారు.

ప్రవళిక కుటుంబాన్ని ఆదుకోవాలి



మణుగూరు, నవంబర్ 4(మనంన్యూస్): గత కొన్ని రోజుల క్రితం మణుగూరు డిపోకు చెందిన ఉద్యోగిని ప్రవళిక అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం పరకాల డిపో గేటు ముందు అన్ని యూనియన్ల నాయకులు మరియు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ నాయకులు సంయుక్తంగా సంతాప కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన నాయకులు సుధాకర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి మహిళలందరికీ స్మార్ట్ కార్డు ఇవ్వాలని, జరిగిన సంఘటనపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ సెక్రటరీ ఈ.ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ యాజమాన్యం వైఖరిలో మార్పు రావాలని, బస్సుల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజల్లో చైతన్యం రావాలని, మేనేజ్మెంట్ తన పద్ధతులను మార్చుకోవాలని, ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, వారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ డిపో ప్రెసిడెంట్ లొ డియా. గోవర్ధన్ నాయక్ మరియు ఎంప్లాయిస్ నాయకులు మంద శ్రీనివాస్, ఆ.ృ. స్వామి,్యాక్షజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆహ శ్రీను, డిపో ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ రఘువీర్ గార్లు , ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ నాయకులు, ఇతర యూనియన్ నాయకులు మరియు మహిళా కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ

- **ఇంకుడు గుంతలు టాయిలెట్లు కిచెన్ గది పరిశీలన**
- **7వ తరగతి విద్యార్థులతో మాట్లాడి చదువుపై ఆరా**



సూర్యాపేట, నవంబర్ 04 (మనం ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యాబోధన ప్రమాణాలు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. శనివారం ఆకుపాముల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన ఆయన ఇంకుడు గుంతలు, టాయిలెట్లు, వంటగదిని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తూ చదువు, విద్యా ప్రమాణాలు, పరీక్షల సన్నద్ధత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వంటగదిని కూడా సందర్శించి మధ్యాహ్న భోజనం తయారీ, నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలు, అవసరమైన సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని పాఠశాలల్లో తనిఖీలో భాగంగా ఫైనల్ ఇన్స్ట్రక్షన్ బృందంతో కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, లెర్నింగ్ అవుట్కమ్స్ ఆధారంగా పాఠాలు బోధిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించాలని సూచించారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం, లెసన్ ప్లాన్లు, ఇయర్ ప్లాన్లు, టీచింగ్ డైరీల నిర్వహణను తనిఖీ చేయాలని తెలిపారు. వర్క్షీట్ల ద్వారా విద్యార్థులకు నిరంతరం అభ్యాసం కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో నిత్యం మమేకమవుతూ సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలలో స్టాఫ్ రూమ్ పైకప్పు శిథిలావస్థకు చేరి స్లాబ్ దెబ్బతిన్న విషయాన్ని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ఇప్పటికే ఎంపీడీఓకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

అఖిలభారత కిసాన్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు

తిరుమలగిరి, నవంబర్ 04 (మనం న్యూస్): ఈ నెల 15 నుండి 18 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికిన పోరాటాల గడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంలో అఖిల భారత కిసాన్ (ఎఐకెఎస్)36 వ జాతీయ మహాసభలు జరుగుతున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యాదగిరి రావు పిలుపు ఇచ్చారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలో 36వ మహాసభల సూచికగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 సంవత్సరాల క్రితం నాటి బ్రిటి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వలసవాదానికి వ్యతిరేకంగా ఏర్పడినటువంటి కిసాన్ సభ నాటునుండి తెలంగాణ సాయుధ రహితంగా పోరాటం ఉన్నప్పుడు వాయిలకు పోరాటం వర్లీ ఆదివాసుల తిరుగుబాటుకు నాయకత్వం నుంచి నాటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ దేశంలో రైతు పోరాటాల్లో ఎఐకెఎస్ అగ్ర భాగాన నిలిచిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలని వెనుక కొట్టడంలో అగ్ర భాగాన నిలబడిందని,



నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకంగా అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం ఈ దేశ రైతులకు గొడ్డలి పెట్టు లాంటిదని, విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న పత్తి నూనెలకు దిగుమతి సుంకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఈ మహాసభలలో దేశంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభల సందర్భంగా ఈ నెల 15వ తేదీ నల్లగొండలో లక్షలాదిమందితో జరుగు బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, మండల కార్యదర్శి కడారి లింగయ్య, మాజీ మండల అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య,చేను శ్రీను,మండల నాయకులు కడౌ లింగయ్య, చిత్తలూరు సోమయ్య, వనం సోమయ్య, మిట్టపల్లి లక్ష్మి, ప్రజానాట్యమండలి నాయకులు బూరుగుల ప్రభాకర్, దూపటి లింగయ్య, పులిమామిడి సోమయ్య, అంజి, నగేష్ పాముగంటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులకు విలువేది.. ఫ్లెక్సీలకు అడ్డేది?

- **జనగామ ప్రధాన చౌరస్తాలో నిబంధనలు బేఖాతర్!**
- **ఫ్లెక్సీలతో కనుమరుగైన అందాలు**
- **ఫ్లెక్సీల ఏర్పాటు.. వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్న పరిస్థితి**
- **నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలేవి?**

జనగామ, నవంబర్ 4 (మనం ప్రతినిధి): ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి నూతన జిల్లాలు ఏర్పాటు చేసే సమయంలో జనగామ జిల్లా కూడా ఏర్పాటు చేయాలని అన్ని వర్గాల ప్రజలు సకల జనుల సమ్మెలో పాల్గొని పోరాటం చేసి సాధించుకున్న జనగామ జిల్లాను నూతన సుందరీకరణ పనులు చేసి ఉన్న వాటిని కనుమరుగ అవుతుంటే సంబంధిత పట్టణ అధికారులు చోద్యం చూస్తున్నారని పట్టణ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

జనగామ పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు అలంకారప్రాయంగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించినప్పటికీ ఆచరణలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. వివిధ రాజకీయ నాయకుల జన్మదినాలు, వివిధ ఇతర వేడుకల పేరుతో చౌరస్తా పరిసరాల్లో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ప్రజా స్థలాలను ప్రచార వేదికలుగా మార్చేస్తున్నారు.

చౌరస్తాలో ఏర్పాటు చేసిన వాటర్ లోటస్ ఫౌంటెన్తో పాటు, సుందరీకరణ పనులు ప్రజలకు కనువిందు చేయాల్సి ఉండగా, ఫ్లెక్సీల కారణంగా వాటి అందాలు కనిపించకుండా పోతున్నాయి. పట్టణ సుందరీకరణ కోసం ప్రజాధనం వెచ్చించి చేసిన పనులు ఇలా ప్రచార ఫ్లెక్సీల మాటున మరుగునపడటం ఎంతవరకు సమంజసమని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఫ్లెక్సీలతో ప్రమాదాలకు ఆస్కారం!

చౌరస్తా చుట్టూ ఏర్పాటు చేస్తున్న భారీ ఫ్లెక్సీలు వాహనదారులకు కొత్త సమస్యగా మారుతున్నాయి. ముఖ్యంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వల్ల పక్క రహదారుల నుంచి అకస్మాత్తుగా వచ్చే వాహనాలు ముందుగా కనిపించడం లేదని వాహనదారులు ఆందోళన





హెచ్చరికలకే పరిమితమా.. చర్యలు ఎప్పుడు?

వ్యక్తం చేస్తున్నారు. రద్దీ సమయంలో బస్సులు, ఇతర వాహనాలు ఒక్కసారిగా ఎదురుగా వచ్చినప్పుడు ఫ్లెక్సీల కారణంగా వాటిని గుర్తించడం ఆలస్యమై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చౌరస్తా పరిసరాల్లో ఫ్లెక్సీల ఏర్పాటుపై అధికారులు నియంత్రణ విధించాలని కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాల్సిన మున్సిపల్ శాఖ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడమే కాకుండా వాటిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జనగామ ప్రధాన చౌరస్తా సుందరీకరణను కాపాడటంతో పాటు, వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక హెచ్చరిక బోర్డులు కేవలం చూపులకే పరిమితం అవుతాయా? అన్నది వేచి చూడాలి.

ఎస్డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు.. అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఆరు బఫర్ గోదాంల హమాలీలకు లేబర్ కార్డులు ఇప్పిస్తాం



కోదాడ,నవంబర్ 04 (మనం న్యూస్): గోదాంలలో బియ్యం నిల్వ, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్డబ్ల్యూసీ గోదాంను జిల్లా కలెక్టర్, ఎస్పీ కె నరసింహ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలోని బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

హమాలీలకు లేబర్ కార్డులు

అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని వారు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తాసిల్దార్ సంతోష్ కిరణ్, ఎస్డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ విగ్రహ ధ్వంసంపై కాంగ్రెస్ ఆగ్రహం

- **నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు**
- **పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**

కామారెడ్డి, నవంబర్ 4 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద ఏర్పాటు చేసిన మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేయడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. విగ్రహ ధ్వంసం ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలిపారు. దేశ ప్రధానిగా సేవలందించిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా సమాజంలో అశాంతికి కారణమవుతాయని అన్నారు.



విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విగ్రహాల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి పట్టణ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఘటనపై న్యాయం జరిగే వరకు పోరాడుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కౌన్సిలర్లు షేరు, జావిద్, ఇప్ప శ్రీనివాస్, లడ్డు, సిద్ధిక్, అజ్మత్, ఖదీర్, విజయ్, చాట్ల రాజేశ్వర్, కాళ్ల గణేష్, సిరాజ్, లక్కపతిని గంగాధర్, రామ్మోహన్, సంతోష్, సుధాకర్రెడ్డి, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎం రైస్ మిల్ నుంచి ప్రభుత్వానికి చెల్లించాల్సిన 68 ఎస్కేల ధాన్యం బకాయి!



- అభయాంజనేయ రైస్ మిల్ గోడౌన్లో ధాన్యం నిల్వ
- రికవరీ చేసుకోవాలని యజమాని మురళీధర్ విజ్ఞప్తి
- జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ప్రభుత్వ ధాన్యం బకాయిలపై చర్యలు తీసుకోవాలని వేడుకోలు

సిరిసిల్ల, నవంబర్ 04 (మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో వృద్ధ దంపతులకు సంబంధించిన సీబీఎం రైస్ మిల్ వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. సీబీఎం రైస్ మిల్కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన 68 ఎస్కేల ధాన్యం బకాయి ఉందని, ఆ ధాన్యాన్ని శ్రీ అభయాంజనేయ రైస్ మిల్ గోడౌన్లో నిల్వ చేసినట్లు సీబీఎం ఇండస్ట్రీ యజమాని చీకోటి మురళీధర్ వెల్లడించారు. గోడౌన్లో ఉన్న ధాన్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ బకాయిలను రికవరీ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గోడౌన్లో ధాన్యం.. రికవరీ చేసుకోవాలని విజ్ఞప్తి!.

సీబీఎం రైస్ మిల్కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన 68 ఎస్కేల ధాన్యాన్ని తాను చెల్లించలేని పరిస్థితిలో ఉన్నానని, అందువల్ల శ్రీ అభయాంజనేయ రైస్ మిల్ గోడౌన్లో నిల్వ చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బకాయిల కింద జమ చేసుకోవాలని చీకోటి మురళీధర్ కోరుతున్నారు. గోడౌన్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రికవరీ చేయాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల జీవితాల్లో నిత్య స్ఫూర్తి ఉపాధ్యాయులే

- విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి.. పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలి
- చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించాలి
- మారుమూల విద్యార్థులను అగ్రభాగాన నిలిపిన ఘనత ఉపాధ్యాయులదే
- విద్యతోపాటు అన్ని రంగాల్లో ములుగును ముందుంచేలా కృషి చేయాలి
- విద్యా ఫలితాలలో ములుగు జిల్లా మరోసారి ప్రభంజనం సృష్టించాలి
- అదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు పని చేయాలి: మంత్రి సీతక్క



ములుగు, నవంబర్ 4(మనం ప్రతినిధి): విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులు నిత్య స్ఫూర్తిగా నిలుస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, పోటీ ప్రపంచంలో రాణించేలా సిద్ధం చేయాలని కోరారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పాఠశాల విద్యాశాఖ- ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్షలు-2027 విద్యార్థుల సంసిద్ధతపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ములుగు జిల్లా ఉత్తమ స్థానాలు సాధించిందని తెలిపారు. గిరిజన ప్రాంతం విద్యలో వెనుకబడి ఉంటుందనే భావనను మార్చి, జిల్లా విద్యార్థుల ప్రతిభను రాష్ట్రానికి చాటిచెప్పారని ప్రశంసించారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తీసుకున్న ప్రత్యేక చర్యలు మెరుగైన ఫలితాలకు దోహదపడ్డాయని అన్నారు. ఉపాధ్యాయుల కృషిని ఎప్పటికీ మర్చిపోమని, వారి కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఒక ఉపాధ్యాయుడి జీవితంలో వేలాది మంది విద్యార్థులు ఉంటారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు వెచ్చించే సమయం, శ్రమ వారి విజయాల్లో ప్రతిబింబిస్తాయని అన్నారు. విద్యార్థులకు ఇష్టమైన ఉపాధ్యాయులుగా మెలుగుతూ, ఆయా సబ్జెక్టులపై ఆసక్తిని పెంచాలని సూచించారు. మారుమూల ప్రాంతాల నుంచి ఎదిగినవారు తమలాంటి మరెన్నో తరాలు ముందుకు వచ్చేలా కృషి చేయాలని, సొంత ప్రాంతానికి సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు తగిన ప్రేరణ అందించాలని సూచించారు. సిలబస్ను పూర్తి చేసి, పునశ్చరణ, సాధన పరీక్షల ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించాలని తెలిపారు. ఏయే అంశాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో గుర్తించి, ప్రత్యేక సమయం కేటాయించి బోధించాలని సూచించారు. వసతిగృహాల్లోని విద్యార్థులపైనా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న తరుణంలో చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలని కోరారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల విద్యార్థుల్లో బిడియాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని సూచించారు.

ములుగు జిల్లా విద్యతోపాటు రహదారులు, పర్యాటకం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో సమృద్ధిగా ఉన్న అటవీ సంపద, సహజ వనరులు, సాంస్కృతిక వైభవాన్ని అభివృద్ధికి వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తమ పరిజ్ఞానం, అనుభవం, పరిశీలనల ఆధారంగా విద్యాభివృద్ధితోపాటు జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లా విద్యా ఫలితాల్లో వరుస విజయాలు సాధించడం ఉపాధ్యాయుల అంకితభావం, కృషికి నిదర్శనమని అభినందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఒకే మార్గదర్శకాలు అందినా, వాటిని సమర్థంగా అమలు చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలిపిన ఘనత ఉపాధ్యాయులదేనని అన్నారు. వరుస విజయాలు కష్టానికి ప్రతిఫలమేనని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహం, ఆత్మవిశ్వాసంతో పనిచేసి మరోసారి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను కోరారు.

ఉపాధ్యాయులు అందించే చిన్న ప్రోత్సాహం కూడా విద్యార్థి జీవితంలో గొప్ప మార్పుకు దారితీస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం చదువులో వెనుకబడిన విద్యార్థులు భవిష్యత్తులో విశేషంగా రాణించవచ్చని, వారిలో నమ్మకాన్ని పెంచి ముందుకు నడిపించాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులు అందించే సహాయాన్ని విద్యార్థులు జీవితాంతం గుర్తుంచుకుంటారని, తాను ఈ స్థాయికి చేరుకోవడంలోనూ తన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉందని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థిని ఆదరణతో ప్రోత్సహిస్తూ, ముఖ్యంగా చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మరింత అండగా నిలవాలని కోరారు.

అంతకుముందు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, డిసెంబర్ నాటికి సిలబస్ను పూర్తి చేసి, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని మంత్రికి వివరించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అందిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు, జిల్లాను మరోసారి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపి రికార్డు సృష్టించేలా కృషి చేస్తున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్, జీసీడీఓ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని మృతి

న్యాయం చేయాలని తల్లిదండ్రులు, గ్రామస్తుల డిమాండ్



వర్ధన్నపేట, నవంబర్4(మనం న్యూస్): వర్ధన్నపేట మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో ఓ విద్యార్థి ఉరివేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రుక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన ఆరే మల్లేశం కుమారుడు రామ్ చరణ్ (15) వర్ధన్నపేట మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో ఉంటూ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసిస్తున్నాడు. కాగా ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి రామ్ చరణ్ గత కొన్ని రోజులుగా పాఠశాలకు హాజరు కావడం లేదు దాంతో ఉపాధ్యాయుడు మందలించినట్లుగా సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన రామ్ చరణ్ బీసీ వసతి గృహానికి చేరుకొని స్లాబ్ కుక్కేంకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం వసతి గృహ సిబ్బంది గమనించి వార్డెన్ నర్సింలుకు సమాచారం అందించారు. ఈ క్రమంలో వార్డెన్ గౌరారం పోలీసులకు సమాచారం చేరవేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని రామ్ చరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. కాగా గజ్వేల్ చేరుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఆయా విద్యార్థి సంఘ నేతలు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు గజ్వేల్ తో పాటు వర్ధన్నపేట బీసీ వసతి గృహం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుంది

శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలి: మంత్రి దనసరి సీతక్క





ములుగు, నవంబర్ 4, మనం ప్రతినిధి: యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని అభ్యర్థులకు సూచించారు. బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంత్రి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో నేరుగా మాట్లాడి, వారి చదువు, శిక్షణా విధానం, వసతి సౌకర్యాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభ్యర్థులు లక్ష్యంపై దృష్టి సారించి, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి, తదుపరి దశల్లోనూ ప్రతిభ కనబరిచి పోలీస్ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. అభ్యర్థుల విజయానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి శిక్షణార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎస్పీ రవీందర్, ఆర్ఐ, సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండ

కన్నాయిగూడెం, నవంబరు 4(మనం న్యూస్): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబ పెద్దకు నివాళులర్పిస్తూ, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా నిలిచారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి గట్టయ్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం నిర్వహించిన ఆయన పెద్దకర్మ కార్యక్రమానికి కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పెద్దకర్మ కార్యక్రమానికి అవసరమైన 25 కిలోల బియ్యంతో పాటు కూరగాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఎలాంటి కష్టసమయాల్లోనైనా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాటి రాజబాబు, వార్డు సభ్యులు, గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్ సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- మంత్రి సీతక్కను కలిసి అభివృద్ధి పనులపై వినతి పత్రం అందించిన కాంగ్రెస్ నాయకులు



కన్నాయిగూడెం, నవంబరు 4 (మనం న్యూస్): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ గ్రామంలో కొలువైన శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతరను మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్కను కోరారు. జాతర ప్రాంగణంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం (నవంబరు 4) మంత్రి సీతక్కను కాంగ్రెస్ నాయకులు కలిసి ఐలాపూర్ సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు, ములుగు జిల్లా నాయకుడు ఎండీ అప్సర్ పాషా సమక్షంలో ఈ భేటీ జరిగింది. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని నాయకులు కోరారు. జాతర ప్రాంగణ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై మంత్రికి వివరించి, అభివృద్ధి పనులు చేపట్టేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా జాతరకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీర్ల సురేష్, జిల్లా నాయకులు ఇరుప సునీల్ దొర, వీరుల భాస్కర్, గ్రామ కాంగ్రెస్ నాయకులు ధర్మసూత్ బాలు, తడవ్న మల్లేష్, సావిత్రి, పూజారుల సంఘం అధ్యక్షుడు మల్లెల రవి, మాజీ ఉపసర్పంచ్ కురుస్తున్న వినోద్, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగడిపై పోలీసుల మెరుపుదాడి.. సరిహద్దులో కోడిపందాల కలకలం!

వాట్సాప్ గ్రూపుల ద్వారా పందాల నిర్వహణ.. రూ.20 లక్షలకు పైగా నగదు స్వాధీనం

తెలంగాణ నుంచి భారీగా తరలివెళ్తున్న పందెంరాయుళ్లు.. 156 మందిపై కేసులు



కన్నాయిగూడెం, నవంబరు 3 (మనం న్యూస్): తెలంగాణ-ఛత్తీస్గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో కోడిపందాల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. అంగడి పేరుతో కోడిపుంజుల మార్కెట్ నిర్వహిస్తూ, దాని ముసుగులో లక్షల రూపాయల అక్రమ జూదం సాగిస్తున్నట్లు గుర్తించిన ఛత్తీస్గఢ్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 156 మందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ మొత్తంలో నగదు, వాహనాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ జిల్లా భద్రకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయగూడ అటవీ గ్రామంలో అక్రమ జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారంతో అదనపు ఎస్పీ రాహుల్ బన్సల్ నేతృత్వంలో, జిల్లా ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా మార్గదర్శకత్వంలో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అటవీ ప్రాంతాన్ని దిగ్బంధించి నిర్వహించిన దాడుల్లో 156 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.20,01,200 నగదు, 47 నాలుగు చక్రాల వాహనాలు, 12 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వాట్సాప్ గ్రూపుల ద్వారా పందాల నిర్వహణ

కోడిపందాల నిర్వాహకులు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని పందాలు జరిగే ప్రాంతాలు, సమయాలు, ఇతర వివరాలను సభ్యులకు చేరవేస్తున్నట్లు సమాచారం. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు వారానికి రెండు రోజులపాటు సరిహద్దు ప్రాంతాలకు చేరుకొని పందాల్లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. ఒక్కో వారం రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు పందెం సొమ్ము చేతులు మారుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

గోదావరి దాటి సరిహద్దుకు ప్రయాణం

ములుగు జిల్లా కన్నాయిగూడెం, వాజేడు, నూగూరు వెంకటాపురం మండలాలతో పాటు భద్రాచలం, మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, బెల్లంపల్లి, చెన్నూరు ప్రాంతాల నుంచి పలువురు ఈ పందాలకు వెళ్తున్నట్లు సమాచారం. కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం, దేవాదుల, తుపాకులగూడెం, గూర్రేవుల, రాజన్నపేట, ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, ఏటూరు, సింగారం గ్రామాలకు చెందిన కొందరు కూడా పాల్గొంటున్నట్లు ప్రచారం సాగుతోంది. సమ్మక్క బ్యారేజీ మీదుగా, మరికొందరు నాటు పడవల సహాయంతో గోదావరి నదిని దాటి ఛత్తీస్గఢ్ ప్రాంతాలకు చేరుకుంటున్నట్లు స్థానిక సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసులు మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కుటుంబ సభ్యుల్లో ఆందోళన

పోలీసుల దాడుల అనంతరం తమ కుటుంబ సభ్యుల ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో పలువురు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిలో తెలంగాణకు చెందిన వారు ఎంతమంది ఉన్నారనే వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

కేసు నమోదు.. భారీగా స్వాధీనం

భద్రకాళి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 06/2026 కింద కేసు నమోదు చేసి ఛత్తీస్గఢ్ జూద నిషేధ చట్టంలోని సెక్షన్ 3(2), పబ్లిక్ జూదం చట్టంలోని సెక్షన్లు 4, 13 కింద చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

మహిళల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం

- పోక్సో చట్టంపై బుస్సాపూర్లో పోలీసుల అవగాహన సదస్సు



గోవిందరావు పేట, నవంబర్ 4 మనం ప్రతినిధి: పసర బుస్సాపూర్ మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారిపై జరిగే నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని పోలీసులు స్పష్టం చేశారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా, ఈవ్ టీజింగ్ చేసినా, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు, ములుగు జిల్లా ఎస్పీ కేకేన్ సుధీర్ రామనాథన్ ఐపీఎస్ ఆదేశాలతో, ములుగు డీఎస్పీ రవీందర్ సూచనల మేరకు, పస్రా సీఐ దయాకర్ పర్యవేక్షణలో ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో బుస్సాపూర్ గ్రామంలో మహిళలు, గ్రామస్తులకు. ప్రజలకు పోక్సో చట్టం, మహిళల భద్రత, బాలికల రక్షణపై ప్రత్యేక అవగాహన, చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులు మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తన, వెంటపడటం, ఈవ్ టీజింగ్, బెదిరింపులు వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు బాలబాలికలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం-2012 ప్రకారం నేర తీవ్రతను బట్టి కఠిన శిక్షలు విధించబడతాయని వివరించారు.

ఆకతాయిలకు చట్టం హెచ్చరిక..

మహిళలను ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వెంటపడటం, ఫోన్ కాల్స్ లేదా సోషల్ మీడియా ద్వారా వేధించడం, అనుమతి లేకుండా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు పంచుకోవడం వంటి చర్యలు నేరాల పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై భారతీయ న్యాయ సంహిత (ఆూఖి), పోక్సో చట్టం తదితర సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమకు ఎదురయ్యే వేధింపులపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు, మహిళల సహాయం కోసం 181కు, బాలల రక్షణ కోసం 1098 హెల్ప్లైన్కు సంప్రదించవచ్చని వివరించారు.

మహిళల రక్షణకు షీ టీమ్స్ ప్రత్యేక నిఘా..

మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని, మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొనే వేధింపులపై ఫిర్యాదులు స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మహిళల భద్రత, బాలల హక్కులు, చట్టాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. మహిళల గౌరవం, బాలికల భద్రత కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణతో పాటు మహిళలు, బాలల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐదేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ ఫైనల్స్‌కు సింధు

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే జపాన్, హైలో ఓపెన్ టైటిళ్లు గెలిచి, ఫ్రెంచ్ ఓపెన్ లో రన్నరప్ గా నిలిచిన ఆమె.. ఐదేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ వరల్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ మెగా టోర్నీ చైనాలోని హాంగ్జౌ వేదికగా డిసెంబర్ 9 నుంచి 13 వరకు జరుగనుంది.

2022లో కూడా సింధు బీడబ్ల్యూఎఫ్ వరల్ టూర్ ఫైనల్స్ కు అర్హత సాధించినప్పటికీ, గాయం కారణంగా చివరి నిమిషంలో తప్పుకుంది. దీంతో 2021 తర్వాత మళ్లీ ఈ టోర్నీలో ఆడే అవకాశం దక్కింది. 2021లో జరిగిన ఫైనల్లో సింధు.. దక్షిణ కొరియా షట్లర్ అన్ సె యంగ్ చేతిలో ఓడిపోయి రన్నరప్గా నిలిచింది.

వరల్ టూర్ ఫైనల్స్ లో సింధు గత ప్రదర్శన

సింధు 2018లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్ టూర్ ఫైనల్స్ టైటిల్ ను గెలుచుకుంది. ఆతర్వాత 2019, 2020లో గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. తిరిగి 2021లో ఫైనల్ కు చేరినా అన్ సె యంగ్ చేతిలో ఓడిపోయింది. 2022లో అర్హత సాధించినప్పటికీ ఎడమ చీలమండ గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగింది.

తొలి వన్డేలో కివీస్‌ను చిత్తు చేసిన టీమిండియా

కోహ్లి మెరుపులు..

న్యూజిలాండ్ తో వన్డే సిరీస్ ను టీమిండియా ఘనంగా ఆరంభించింది. ఆక్లాండ్ వేదికగా బుధవారం జరిగిన తొలి వన్డేలో కివీస్ పై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా ఐదు మ్యాచ్ ల సిరీస్ లో 1-0తో ముందంజ వేసింది.

185 పరుగులకే ఆలౌట్

ఈడెన్ పార్క్ మైదానంలో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్ కు దిగిన కివీస్ బ్యాటర్లకు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. దీంతో 40.2 ఓవర్లలో కేవలం 185 పరుగులే చేసి న్యూజిలాండ్ ఆలౌట్ అయింది.

ఓపెనర్ టిమ్ సీఫర్ట్ 38 పరుగులతో కివీస్ ఇన్నింగ్స్ లో టాప్ రన్ స్కోరర్గా నిలిచాడు. మిగిలిన వారిలో డారిల్ మిచెల్ 28, గ్లెన్ ఫిలిప్స్ 30 పరుగులతో ఫర్వాలేదనిపించారు. ఆఖర్లో బ్లేయిర్ టిక్నర్ 23 బంతుల్లోనే 34 పరుగులు సాధించడంతో కివీస్ కనీసం 150 పరుగుల మార్కు దాటగలిగింది.

చెలరేగిన భారత పేసర్లు

ఇక విల్ యంగ్ (9), హెన్రీ నికోల్స్ (9), టామ్ లాథమ్ (3), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (4), నాథన్ స్మిత్ (1), కైలీ జెమీషన్ (1) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కాగా.. జేకబ్ డఫీ 15 పరుగులతో అజేయంగా నిలిచాడు. టీమిండియా బౌలర్లలో పేసర్లు అర్షీప్ సింగ్ నాలుగు, గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లతో చెలరేగగా.. అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లతో మెరిశాడు.

ఈ క్రమంలో నామమాత్రపు లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కు వర్షం పదే పదే అంతరాయం కలిగించింది. దీంతో పలుమార్లు టార్గెట్ ను రివైజ్ చేసిన తర్వాత ఆఖరికి.. డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా నిర్దేశించారు.

కోహ్లి మెరుపు అర్ధ శతకం



ఇక లక్ష్య ఛేదనలో దిగ్గజ ఓపెనర్ రోహిత్ శర్మ డకౌట్ కాగా.. మరో ఓపెనర్, కెప్టెన్ శుబ్ మన్ గిల్ 56 బంతుల్లో 37 పరుగులు చేశాడు. ఇక వన్డౌన్ బ్యాటర్, లెజెండరీ విరాట్ కోహ్లి 35 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకుని సత్తా చాటాడు. వన్డేలో 'కింగ్'కు ఇది 80వ హాఫ్ సెంచరీ కావడం విశేషం.

ఆ తర్వాత కూడా జోరు కొనసాగించిన కోహ్లి.. మొత్తంగా 51 బంతులు ఎదుర్కొని 13 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 74 పరుగులు చేశాడు. అయితే, డఫీ బౌలింగ్ లో షాట్ కు యత్నించిన కోహ్లి.. టిమ్ సీఫర్ట్ కు క్యాచ్ ఇవ్వడంతో మూడో వికెట్ గా వెనుదిరిగాడు.

కోహ్లి స్థానంలో వచ్చిన అక్షర్ పటేల్ డకౌట్ కాగా.. వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 13 బంతుల్లో 15 పరుగులు చేసి నిష్క్రమించాడు.ఈ క్రమంలో విజయానికి 62 బంతుల్లో కేవలం 7 పరుగులు అవసరం కాగా.. కేఎల్ రాహుల్ (5 బంతుల్లో 3), నమన్ ధీర్ (3 బంతుల్లో 5) కలిసి విజయలాంఛనం పూర్తి చేశారు.

భారత్ వర్సెస్ న్యూజిలాండ్ తొలి వన్డే సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్- 185(40.2)
భారత్- 143/5(22.4)
ఫలితం: డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం 143 పరుగుల లక్ష్యం ఛేదించి ఐదు వికెట్ల తేడాతో గెలిచిన భారత్.

సెన్సార్ బోర్డు అభ్యంతరంతో మారిన మౌళి సినిమా టైటిల్.. కొత్త పేరు ఏంటంటే?



'లిటిల్ హార్ట్స్' చిత్రంతో సెన్సేషనల్ సక్సెస్ అందుకున్న యూట్యూబ్ సెన్సేషన్, యంగ్ హీరో మౌళి.. ఇప్పుడు ఓ ఇంట్రెస్టింగ్ క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే ఈ సినిమాకు 'దొంగ నా కొడుకు' అనే టైటిల్ను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 13న గ్రాండ్ గా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా టైటిల్ పై సెన్సార్ బోర్డు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫుల్ టైటిల్ కి బదులుగా దాని షార్ట్ ఫార్మ్ అయిన 'ఎల్ఓ' పేరుతోనే ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ కి ఆడియన్స్ నుంచి సాలిడ్ రెస్పాన్స్ రాగా.. ప్రమోషన్స్ హోరెత్తిస్తున్న చిత్రబృందం త్వరలోనే ట్రైల ర్ను కూడా లాంచ్ చేయడానికి ప్లాన్ చేస్తోంది. కాగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. శ్రీను కంబాల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మౌళి సరసన సుష్మిత శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. సింజిత్ యెర్రమిల్లి సంగీతాన్ని అందిస్తున్నారు.

ఇంట్రెస్టింగ్ గా 'ఇట్లు అర్జున' ట్రైలర్

అనీష్ హీరోగా పరిచయమవుతున్న సినిమా 'ఇట్లు అర్జున'. అనస్వర రాజన్ హీరోయిన్. గత నెలలో ఈ మూవీ రిలీజ్ కావాలి. కానీ 'ఆదర్శ కుటుంబం' వాయిదాలకు ఇది ఆలస్యమవుతూ వచ్చింది. ఎట్టకేలకు వచ్చే శుక్రవారం(నవంబర్ 13) థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు.

ట్రైలర్ అయితే ఆసక్తికరంగా బాగుంది. విజువల్స్, తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మూవీపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేశాయి. అనీష్కి ఇది తొలి సినిమా. కానీ మూగవాడి పాత్ర చేస్తున్నాడు. మరి ఏ మేరకు మెప్పిస్తాడో చూడాలి? మహేశ్ ఉప్పాల దర్శకుడు కాగా డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మించాడు.



రజనీకాంత్ మూవీలో శ్రీలీల..

సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో, అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న చిత్రం 'ధర్మన్'. కమల్ హాసన్ రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ మూవీలో శ్రీలీల నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా మేకర్స్ ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేస్తూ.. శ్రీలీల ఈ సినిమాలో నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇక, ఈ చిత్రంలో రజనీ వైద్యుడిగా కనిపించనున్నారు. రామ్ పోతినేని, సిమ్రాన్, రాశీఖన్నా, నయనతార యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

హీరోయిన్లకూ.. అలాంటి భారీ కటౌట్‌లు ఉండాలి: రెజీనా



చిత్ర పరిశ్రమలో హీరోలకు భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తుంటాం. అయితే హీరోయిన్లకూ అదే స్థాయిలో అభిమానుల నుంచి గుర్తింపు, గౌరవం దక్కాలంటున్నారు నటి రెజీనా. నయనతార నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్-2' (తెలుగులో 'మహాశక్తి') విడుదల సందర్భంగా ఆమెకు 60 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేయడంపై రెజీనా హర్షం వ్యక్తం చేశారు. గతంలో హీరోలకే పరిమితమైన ఈ కటౌట్లు ఇప్పుడు కథానాయికలకూ దక్కడం మంచి మార్పన్నారు. ఈ చిత్రంలో ప్రతినాయికగా నటించిన ఆమె.. ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ''దశాబ్దాలుగా తమిళ చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోలకే భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తున్నాం. హీరోయిన్లకు అలాంటి గౌరవం దక్కడం చాలా అరుదు. నయనతారకు భారీ కటౌట్ ఏర్పాటు చేసిన తర్వాతే 'తాయ్ కిళవి' సినిమా కోసం రాధిక మేడమ్కు కూడా ఏర్పాటు చేశారని తెలిసింది. హీరోలతో సమానంగా భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం పరిశ్రమలో మంచి మార్పు'' అని ఆమె అభిప్రాయపడ్డారు.

''ఈ సినిమాతో తొలిసారి ఓ భారీ కమర్షియల్ చిత్రంలో ప్రతినాయికగా నటించే అవకాశం వచ్చింది. ఇదొక కొత్త అనుభూతి. ఒకే తరహా పాత్రలకు పరిమితం కావడం నాకు నచ్చదు. అందుకే కథల ఎంపిక విషయంలో జాగ్రత్తగా ఉంటున్నా. తక్కువ సినిమాలు చేసినా మంచి పాత్రలు ఎంచుకోవాలనుకుంటున్నా'' అని ఆమె తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, ఊర్వశి, రెజీనా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవంబరు 6న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

'స్త్రీ 2' తర్వాత ఏ సినిమా చేయకపోవడానికి కారణమిదే: శ్రద్ధా కపూర్

భారీవిజయం తర్వాత వరుసగా సినిమాలకు సంతకాలు చేస్తుంటారు కథానాయికలు. కానీ, బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఆమె ప్రధానపాత్రలో నటించిన 'స్త్రీ 2' (2024) ప్రపంచవ్యాప్తంగా రూ.875 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఆ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు వచ్చినా.. భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినా కొత్త చిత్రాలకు అంగీకరించలేదని శ్రద్ధ తెలిపారు. తాజాగా సోషల్మీడియాలో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ లో ఆమె ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. సెషన్ లో భాగంగా ఓ అభిమాని.. 'కెరీర్ లో ముందుకెళ్లాలనుకునే యువతులకు మీరిచ్చే సలహా ఏంటని?' అడగ్గా.. ఆమె బదులిచ్చారు.

''నా అనుభవాన్నే చెబుతాను. 'స్త్రీ 2' తర్వాత నాకు చాలా సినిమా అవకాశాలు వచ్చాయి. మంచి పారితోషికాలు కూడా ఆఫర్ చేశారు. కానీ మనసుకు నచ్చిన కథ దొరికే వరకు ఓపికగా ఎదురుచూడాలని నిర్ణయించుకున్నా. అనుకున్నట్లే చేశా. మీ మనసు చెప్పేది వినండి. కొన్నిసార్లు అది కష్టంగా అనిపించినా.. చివరికి తగిన ఫలితం ఉంటుంది'' అని ఆమె చెప్పారు.

ప్రస్తుతం శ్రద్ధ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఈథా' చిత్రంలో నటిస్తున్నారు. ప్రముఖ లావణి కళాకారిణి 'విఠాబాయి నారాయణ్ గావ్ కర్' జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. డిసెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.





జెట్ స్పీడ్‌లో నాని 'బ్లడీ రోమియో'..

మొదటి షెడ్యూల్ పూర్తి!

నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ది ప్యారడైజ్ ఊహించని ఫలితాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇక దీని నుంచే వెంటనే బయటకి వచ్చిన నాని తన తదుపరి సినిమా 'బ్లడీ రోమియో' లోకి సరికొత్త ఎనర్జీ, లుక్ తో వచ్చేసారు. దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ రీసెంట్ గానే షూటింగ్ ని మొదలు పెట్టుకోగా ఆల్రెడీ ఫస్ట్ షెడ్యూల్ ని పూర్తి చేసేసుకున్నట్టు తెలుస్తుంది. సో ఈ లెక్కన మేకర్స్ ఎంత స్పీడ్ గా వర్క్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఢిల్లీలో స్టార్ట్ చేసిన ఈ షెడ్యూల్ ని మేకర్స్ ముగించారట. ఇక నెక్స్ట్ షెడ్యూల్ కోసం కూడా సన్నద్ధం అవుతున్నట్టు తెలుస్తుంది. ఇది హైదరాబాద్ లోనే ఉండనున్నట్టు టాక్. ఇక ఈ చిత్రానికి ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తుండగా నాని శ్యామ్ సింగ రాయ్ నిర్మాణ సంస్థ నిహారిక ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.